


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 07, సంచిక: 327 | సోమవారం | 28-10-2024 | కరీంనగర్ | Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## ఎక్సైజ్ అనుమతి తీసుకోలేదు

జన్వాడ ఫామ్ హౌస్ కేసుపై ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. ఫామ్‌హౌస్‌లో జరిగిన మద్యం పార్టీకి ఎక్సైజ్ శాఖ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. ఎవరైనా పిర్యాదు చేస్తే .. దానిపై స్పందించి.. ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు సోదాలు చేయడం పరిపాటి అని పేర్కొన్నారు. చట్టం ఎవరికి చుట్టం కాదని స్పష్టం చేశారు. విశ్వాసనీయ సమాచారం అందడంతో ఎస్‌ఓటి పోలీసులు , ఎక్సైజ్ అధికారులు ఫామ్‌హౌస్‌లో తనిఖీలు నిర్వహించారన్నారన్నారు.




# అధికారికంగా సదర్

ఇక ప్రతియేటా సమ్మేళనాన్ని ప్రభుత్వపరంగా నిర్వహిస్తాం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన

ఉత్సవాలు నిర్వహించడం రాష్ట్రానికి గర్వకారణం

యాదవులకు రాజకీయంగా మరిన్ని అవకాశాలు కల్పిస్తామని భరోసా



ప్రజాపక్షం/హైదరాబాద్

యాదవుల సదర్ సమ్మేళనాన్ని ఇకపై ఏటా ప్రభుత్వ పరంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ అధ్యక్షతన ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో ఆదివారం యాదవుల సదర్ సమ్మేళన కార్యక్రమం జరగగా ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, హైదరాబాద్ ఇంఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్, సిడబ్ల్యూసి మెంబర్, ఏపి మాజీ మంత్రి రఘువీరారెడ్డి , జిహెచ్‌ఎంసి కార్పొరేటర్లు, ఇతర నేతలు పాల్గొన్నారు. ఈ సదర్ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ నగరంలో సదర్ ఉత్సవాలు నిర్వహించడం రాష్ట్రానికి గర్వకారణంగా ఉందని, సదర్ సమ్మేళనం రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని తాను ఆనాడే చెప్పానని వెల్లడించారు. ఇక నుంచి ప్రతీ ఏటా సదర్ సమ్మేళనం ప్రభుత్వ పరంగా అధికారికంగా నిర్వహించాలని ఈ వేదిక నుంచి అధికారులకు ఆదేశాలు ఇస్తున్నానన్నారు. యాదవులు రాజకీయంగా ఎదగాలని సిఎం రేవంత్ ఆకాంక్షించారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో యాదవుల పాత్ర ఎంతో ఉందన్నారు. యాదవులకు రాజకీయంగా మరిన్ని అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. యాదవులు ధర్మం వైపు నిలబడుతారని చెబుతూ ధర్మం వైపు నిలబడ్డ ఎవరూ అన్యాయానికి గురికారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో యాదవుల పాత్ర కీలకమైనదని అన్నారు. సదర్ అంటే యాదవుల ఖదర్ అని, తరువాయి 2లో

> “ఆనాడు మూసీ పరీవాహక ప్రాంతాల్లో యాదవులు పశుగ్రాసాన్ని పెంచుకునేవారు. మురికి కూపంగా మారిన మూసీకి పునరుజ్జీవం కల్పిద్దాం. ఈ నగర అభివృద్ధికి యాదవులు అండగా నిలబడాలి. మూసీ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని మరోసారి హామీ ఇస్తున్నా. మూసీలో నరకాన్ని అనుభవిస్తున్న ప్రతీ పేదవాడి జీవితంలో వెలుగులు నింపుతాం. ఏ శక్తి అడ్డొచ్చినా నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసే బాధ్యత కాంగ్రెస్ పార్టీదే.
>
> – సిఎం రేవంత్‌రెడ్డి

# జన్వాడ ఫామ్‌హౌస్‌లో పోలీసుల దాడులు

భారీ శబ్దాలతో పార్టీ : అదుపులోకి 35 మంది

పరీక్షల్లో ఒకరికి కొకైన్ పాజిటివ్

విదేశీ మద్యం స్వాధీనం

ఫామ్‌హౌస్ కెటిఆర్ బావమరిదిదిగా గుర్తింపు

పరారీలో యజమాని రాజ్ పాకాల

రాజ్‌పాకాల సోదరుడి విల్లాలో సోదాలు

బిఆర్‌ఎస్ నేతల అరెస్టు



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడలోని ఫామ్‌హౌస్‌పై సైబరాబాద్ ఎస్‌ఓటి పోలీసులు దాడులు చేశారు. జన్వాడ రిజర్వ్ కాలనీలో ఉన్న రాజ్‌పాకాల ఫామ్‌హౌస్‌లో శనివారం రాత్రి పార్టీ నిర్వహించారు. భారీ శబ్దాలతో పార్టీ నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు తనిఖీలు చేశారు. పార్టీలో పాల్గొన్న 24 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా, తరువాయి 2లో

## కెటిఆర్‌పై ప్రభుత్వం కుట్ర

సెర్చ్ వారెంట్ లేకుండా రాజ్‌పాకాల ఇంటిని ఎలా సోదా చేస్తారు : బిఆర్‌ఎస్ మాజీ మంత్రులు

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌పైన ప్రభుత్వం కుట్రకు పాల్పడుతోందని బిఆర్‌ఎస్ మాజీ మంత్రులు ఆరోపించారు.సెర్చ్ వారెంట్ లేకుండా రాజ్ పాకాల ఇంట్లోకి పోలీసులు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని,రాష్ట్రంలో ఎవ్వరూ శుభకార్యం చేసుకోవద్దా అని వారు మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తలసాని శ్రీనివాస్ యాదవ్, వేముల ప్రశాంత్ రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. ఆబ్కారీ,పోలీసులు పంచనామా చేసి నాలుగు బాటిల్స్ ఎక్కువగా ఉన్నాయని చెప్పారని, వ్యక్తిని,వ్యక్తి కుటుంబాన్ని టార్గెట్ చేయడం తరువాయి 2లో

## రేవ్ పార్టీలో పాల్గొన్న ఎవరినీ వదలొద్దు

కేంద్ర మంత్రి బండి సంజయ్

**ప్రజాపక్షం/హైదరాబాద్/గజ్వేల్ :** జన్వాడ ఫామ్ హౌస్‌లో రేవ్ పార్టీలో పాల్గొన్న ఎవరినీ వదలవద్దని, ప్రతి ఒక్కరిని అరెస్ట్ చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కెటిఆర్ బావమరిది ఫామ్‌హౌస్‌లో రేవ్ పార్టీలా అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫామ్ హౌస్ చుట్టూ సిసి ఫుటేజీతో సహా ఆధారాలు ధ్వంసం కాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఈ ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ కేసులో ఓ ప్రముఖుడిని కావాలనే తప్పించారని మీడియాలో వార్తలు వస్తున్నాయని ఆయన ఆరోపించారు.ఒకవేళ డ్రగ్స్ తీసుకుంటూ దొరికినా, తాము డ్రగ్స్ తీసుకోలేదంటూ బుకాయిస్తారేమోనన్నారు.కాంగ్రెస్, బిఆర్‌ఎస్ రాజీ రాజకీయాలు చేయడం సిగ్గుచేటని, యువతను భ్రష్టు పట్టిస్తున్న డ్రగ్స్‌పై రాజీ ధోరణి ఎందుకని ప్రశ్నించారు. రాష్ట్రంలో తరువాయి 2లో



03

**కామన్ స్కూల్ విధానం అమలు చేయాలి**

# మహిళా సంఘాల గ్రూపుల ద్వారా బస్సులు కొనుగోలు

ఆర్‌టిసికి అద్దెకిచ్చే ప్రణాళికలను తయారుచేస్తున్నాం

మహిళలు ఆర్థికంగా బలపడితేనే కుటుంబం బాగు

అందుకే మహిళా సంఘాలకు లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు

ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మల్లు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్

రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడమే లక్ష్యంగా ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం బాగుపడుతుందని ప్రభుత్వం భావించి వడ్డీ లేని రుణాలను అందిస్తూ ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం చేపట్టిందన్నారు. మహిళా సంఘాల సభ్యుల గ్రూపుల ద్వారా బస్సులు కొనుగోలు చేసి ఆర్టిసికి అద్దెకు ఇచ్చే ప్రణాళిక తయారు చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో కూడా మహిళలకు భాగస్వామ్యం కల్పిస్తామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఆదివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, వైరా ఎంఎల్‌ఎ మాలోత్ రాందాస్ నాయక్, అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజలతో కలిసి కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన బస్‌స్టాప్ షెల్టర్, స్త్రీ టీ స్టాల్, కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన లేడీస్ లాంజ్, ఉద్యోగుల భోజనశాల, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ప్రారంభించారు. ఇందిరా మహిళా సంఘాల సభ్యులతో ఉప ముఖ్యమంత్రి ముచ్చటించారు. మహిళా సంఘాలకు ప్రజా ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ లేని రుణాలతో ఎటువంటి వ్యాపారాలు చేస్తున్నారు. లాభసాటిగా నడవడానికి తీసుకోవాల్సిన చర్యలు మొదలగు అంశాలను ఉప ముఖ్యమంత్రి వివరించారు. గత ప్రభుత్వ హయాంలో మహిళలకు వడ్డీ లేని రుణాలను తరువాయి 2లో

## ముగిసిన ‘గ్రూప్ 1’ మెయిన్స్ పరీక్షలు

ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రూప్1 మెయిన్స్ పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. గ్రూప్ 1 మెయిన్స్ చివరి రోజున ‘తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఏర్పాటు’ అనే సబ్జెక్ట్‌పైన పరీక్ష జరిగింది. ఈ పరీక్షను 21,151 మంది(67.3 శాతం) రాశారు. ఈనెల 21న మెయిన్స్ పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. మొత్తం 513 పోస్టులకు గ్రూప్ 1 నోటిఫికేషన్ జారీ చేశారు. మెయిన్స్ పరీక్షకు 31,383 మంది అభ్యర్థులు అర్హత సాధించిన విషయం తెలిసిందే. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలోల 46 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష ప్రారంభం నుంచి చివరి వరకు పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

## సస్పెన్షన్ ఎత్తివేయండి..

లేదా మమ్మల్ని సస్పెండ్ చేయండి

ఉన్నతాధికారులకు టిజిఎస్‌పి పోలీసులు లేఖ

కొనసాగుతున్న ఆందోళనలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఒకే పోలీసు విధానం ఉండాలని ..గత కొన్ని రోజులుగా ఆందోళనలలో పాల్గొని సస్పెన్షన్‌కు గురైన తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీసు (టిజిఎస్‌పి)కి చెందిన 39 మందిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని టిజిఎస్‌పి పోలీసులు ఉన్నతాధికారులకు లేఖలు రాశారు. ఆందోళనలలో తాము కూడా పాల్గొన్నామని, తమను కూడా సస్పెండ్ చేయండి లేదంటే సస్పెండ్ చేసిన వారిపై తరువాయి 12లో





## గ్రీన్‌హంట్‌ను వ్యతిరేకించడం వల్లే

ప్రొఫెసర్ సాయిబాబాపై ఉపా కేసు : జైల్లో నిర్బంధం

సంస్మరణ సభలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి

ఆదివాసీలను హననం చేసే ఆపరేషన్ గ్రీన్ హంట్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఎన్నో సభలు, సమావేశాలు నిర్వహించడం మూలంగానే సహించలేని ప్రభుత్వం ప్రొఫెసర్ సాయిబాబాపై అక్రమ ఉపా కేసు మోపి జైల్లో నిర్బంధించిందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. ఐక్య ఉద్యమాల ద్వారా ఉపా చట్టం కోసం పోరాడుదామని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబా సంస్మరణ సభ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజాసంఘాల ఆద్వర్యంలో నిర్వహించారు. మూడు సెషన్‌లుగా జరిగిన ఈ కార్యక్రమానికి విరసం నేత బాలసాని రాజయ్య, పౌరహక్కుల సంఘం నాయకులు శ్రీపతి రాజగోపాల్, నారా వినోద్‌లు అధ్యక్షత వహించారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని బిజెపి మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడడానికి ఒక వేదికను ఏర్పాటు చేయడానికి సిపిఐ పార్టీ కృషి చేస్తుందన్నారు. ఆదివాసీల హననాన్ని ఆపి ఉపా చట్టం రద్దు కోసం రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రొఫెసర్ సాయిబాబా కూతురు మంజీరా మాట్లాడుతూ సాయిబాబాను తరువాయి 12లో



## క్రౌన్ అందుకున్న రేచల్ గుప్తా

70 దేశాల భామలను వెనుకకు నెట్టిన విజేత

బ్యాంకాక్‌లో జరిగిన ‘మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ 2024’ పోటీలు

**న్యూఢిల్లీ :** పంజాబ్‌కు చెందిన 20 ఏళ్ల రేచల్ గుప్తా ప్రతిష్ఠాత్మక ‘మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ 2024’ కిరీటం అందుకున్నారు. బ్యాంకాక్‌లో జరిగిన ఈ పోటీల్లో తరువాయి 12లో

# చదువులపై బకాయి భారం

చెల్లింపుల కోసం యాజమాన్యాల ఆందోళన

విద్యార్థుల భవితవ్యం పై తీవ్ర ప్రభావం

ఆందోళన బాటలో అద్దె భవనాల యజమానులు

ప్రజాపక్షం/ఖమ్మం

విద్యా రంగంపై బకాయిలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఒక పక్క ఫీజు రీయింబర్స్‌మెంట్, మరో పక్క విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు వేల కోట్ల రూపాయలు బకాయిలు ఉండడంతో చదువుల్లో ముందుకెళ్లలేని పరిస్థితి. తెలంగాణ ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యతనిస్తూ ఉపాధ్యాయ నియామకాలు చేపట్టడంతో పాటు సమీకృత విద్యాలయాల స్థాపనకు శ్రీకారం చుట్టినప్పటికీ గత ప్రభుత్వం పడావ్ పెట్టిన బకాయిలు ఈ ప్రభుత్వానికి గుదిబండలా మారాయి. ఉపకార వేతనాలు చెల్లించక ఇబ్బందులు పడుతుండగా కళాశాల యాజమాన్యాలు ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ జమ కాకపోవడంతో విద్యార్థుల ధృవపత్రాలు ఇవ్వడాన్ని యాజమాన్యాలు నిలిపివేశాయి. ఆ కళాశాలలో విద్యను పూర్తి చేసుకుని ఉన్నత విద్యకు వెళ్లాలనుకున్న విద్యార్థులకు ఇప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి ప్రతిబంధకంగా మారింది. ప్రొఫెషనల్ విద్యార్థులకు సంబంధించి నాలుగు వేల కోట్ల రూపాయలు బకాయిలు ఉండగా నాన్ ప్రొఫెషనల్‌కు సంబంధించి రెండువేల కోట్లు బకాయిలు ఉన్నట్లు సమాచారం. వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి ఉండడంతో కళాశాలల నిర్వహణ భారంగా మారిందని పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని కళాశాల యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వం దశల వారీగానైనా చెల్లించాలని లేనిపక్షంలో కళాశాలలను మూసివేయాల్సిన పరిస్థితి తరువాయి 2లో



# పల్లె పాలన గాడితప్పుతోంది...

కుంటుపడుతున్న గ్రామ ప్రగతి

ప్రకృతి వనాలపై పట్టింపు కరువు

నిరుపయోగంగా నీటి ట్యాంకర్లు

పంచాయతీలను పట్టించుకోని ప్రత్యేకాధికారులు

క్షేత్రస్థాయిలో కొరవడిన పర్యవేక్షణ

ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి




పల్లె పాలన పట్టు తప్పుతున్నది.ప్రజాప్రతినిధులు లేక సమస్యలు పట్టించుకునే వారు కరువయ్యారు. గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ఈ ఏడాది జనవరితో ముగియగా ప్రభుత్వం పంచాయతీల పాలనా బాధ్యతలను అధికారులకు అప్పగించింది. ప్రతీ గ్రామానికి గెజిటెడ్ అధికారులను ప్రత్యేక అధికారిగా నియమించింది. అధికారులు కార్యాలయాలకే పరిమితం అవుతుండడం... ఉన్నతా ధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పల్లెల్లో పాలన గాడితప్పుతున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణాల మాదిరిగానే పల్లెల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రకృతి వనాలు ఎండుముఖం పట్టి నిర్వహణ లోపంతో అధ్వానంగా మారుతు న్నాయి. జిల్లాలో గ్రామ పంచాయతీల పరిధి లో పల్లె ప్రకృతి వనాలను తరువాయి 2లో

# క్యూబాపై అమెరికా ఆంక్షలు ప్రతిఘటిద్దాం

## వర్కర్స్, కమ్యూనిస్టు పార్టీల పిలుపు




**హవానా:** క్యూబాపై అమెరికా ఆంక్షలకు వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత బలోపేతం చేసుకోవాలంటూ వర్కర్స్ కమ్యూనిస్టు పార్టీలు పిలుపునిచ్చాయి. క్యూబాకు సంఘీభావాన్ని ప్రకటించాయి. క్యూబా ఒంటరి కాదని, ఎల్లప్పుడు అండగా నిలుస్తామని నినదించాయి. క్యూబా విప్లవానికి, క్యూబా ప్రజలకు, క్యూబా కమ్యూనిస్టు పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ఉమ్మడి ప్రకటన వెలువరించాయి. క్యూబాను ఉక్కిరిబిక్కిరి చేసేలా అమెరికా ఆంక్షలు విధిస్తోందని ఆస్ట్రేలియా, డెన్మార్క్, ఎల్ సాల్వడార్, గ్రీస్, భారత్, ఐర్లాండ్, మెక్సికో, నెథర్లాండ్స్, నార్వే, పాకిస్తాన్, పరాగ్వా, పెరూ, ఫిలిప్పీన్స్, రొమేనియా, స్పెయిన్, కటాలోనియా, స్వాజిలాండ్, వెనిజులా దేశాల కమ్యూనిస్టు పార్టీలు ఆక్షేపించాయి. ఉగ్ర దేశాల జాబితా నుంచి క్యూబా పేరు తొలగించాలని డిమాండ్ చేశాయి. ప్రస్తుత బైడెన్ ప్రభుత్వం, గత ట్రంప్ ప్రభుత్వం క్యూబాపై దుష్ట చర్యలకు పాల్పడ్డాయని విమర్శించాయి. కఠోర ఆంక్షలు విధిస్తూ ఆ దేశాన్ని అణచివేయాలని చూస్తున్నాయని అగ్రరాజ్యం చర్యలను దుయ్యబట్టాయి. తక్షణమే ఆయా ఆంక్షలను రద్దు చేయాలని, ఉగ్రదేశంగా క్యూబాపై వేసిన ముద్రను తొలగించాలని కమ్యూనిస్టు, సోషలిస్టు, వర్కర్ల పార్టీలు ఐక్యంగా డిమాండ్ చేశాయి. అదే సమయంలో హరికేన్ ఆస్కార్ వల్ల జరిగిన నష్టంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంఘీభావం తెలిపాయి.

# జార్జియా ఎన్నికల్లో అధికార పార్టీదే గెలుపు



**టిఫ్లిస్:** జార్జియాలో అధికార పార్టీని తిరిగి విజయం వరించింది. సార్వత్రిక ఎన్నికలో ఈ పార్టీ గెలిచినట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. జార్జియన్ డ్రీమ్ పార్టీకి 54.08శాతం ఓట్లు వచ్చినట్లు తెలిపింది. ఈ పార్టీ 2012 నుంచి జార్జియాలో అధికారంలో ఉంది. రష్యా, చైనాకు మొగ్గు చూపే పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని 99శాతం సర్వేలు అంచనా వేశాయి. నాలుగు విపక్షాలకు 37.58శాతం ఓట్లు వచ్చాయని ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎన్నికల కమిషనర్ జార్జి కలాందరిష్విలి తెలిపారు. ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛగా జరిగాయన్నారు. ఈ ఫలితాలతో 150 మంది సభ్యులు ఉండే పార్లమెంటులో జార్జియన్ డ్రీమ్ పార్టీకి 91 స్థానాలు వచ్చాయి. రాజ్యాంగబద్ధ మెజారిటీ మార్కు 113ను ఆ పార్టీ చేరుకోలేదు. అయితే మంచి ఫలితాన్ని సాధించినట్లు ఆ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మముకా తెలిపారు. మరోవైపు ఈ ఫలితాన్ని విపక్షాలు తోసిపుచ్చాయి. ఇవి మోసపూరితమని ఆరోపించాయి. జార్జియా భవిష్యత్‌ను దొంగలించేందుకు ప్రయత్నించారని విమర్శించాయి. ఈ ఫలితాన్ని అంగీకరించబోమని యునైటెడ్ నేషనల్ మూవ్‌మెంట్ (యూఎన్‌ఎం) ప్రకటించింది. జార్జియన్ డ్రీమ్ అధికారంలో కొనసాగలేదని పేర్కొంది.

## లిస్బన్‌లో పోలీసు జులంపై ప్రజాగ్రహం

### వీధుల్లోకి వచ్చిన వేలాది మంది: భారీ నిరసన ప్రదర్శన

**లిస్బన్:** లిస్బన్‌లో పోలీసు జులంపై ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంది. వేలాది మంది వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. న్యాయం కోసం డిమాండ్ చేస్తూ భారీ ప్రదర్శన నిర్వహించారు. 'మమ్మల్ని చంపడం ఆపండి' అని నినాదమిచ్చారు. 'పోలీసులే హత్య చేస్తుంటే ఎవరిని పిలవాలి' అంటూ ప్రశ్నించారు. తమ పరిసరాల్లో పోలీసు జులం సర్వసాధారణమవుతోందని ప్రదర్శనకారులు తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తంచేశారు. కేప్ వర్డెపోర్చుగీస్ పౌరుడు ఓడెయిర్ మోనిజ్ (43)ని పోలీసులు కాల్చి చంపిన ఘటన స్థానికంగా అనిశ్చితికి దారితీసింది. ఈ ఘటనకు నిరసనగా మానవ హక్కుల సంఘం 'విడా జస్టా' పిలుపుతో లిస్బన్‌లో భారీ ప్రదర్శన జరిగింది. మరోవైపు పోలీసులకు మద్దతుగా సెంట్రల్ లిస్బన్‌లో వేరొక ర్యాలీ నిర్వహించగా... అక్కడక్కడ స్వల్ప ఘర్షణలు జరిగాయి. హింసను నివారించేందుకు ప్రదర్శనకారులు తమ మార్గాన్ని మార్చుకొన్నారు. దీంతో మార్చ్ శాంతియుతంగా సాగింది. 'ఒడెయిక్‌కు న్యాయం' అంటూ పోస్టర్లు ప్రదర్శిస్తూ ప్రదర్శనకారులు పెద్దపెట్టున నినాదాలు చేశారు.

## వికీపీడియాకు విరాళాలు ఇవ్వొద్దు: ఎలన్ మస్క్




**వాషింగ్టన్:** వామపక్ష కార్యకర్తల అధ్వర్యంలో నడుస్తోన్న వికీపీడియాకు విరాళాలు ఇవ్వొద్దని టెస్లా అధినేత ఎలన్ మస్క్ పిలుపునిచ్చారు. వికీపీడియా తన పేరును డికీపీడియాగా మార్చుకుంటే ఆ సంస్థకు బిలియన్ డాలర్లు ఇస్తానని ఆయన గతంలో ప్రకటన చేశారు. మార్చుకోవాలని ఆయన సూచించారు. వికీపీడియాకు చెందిన 40 మంది సంపాదకుల నేతత్వంలోని ఓ బందం.. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తోందని ఆరోపిస్తూ అమెరికాకు చెందిన న్యూస్ వెబ్ సైట్ పైరేట్ వైర్స్ ప్రచురించిన కథనాన్ని షేర్ చేశారు. ఏడాదిగా జరుగుతున్న ఇజ్రాయెల్‌గాజా పోరులో ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా వేర్పాటువాద ఇస్లామిస్ట్ గ్రూప్‌లకు అనుకూలంగా వికీపీడియా సంపాదకుల నేతత్వంలో దాదాపు 40 మంది పనిచేస్తున్నారు' అని కథనాన్ని షేర్ చేసిన మస్క్.. 'వామపక్ష కార్యకర్తలు నడిపే వికీపీడియాకు విరాళాలు ఇవ్వొద్దు..' అని పేర్కొన్నారు.

## మృత్యుకూపాలుగా రక్షిత ప్రాంతాలు

# ఉత్తర గాజా, బీరుట్‌పై ఇజ్రాయెల్ దాడులు

### నిర్వాసిత ప్రాంతాలపై బాంబులు: 45 మంది మృతి




**జెరూసలేం:** గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయెల్ భీకర దాడులతో రక్షిత ప్రాంతాలన్నీ మృత్యుకూపాలుగా మారిపోయాయి. పలస్తీనియన్ల ప్రాణాలకు హామీ లేకుండా పోయింది. నిర్వాసిత ప్రాంతాలు, శిబిరాలపైనా ఇజ్రాయెల్ వైమానిక, భూతల దాడులు సాగిస్తోంది. దీంతో ప్రాణ నష్టం భారీగా సంభవిస్తోంది. తాజాగా ఉత్తర గాజాలోని బెయిల్ లహియాలోని ఆరు భవనాలపై ఇజ్రాయెల్ దళాలు బాంబుల వర్షం కురిపించగా 45 మంది చనిపోయారు. 2023 అక్టోబరు నుంచి ఇజ్రాయెల్ జరుపుతున్న దాడుల్లో ఇప్పటివరకు 43వేల మంది పలస్తీనియన్లు చనిపోగా, 1,00,544 మంది గాయపడినట్లు గాజా ఆరోగ్యశాఖ తెలిపింది. దీంతో పలస్తీనా భూభాగంలోని మొత్తం జనాభాను తుదిముట్టించేందుకు సాగుతున్న వ్యూహాత్మక మారణహోమాన్ని ఆపాలంటూ అమెరికాకు కౌన్సిల్ ఆన్ అమెరికన్ ఇస్లామిక్ రిలేషన్స్ (సీఏఐఆర్) పిలుపునిచ్చింది. గాజాలో ఎవరూ సురక్షితం కాదని... మారణహోమంలో వారు ఎప్పుడైనా ప్రాణాలు కోల్పోవచ్చని ఐరాస ప్రత్యేక రిపోర్టర్ అల్బనీస్ ఆందోళన వ్యక్తంచేశారు. అటు బీరుట్‌లోనూ ఇజ్రాయెల్ వైమానిక దాడులు కొనసాగాయి. ఇరాన్‌లోనూ ఉద్రిక్త పరిస్థితికి ఇజ్రాయెల్ దళాలు తెరతీశాయి. శనివారం దాడుల్లో తమ సైనికులు నలుగురు చనిపోయినట్లు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ తెలిపారు. గాజాలోని ఇళ్లతో సహా నిర్వాసిత ప్రాంతంపై ఇజ్రాయెల్ సైన్యం తాజా దాడుల్లో చనిపోయిన వారిలో పిల్లలు, మహిళలు ఎక్కువని పలస్తీనా అధికారిక వార్తా సంస్థ డబ్ల్యుఎఎఫ్‌ఎ నివేదించింది. ఆ సమయంలో పౌర రక్షణ లేక వైద్య బృందాలు చేరుకొనే పరిస్థితి లేకపోవడంతో బాధితులను కాలినడకన, గాడిద బండ్లపై తరలించాల్సి వచ్చినట్లు జిన్హువాతో స్థానికులు చెప్పారు.

**లెబనాన్ ఊళ్లు ఖాళీ...**

తమ దాడులను విస్తరిస్తున్న ఇజ్రాయెల్... లెబనాన్‌లో ఒక దాని తర్వాత ఒకటిగా మొత్తం 14 ఊళ్లను బలవంతంగా ఖాళీ చేయించింది. అక్కడ వారంతా అవాలీ నదికి ఉత్తరం వైపునకు తరలిపోయేలా ఆదేశాలిచ్చింది. ప్రాణాలు కాపాడుకోవాలంటే వెళ్లిపోండి అని హెచ్చరించింది. 'అవాలీ నదికి ఉత్తరం దిక్కుగా వెళ్లిపోండి. దక్షిణం వైపుకు వెళ్లేందుకు అనుమతి లేదు. అటుగా వెళ్లారో ఆపాయమే. హెజ్బుల్లా స్థావరాలు, వర్గాలు, ఆయుధాలు ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండండి లేదంటే ప్రాణాలు పోతాయి' అని ఇజ్రాయెల్ సైన్యానికి అధికార ప్రతినిధి పేర్కొన్నారు. ఖాళీ చేసే గ్రామాల పేర్లనూ ఆయన ప్రకటించారు.




## వెనిజులా నోరు నొక్కలేరు: మదురో



**కారకస్:** బ్రిక్స్‌లో చేరాలనుకున్న తమ ప్రతిపాదనను బ్రెజిల్ వీటో చేయడంపై వెనిజులా అధ్యక్షుడు నికోలాస్ మదురో అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ చర్య తర్వాత తమ దేశం మౌనంగా ఉండబోదని ప్రకటించారు. బ్రెజిల్ నిర్ణయాన్ని అనైతికమైనదిగా పేర్కొన్నారు. ఇటీవల రష్యాలోని కజన్ నగరంలో జరిగిన సమావేశంలో బ్రెజిల్ వీటో అధికారం ద్వారా తమను అడ్డుకోవడాన్ని మౌనంగా భరించబోమని స్పష్టంచేశారు. 'వెనిజులాను ఎవ్వరూ అడ్డుకోలేరు... నిషేధించలేరు... నోరు నొక్కేయలేరు. ఇది ఇప్పుడు, ఎప్పుడు జరగబోదు' అని బ్రెజిల్ పేరు ప్రస్తావించకుండా మదురో అన్నారు.

## ఎవరినీ వదలవద్దు

(మొదటి పేజీ తరువాయి)

డ్రగ్స్ అక్రమ రవాణా, రేవ్ పార్టీపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. చట్టం ముందు అందరూ సమానమేనే విషయాన్ని ప్రభుత్వం నిరూపించాలనిఅన్నారు.

**సమగ్ర విచారణ జరుపాలి : కిషన్‌రెడ్డి**

జన్వాడ ఫామ్‌హౌస్‌లో అసలు ఏమి జరిగిందో సమగ్ర విచారణ చేపట్టి నిగ్గు తేల్చాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎవరి ఫామ్ హౌస్ ఎవరిదైనా, అందులో సిఎం బంధువు ఉన్నా, మాజీ ముఖ్యమంత్రి బంధువులున్నా సమగ్ర విచారణ జరపాలన్నదే బిజెపి స్టాండ్ అని ఆయన స్పష్టం చేశారు. గతంతో ఫామ్‌హౌజ్‌లో ఓ స్వామి బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎను కొనుగోలు చేసేందుకు డబ్బులతో వచ్చారని ఆ ఎంఎల్‌ఎలకు డబ్బులు ఇచ్చారంటూ మూడున్నర గంటల పాటు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఓ సినిమా చూపించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ స్వామిజీ ఎవరో ఇంతవరకు మాకు తెలియదని, ఆయన ఇచ్చినట్లు చెబుతున్న డబ్బులో ఇప్పటీ వరకు ఒక్క రూపాయి కూడ డిపాజిట్ కాలేదన్నారు. ఇప్పుడేమో అక్రమ కేసులు బనాయిస్తున్నారని బిఆర్‌ఎస్ నేతలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.

**వెంటనే చర్యలు చేపట్టాలి : రఘునందన్ రావు**

జన్వాడ ఫాంహౌజ్ రేవ్ పార్టీలు, రావు పార్టీల వ్యవహారాన్ని పోలీసులు వెంటనే బహిర్గతం చేయాలని మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఒక వైపు డ్రగ్స్ రహిత తెలంగాణ చేస్తామని ప్రకటిస్తుండగా, మరో వైపు శని ఆదివారాల్లో జరుగుతున్న రేవ్ పార్టీలలో డ్రగ్స్ దందా నిత్యకృత్యమైందని విమర్శించారు. విదేశీ మాదక ద్రవ్యాలతో పాటు, కొకైన్ లు విచ్చల విడిగా తెచ్చి భాగ్య నగరాన్ని మత్తులో ముంచెత్తుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజమైన నిందితులను వదిలి అమాయకులను బలి చేయవద్దని, పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టి తెరచాటు నిందితులను బయటపెట్టాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా రాష్ట్రంలో డ్రగ్స్, కొకైన్, అక్రమ మద్యం విచ్చలవిడిగా దొరుకుతోందని, పోలీసులు కటిన చర్యలు చేపట్టి డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని వివరించారు.

## చదువులపై బకాయి భారం

(మొదటి పేజీ తరువాయి)

దాపురించిందని యాజమాన్యాలు ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నాయి. కాని ఇన్ని వేల కోట్ల రూపాయలను చెల్లించే ఆర్థిక పరిస్థితి ఇప్పుడు లేదన్న వాదన వినపడుతుంది. కాని విద్యార్థుల భవితవ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రీయంబర్స్‌మెంట్‌కు సంబంధించి ఒక ఆలోచన చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు. రీయంబర్స్‌మెంట్ కారణంగా మేము విద్యా సంవత్సరాన్ని నష్టపోవాల్సి వస్తుందని కొందరు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తుండగా మరి కొంత మంది విద్యా సంవత్సరాన్ని నష్టపోకుండా ఉండేందుకు అప్పులు చేసి ఫీజులు చెల్లించి ధృవపత్రాలను పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం రీయంబర్స్‌మెంట్ చెల్లింపులపై దృష్టి సారించాలని యాజమాన్యంతో సత్వర చర్యలు జరపాలని కోరుతున్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం నెలకొల్పిన గురుకుల పాఠశాలల్లో మూడొంతులకు పైగా అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఈ అద్దె భవన యజమానులకు అద్దె చెల్లించకపోవడంతో దసరా సెలవుల తర్వాత భవనాల యజమానులు తాళాలు వేసి కళాశాలలు పునః ప్రారంభం కాకుండా అడ్డుకున్న విషయం విధితమే. కొన్ని కళాశాలలకు సంబంధించిన భవన యజమానులు రెండు రోజుల పాటు తాళాలు తీయలేదు. ప్రభుత్వం ఏదో చర్యలు చేపట్టినప్పటికీ అది శాశ్వత పరిష్కారం కాదన్న వాదన వినవస్తుంది. రెండు, మూడు నెలల్లో బకాయిలను బకాయిలను చెల్లిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గురుకుల పాఠశాలలు దసరా తర్వాత పునః ప్రారంభమయ్యాయి. కాని చెల్లింపులపై దృష్టిసారించకుండా వాయిదాలు వేస్తే మరోసారి మొన్నటి కథే పునరావృతమయ్యే అవకాశం ఉంది.ప్రభుత్వం విద్యా రంగ సమస్యలను పరిష్కరించి తక్షణం ఫీజు రీయంబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు, అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాలకు సంబంధించి అద్దె చెల్లింపులు చేపట్టాలని కోరుతున్నారు.

## పట్టుతప్పుతోంది...

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేశారు. పంచాయతీల్లో అధికారుల కొరత లేకుండా ప్రతి గ్రామానికి కార్యదర్శులను నియమించారు. అయినా పల్లె పాలన గాడిలో పడినట్లు కనిపించడం లేదు. గ్రామ ప్రగతి పై తప్పుడు నివేదికలిస్తూ అధికారులు తప్పించుకుం టున్నారనే ఆరోపణలున్నాయి. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిపోయి తొమ్మిది నెలలు గడచిపోతున్నా... పంచాయతీల పాలనలో ఎలాంటి మార్పు కనిపిం చడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రత్యేకాధికా రులు తమ శాఖాపరమైన విధులతో పల్లె పాలనపై దృష్టి సారించడం లేదన్న విమర్శలొస్తున్నాయి. తాగు నీరు, సైడు కాలువలు, సీసీరోడ్లు, పారిశుధ్య నిర్వహ ణను ప్రత్యేకాధికారులు పట్టించుకోక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**కళతప్పిన పల్లెప్రకృతి వనాలు**

చాలా గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలకు నీటి సరఫరా నిలిచిపోవడంతోపాటు నిర్వహణ లేక కళ తప్పాయి. ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి నా పల్లె ప్రజలకు ఆహ్లాదం అందని ద్రాక్షగానే మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని గ్రామాల్లో మొక్కలు లేకుండానే పల్లె ప్రకృతి వనాలు దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారుల ఒత్తిళ్లతో అడపాదడపా మొక్కలు నాటినా సంరక్షణ చర్యలు చేపట్టక పోవడంతో కనిపించకుండానే పోయాయి. కొన్ని చోట్ల మొక్కలు నాటకుండానే తప్పుడు లెక్కలు నమోదు చేసి బిల్లులు కాజేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వనాల చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడంతో పశువులు, మేకలు మొక్కలను ధ్వంసం చేస్తున్నాయి. కొన్నిచోట్ల కొద్దిపాటి మొక్కలను మాత్రమే నాటి పల్లె ప్రకృతి వనాల బోర్డులను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్న దాఖలాలు కూడా ఉన్నాయి. అలాగే నర్సరీల్లో అవసరమై న మొక్కలు అందుబాటులో ఉండడం లేదు.

**ఎక్కడి ట్యాంకర్లు అక్కడే..**

గత ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీకి ట్రాక్టర్, ట్రాలీ, నీటి ట్యాంకర్‌ను అందించింది. దీంతో తడి, పొడి చెత్త సేకరణ, మొక్కలకు నీటిని సరఫరా చే యాల్సి ఉంది. కానీ, చాలా గ్రామాల్లో నీటి ట్యాంకర్లు నిరుపయోగంగానే కనిపిస్తున్నాయి. ట్యాంకర్ల ద్వారా మొక్కలకు నీళ్లందించకపోవడం వల్ల వాటి పెరు గుదల మధ్యలోనే ఆగిపోయింది. చాలా గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు, నర్సరీ, పారిశుధ్య నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రత్యేకాధికారులు పంచాయతీ పాలనపై పట్టించుకోక పోవడంతో పల్లె ప్రగతి పనులు నిలిచిపోయాయి.

**కార్యాలయాలకే పరిమితం..**

గ్రామాల్లో జరుగుతున్న పల్లె ప్రగతి పనులను నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు కార్యా లయాలకే పరిమితమవుతు న్నారు. దీంతో పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, సైడు కాలువలు, పైపులైన్లు, సీసీ రోడ్లు, పారిశుధ్యం అధ్వానంగా మారా యి. వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి గెజిటెడ్ అధికారు లను గ్రామాల ప్రత్యేక అధికా రులుగా నియమించడంతో వారి శాఖలకు చెందిన పను ల్లోనే తలమునకలవుతున్నారే తప్ప గ్రామాల సమస్యలపై దృష్టి సారించడం లేదని ప్రజ లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పాలనను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం జిల్లాకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ను నియమించినా ఆశించిన స్థాయిలో ప్రయోజనం కనిపించడం లేదన్న విమర్శలున్నాయి.ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రభుత్వం గ్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## బస్సులు కొనుగోలు

(మొదటి పేజీ తరువాయి)

బంద్ చేశారని ఇందిరమ్మ రాజ్యం రాగానే మహిళలకు వడ్డీ లేని రుణాల కార్యక్రమాన్ని పునః ప్రారంభించామన్నారు. వడ్డీ లేని రుణాలపై మహిళా సంఘాలకు సమాచారం అందించాలని వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తుందని మహిళా సంఘాల దగ్గర వసూలు చేయడానికి వీలు లేదని భట్టి తెలిపారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌లో కలెక్టరేట్‌లో ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. మహిళలను మహాలక్ష్మి గా కొలుస్తామని స్త్రీలను గౌరవించుకునేవిధంగా ప్రభుత్వం అధికారంలోకి రాగానే 48 గంటల్లో ఆర్టిసి బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని టికెట్ ఖర్చులను ప్రభుత్వమే ఆర్టిసికి చెల్లిస్తుందన్నారు. ప్రతి నెల రూ. 400 కోట్లు ఉచిత బస్సు ప్రయాణానికి ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా మహిళలచే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కార్యక్రమం చేపట్టామన్నారు. ఇండ్లలో వినియోగించే గ్యాస్ సిలెండర్‌ను సబ్సిడీపై రూ. 500లకే సరఫరా చేస్తున్నామన్నారు. ప్రతి ఏడాది మహిళా సంఘాలకు రూ. 20వేల కోట్లకు పైగా వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరుగుతుందని ఐదేండ్ల కాలంలో లక్ష కోట్లు అందిస్తామన్నారు. మహిళలు తీసుకున్న రుణాలతో పెట్టుబడులు పెట్టి వ్యాపారాలు చేయాలని దీని కోసం అవసరమైన శిక్షణ, తోడ్పాటు కూడా ప్రభుత్వమే అందిస్తుందని తెలిపారు. ప్రతి శాసనసభ నియోజక వర్గ పరిధిలో మహిళలకు ప్రత్యేకంగా చిన్న చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని స్థలాల ఎంపిక జరుగుతుందని తెలిపారు. అక్కడ మౌలిక సదుపాయాలు ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు. మహిళా సంఘాలు ఉత్పత్తి చేసే పరికరాలకు మార్కెట్ కూడా ప్రభుత్వమే కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళల నుంచి ప్రతిపాదన వస్తే మరో రూ.5వేల కోట్లు రుణాలు వడ్డీ లేకుండా అందించాలని ప్రభుత్వం బ్యాంకర్లకు ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. మధిరలో ఇందిరా మహిళా డెయిరీని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రభుత్వానికి ఎక్కడ ఏ అవకాశం వచ్చినా మహిళలకు ఆదాయం సమకూర్చేందుకు ప్రయత్నిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. మన జిల్లాలో వ్యవసాయ ఆధారితం అధికంగా ఉంటారని మన దగ్గర పండే పంటలకు అనుగుణంగా చిన్న చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని అందులో కూడా మహిళలను భాగస్వామ్యం చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ కలెక్టరేట్‌లో మహిళా సంఘాల సభ్యులచే మహిళా శక్తి క్యాంటీన్‌ను ఏర్పాటు చేశామని దీని వల్ల 14 మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుహాసిని మాట్లాడుతూ ప్రభుత్వ తోడ్పాటుతో మహిళా సంఘాలు బలపడి ఆర్థిక పరిపుష్టిని సాధిస్తున్నాయన్నారు. జుజ్జులరావుపేటకు చెందిన రాణి తమకు చెందిన భూమిలో ఆరు లక్షల రుణం తీసుకుని చేపలు, రొయ్యల చెరువు, పాడి, గొర్రెల పెంపకం, సేంద్రియ వరి, కూరగాయల సాగు, నాటుకోళ్ల పెంపకం తదితరాలు చేపట్టి నెలకు సుమారు రెండు లక్షలు సంపాదిస్తున్నట్లు మరో నలుగురికి పని చూపి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్త కళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డిఆర్‌డివో సన్యాసయ్య, డిఆర్‌వో ఎం. రాజేశ్వరి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల దాడులు

(మొదటి పేజీ తరువాయి)

ఓ వ్యక్తికి కొకైన్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. కొకైన్ తీసుకున్నట్లు పరీక్షలో తేలడంతో ఎన్‌డిపిఎస్ యాక్ట్ కింద పోలీసులు కేసు నమోదు చేశారు. తనిఖీల్లో పోలీసులు విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ యాక్ట్ సెక్షన్ 34 కింద మరో కేసును నమోదు చేశారు. మద్యం పార్టీలో మొత్తం 35 మంది పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. పాల్గొన్న వారిలో 21 మంది పురుషులు, 14 మంది మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఫామ్‌హౌస్ యజమాని రాజ్ పాకాలా బిఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కెటిఆర్ బావమరిదిగా గుర్తించారు. విజయ్ మద్దూరి అనే వ్యక్తి కొకైన్ తీసుకున్నట్లు పోలీసుల పరీక్షల్లో నిర్ధారణ అయింది. కొకైన్ తీసుకున్నట్లు పరీక్షలో తేలడంతో ఎన్‌డిపిఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ శాఖ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా మద్యం పార్టీ చేశారని పోలీసులు గుర్తించారు. ఈ పార్టీలో విదేశీ మద్యం సహా, భారీగా మద్యం స్వాధీనం చేసుకున్నారు. దీనిపై విచారణ చేపట్టినట్లు ఎక్సైజ్ సిఐ శ్రీలత తెలిపారు. ఎ1గా ఫామ్ హౌస్ సూపర్‌వైజర్ కార్తిక్, ఎ2గా కెటిఆర్ బావమరిది రాజ్ పాకాలను చేర్చామన్నారు. నిబంధనలను ఉల్లంఘించి పార్టీ నిర్వహించినట్లు చెప్పారు. కర్ణాటక లిక్కర్‌తోపాటు విదేశీ మద్యం కూడా కూడా స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఏడు లీటర్ల మద్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే రాజ్ పాకాల పరారీలో ఉన్నారని, విచారణలో మరికొన్ని వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. కాగా, క్యాసినో పరికరాలు సైతం స్వాధీనం చేసుకోవడంతో క్యాసినో నిర్వహించినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఫామ్‌హౌస్‌లో ప్లేయింగ్ కార్డ్స్, ప్లాస్టిక్ కైన్స్ వంటివి కూడా స్వాధీనం చేసుకున్నారు. భారీ శబ్దాలతో పార్టీ నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు తనిఖీలు చేశారు. 30 ఎకరాల్లో రాజ్ పాకాల ఫామ్‌హౌస్ విస్తరించి ఉంది. ఇప్పటికే రాజధానిలో అధిక మొత్తంలో డ్రగ్స్, గంజాయిలను పోలీసుల స్వాధీనం చేసుకుంటున్నారు. ఇప్పుడు ఈ జన్వాడ ఫామ్‌హౌస్ అర్ధరాత్రి పార్టీ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

**బిఆర్‌ఎస్ నేతల అరెస్టు**

రాయదుర్గం ఓరియన్ విల్లాస్‌లోని రాజ్ పాకాల సోదరుడు రాజేంద్రప్రసాద్ విల్లాలో తనిఖీల సందర్భంగా ఎక్సైజ్ పోలీసులు, బిఆర్‌ఎస్ నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. విల్లాలోకి వెళ్తోన్న ఎక్సైజ్ అధికారులను బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. సెర్చ్‌వారెంట్ లేకుండా ఎలా తనిఖీలు చేస్తారని వాగ్వాదానికి దిగారు. దీంతో మాగంటి గోపీనాథ్, వివేకానంద, బాల్క సుమన్ సహా పలువురు భారాస నేతలను అరెస్టు చేశారు. అనంతరం ఎక్సైజ్ అధికారులు రాజేంద్రప్రసాద్ విల్లాలో సోదాలు నిర్వహించారు. జన్వాడ ఫామ్‌హౌజ్‌లో మద్యం పార్టీకి ఆతిథ్యం ఇచ్చారన్న కారణంతో రాయదుర్గంలోని రాజ్‌పాకాల ఇంటి వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఓరియన్ విల్లాలో రాజ్ పాకాల ఉన్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించేందుకు అక్కడికి వెళ్లారు. విల్లాకు తాళం వేసి ఉండటంతో ఎక్సైజ్ సిబ్బంది కాసేపు వేచి చూశారు. సమీపంలోని మరో విల్లాలో ఉన్నారని సమాచారం రావడంతో అధికారులంతా అక్కడికి వెళ్లారు. ఈలోగా భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్న భారాస నేతలు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు.

## అధికారికంగా సదర్

(మొదటి పేజీ తరువాయి)

సదర్ సమ్మేళనాన్ని ప్రతీ గ్రామానికి తీసుకెళ్లాలని సిఎం రేవంత్ రెడ్డి పిలుపు నిచ్చారు. యాదవులు రాకీయంగా ఎదగాలనే అనిల్ కుమార్ యాదవ్‌ను రాజ్యసభకు పంపించామన్నారు. హైదరాబాద్ నగరంలో యాదవులు పాలు, పశు సంపదను పెంచి పోషించారని, ఈ క్రమంలో రాబోయే రోజుల్లో వారికి రాజకీయాల్లో సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు. ఆనాడు మూసీ పరివాహక ప్రాంతాల్లో యాదవులు పశుగ్రాసాన్ని పెంచుకునేవారన్నారు. మురికి కూపంగా మారిన మూసీకి పునరుజ్జీవం కల్పిద్దామని, ఈ నగరం అభివృద్ధి చేయడానికి యాదవులు అండగా నిలబడండని పిలుపు నిచ్చారు. మూసీ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని మరోసారి హామీ ఇస్తున్నానన్నారు. మూసీలో నరకాన్ని అనుభవిస్తున్న ప్రతి పేదవాడి జీవితంలో వెలుగులు నింపుతామని సిఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఏ శక్తులు అడ్డొచ్చినా నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసే బాధ్యత కాంగ్రెస్ పార్టీదని భరోసా ఇచ్చారు. అందుకే యాదవులు అవాకాశాలను అందిపుచ్చుకోవాలని చెబుతున్నానన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో అంజన్ కుమార్ యాదవ్‌ను ముషీరాబాద్ నుంచి గెలిపించి ఉంటే మీవైపు నుంచి ఈ రోజు రాష్ట్ర మంత్రిగా నిలబడేవారని అన్నారు. అంజన్ కుమార్ యాదవ్ ఓడినా యాదవులకు ప్రాధాన్యత ఉండాలనే తాము అనిల్ కుమార్ యాదవ్‌కు రాజ్యసభ స్థానం ఇచ్చామన్నారు. శ్రీకృష్ణుడు కూడా ధర్మం వైపు నిలబడ్డాడని, అందుకే కురుక్షేత్రంలో అధర్మం ఓడిందని ధర్మం గెలిచిందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎంపి అనిల్ యాదవ్ కూడా ఆయన తండ్రి మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్ బాటలోనే నడవాలని, బడుగు, బలహీన వర్గాలకు సముచిత ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు. అతిపిన్న వయస్సులోనే అనిల్ కుమార్ యాదవ్ ఎంపిగా బాధ్యతలు చేపట్టడం పట్ల అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. అనిల్ కుమార్ యాదవ్ చేసే అభివృద్ధిని చూసి ప్రతి ఒక్కరూ కూడా మెచ్చుకుంటూ అంజన్ కుమార్ యాదవ్ కుమారుడని పేరుతెచ్చుకునేలా చేయాలన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ సదర్ సమ్మేళనాన్ని ప్రభుత్వ పరంగా నిర్వహించడం శుభపరిణామన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఉంచిన ప్రతి గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేసుకుంటూ వెళ్తున్నక్రమంలో ప్రజల్లోకి ఈ వివరాలు వెళ్లేలా కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కాగా సదర్‌ను ప్రభుత్వ పరంగా జరుపడం పట్ల ఎంపి అనిల్ కుమార్ యాదవ్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కాగా సదర్ సమ్మేళనం సందర్భంగా దున్నపోతల విన్యాసాలు ప్రజలను ఆకట్టుకోగా, ఆటపాటలతో పలువురు సందడి చేయడం విశేషం.

# కామన్ స్కూల్ విధానం అమలుచేయాలి

* రాజకీయ కోణంలో కేంద్రం నూతన విద్యావిధానం
* పాలకులు మారినప్పుడల్లా మార్పులు తగదు
* విద్యా వ్యవస్థకు స్వయంప్రతిపత్తి ఉండాలి

'ప్రజాపక్షం'తో 'రాష్ట్రోపాధ్యాయ సంఘం తెలంగాణ' (ఎస్‌టియుటిఎస్) అసోసియేట్ అధ్యక్షులు వై.కరుణాకర్‌రెడ్డి



కె.సంతోష్ కుమార్

''ప్రపంచ వ్యాప్తంగా విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యా సిలబస్‌ను ఎప్పటికప్పుడు రూపొందించుకోవాలి. కామన్ స్కూల్ విద్యావిధానం అమలుచేసి మెరుగైన విద్యను అందించాలి. రాష్ట్ర విద్యా వ్యవస్థలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ పాలకులు తమ మార్క్‌ను చాటుకునేందుకు విద్యారంగంలో కొత్త విధానాలు తీసుకువస్తున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టగానే గురుకుల పాఠశాలలను తీసుకువచ్చి అప్పటికే ఉన్న పాఠశాలలను నిర్లక్ష్యం చేసింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం 'ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' అంటుంది. ఇప్పటికే ఉన్న వివిధ రకాల ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విద్యా సంస్థల భవిష్యత్ ఏమిటనేది పాలకులు స్పష్టతనివ్వాలి.'' అని 'రాష్ట్రోపాధ్యాయ సంఘం– తెలంగాణ' (ఎస్‌టియుటిఎస్) అసోసియేట్ అధ్యక్షులు వై.కరుణాకర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో పాఠశాల విద్యారంగంలోని పరిస్థితులు, పాలకుల విధానాలు, సమస్యలు, పరిష్కారాలపై 'ప్రజాపక్షం' ప్రతినిధితో కరుణాకర్‌రెడ్డి వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఈవిధంగా ఉన్నాయి.

**ప్రశ్న : రాష్ట్రంలో విద్యారంగం పరిస్థితి ఏమిటి ?**

**కరుణాకర్‌రెడ్డి :** తెలంగాణ రాష్ట్రంలో ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు, నవోదయ పాఠశాలలు మాత్రమే ఉండేవి. తరువాత ప్రైవేట్ పాఠశాలలు, మండల, జిల్లా పరిషత్, మోడల్ స్కూల్స్, కెజిబివిలు, గురుకులాలు, ఎయిడెడ్ పాఠశాలలు ఇలా అనేక పేర్లతో పాఠశాలలు రావడంతో విద్యారంగం, విద్యా వ్యవస్థలో ఒక విచిత్రమైన పోకడ కొనసాగుతున్నది. దీనికి ఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వారి ఎజెండా, వారి మ్యానిఫెస్టో పేరుతో విద్యారంగంలో విచిత్రమైన మార్పులు తీసుకువస్తున్నారు. స్వయంప్రతిపత్తిగా ఉండాల్సిన విద్యారంగం ఈ రాష్ట్రంలో పాలకుల నియంత్రణలో కొనసాగడం, ఇన్నిరకాల విద్యావ్యవస్థలు కొనసాగించడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఏ పాఠశాలల్లో చేర్పించాలని నిర్ణయించుకోలేని సందిగ్ధంలో ఉన్నారు.

**ప్రశ్న : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యావిధానంపై ఉపాధ్యాయుల వైఖరి ఏమిటి?**

**కరుణాకర్‌రెడ్డి :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'నూతన జాతీయ విద్యావిధానం 5+3+3+4' అనే పద్ధతిపై ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, మేధావులు, చివరికి ప్రజలతో గానీ ఎక్కడా లోతైన చర్చ జరగలేదు. దీనిపై ఎవరికీ కూడా సరైన అవగాహన లేదు. మొత్తం నాలుగు భాగాలుగా ఈ విడదీసిన విద్యా విధానాన్ని వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు రాజకీయ కోణంలో చూస్తున్నాయే తప్ప ఇది ఎంతవరకు ఉపయోగపడుతుందనే చిన్న ఆలోచన కూడా చేయడం లేదు. ఈ విధానాన్ని అమలు చేయకపోతే కేంద్రం నుంచి నిధులు రావనే భయంతో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తుండగా, బిజెపి పాలిత రాష్ట్రాల్లో కేంద్రం తెచ్చిందనే ఆలోచనతో గుడ్డిగా అమలు చేస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా సుదీర్ఘ చర్చలు జరగాలి.

**ప్రశ్న : ఉపాధ్యాయ సంఘాలు ఎలాంటి విద్యా విధానాన్ని కోరుకుంటున్నాయి?**

**కరుణాకర్‌రెడ్డి :** రాజకీయ కోణంలో కాకుండా సామాజిక అభ్యున్నతి కోణంలో చూస్తూ విద్యారంగానికి స్వయంప్రతిపత్తిని కల్పించాలి. ప్రపంచ వ్యాప్తంగా విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యా సిలబస్‌ను ఎప్పటికప్పుడు రూపొందించుకోవాలి. కామన్ స్కూల్ విద్యావిధానం అమలు జరగాలి. విద్యార్థులకు పరీక్షల విధానంలో భారీ సంస్కరణలు తీసుకురావాలి. విద్యారంగం అభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్‌లో విద్యకు ఎక్కువ నిధులను కేటాయించాలి. ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేస్తూ ఒకటి నుంచి 5వ తరగతివరకు ప్రతి తరగతికీ ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలి. అంగన్‌వాడీలను ప్రాథమిక పాఠశాలలను అనుసంధానించాలి. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు నిపుణుల కొరత ఉంది. దీనిని తీర్చాల్సిన అవసరముంది. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి పూర్తిగా మినహాయించాలి.

**ప్రశ్న: ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ఏమిటి ?**

**కరుణాకర్‌రెడ్డి :** పాలకులు ఎవరు అధికారంలోకి వస్తే వారి ఎజెండాను విద్యపై ప్రయోగిస్తుండడం విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రభుత్వాలు కొన్ని రకాల పాఠశాలలను ఒక రకంగా, మరికొన్ని పాఠశాలలను మరోరకంగా చూడడంతో విద్యార్థుల్లో, ఉపాధ్యాయులలో, ప్రజల మదిలో విద్యా అసమానతలు ఏర్పడుతున్నాయి. ఇన్నిరకాల విద్యా వ్యవస్థలు ఉండడంవల్ల కొంతమంది ఉపాధ్యాయులకు పనిభారం, మరి కొంతమంది ఉపాధ్యాయులకు సమాన పనికి సమాన వేతనం లేకపోవడం, ఇంకొంత మంది ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత లేకపోవడం, నిరంతరం కొనసాగాల్సిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో జాప్యం జరగడం, ప్రభుత్వం నుండి ఆర్థికపరంగా రావాల్సిన నిర్ణయాలు తీసుకోకపోగా, ఉద్యోగులకు హక్కులుగా ఉన్న వాటిని, ఉద్యోగులకు తామే వరాలుగా, బిక్షగా ఇస్తున్నట్లు పాలకులు భావిస్తున్నారు. దీని వల్ల విద్యా వ్యవస్థలో అస్తవ్యస్త పరిస్థితి ఏర్పడింది.



**ప్రశ్న : గత ప్రభుత్వం హయాంతో పోల్చితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో వచ్చిన విధానపరమైన మార్పులు ఏమిటి?**

**కరుణాకర్‌రెడ్డి :** గత బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగానికి ఆశించిన నిధులను కేటాయించలేదు. ఉపాధ్యాయుల నియామకాలను చేపట్టకపోగా, పర్యవేక్షణ అధికారులను కూడా నియమించలేదు. కేవలం గురుకులాలను మాత్రమే ప్రోత్సహించి, మిగతా ప్రభుత్వ పాఠశాలలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో అవి కనుమరుగయ్యే స్థితికి గత పాలకులు తీసుకువచ్చారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో ప్రతి గ్రామం, తండాలు, ఆదివాసి గూడేల్లో సర్కార్ పాఠశాలలు ఉండాలని, బడి లేని ఊరు ఉండకూడదన్న నినాదం తీసుకువచ్చింది. 11,052 ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయడంతో పాటు సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించింది. ఇవి కొంతవరకు పాఠశాల విద్యారంగానికి సంబంధించి ఆశాజనకమైన నిర్ణయాలు. గత పాలకుల మాదిరిగా మూలాలు మరిచి 'ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' పేరుతో కొత్త విద్యా సంస్థలను నెలకొల్పాలనే నిర్ణయాన్ని తీసుకుంటున్నారు. అయితే ఇది సరైంది కాకపోవచ్చు. విద్యా కమిషన్ ఏర్పాటు చేసి దీనికి చైర్మన్, ముగ్గురు సభ్యులను నియమించడం అభినందనీయం.

**ప్రశ్న: రాష్ట్రంలో పాఠశాలలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్య ఎంత? మౌలిక సదుపాయాల సమస్యలు.. పరిష్కారాలు ఏమిటి?**

**కరుణాకర్‌రెడ్డి :** రాష్ట్రంలో ప్రభుత్వ గురుకులాలు, పాఠశాలలు కలిపి మొత్తం 27,441 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఉచితంగా చదువుకుంటున్న 30లక్షల మంది విద్యార్థులకు సుమారు 1.13లక్షల మంది టీచర్లు విద్యను బోధిస్తున్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్వీపర్లు, స్కావెంజర్లను నియమించుకునేందుకు ప్రస్తుత ప్రభుత్వం నిధులను కేటాయించడం హర్షణీయం. అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ఉన్నాయి. బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు లేకపోవడం, మరి కొన్ని పాఠశాలలకు ప్రహరీ గోడలు, వంట గదుల సౌకర్యం లేదు. విద్యార్థులకు పరిశుభ్రమైన తాగు నీరు, నాణ్యమైన మధ్యాహ్నభోజనం అందించాల్సి ఉంది. నైట్ వాచ్‌మెన్‌లను నియమించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడం ఉపాధ్యాయులతో పాటు ప్రభుత్వాల బాధ్యత. ఉపాధ్యాయులు, పర్యవేక్షణ అధికారుల నియామకాల ప్రక్రియ నిరంతరం కొనసాగించాలి.

**ప్రశ్న : బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన 'మన ఊరు – మన బడి' పథకం విద్యా రంగానికి ఏమైనా ఉపయోగపడిందా?**

**కరుణాకర్‌రెడ్డి :** మౌలిక సదుపాయాల కల్పన పేరుతో గత బిఆర్ఎస్ ప్రభుత్వం 'మన ఊరు – మన బడి' పథకాన్ని తీసుకువచ్చింది. పాఠశాలలకు పాత గోడలకు రంగులు వేయడం తప్ప, ఆశించిన అభివృద్ధి మాత్రం జరగలేదు. రాగిజావ, అల్పాహారం లాంటి పథకాలను పైలెట్ ప్రాజెక్టు పేరుతో కొన్ని పాఠశాలలకు మాత్రమే పరిమితం చేయడంతో ఆశించిన స్థాయిలో విద్యార్థులకు చేరనే లేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసింది. వీటిపై విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంతోపాటు విద్యార్థులకు మేలు జరిగే నిర్ణయాలను అమలు చేయాల్సిన అవసరముంది.



## ఫీజు బకాయిలు విడుదల చేసేవరకూ..

# పోరాటాలు ఆగవు

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే విద్యార్థుల పెండింగ్ బోధన రుసుం, ఉపకార వేతనాలను తక్షణమే విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్‌లు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే విద్యార్థుల చదువులు కొనసాగేది ఎలా అని ప్రశ్నించారు. ఫీజు బకాయిలపై ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన మాటలకు నేడు చేస్తున్న వాటికి ఎటువంటి పొంతన లేదని, సమస్యల పరిష్కారంలో జరుగుతున్న జాప్యం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్న చందంగా తయారయ్యిందని, గత 10 ఏళ్లల్లో బిఆర్ఎస్ పాలనలో విద్యా వ్యవస్థ భ్రష్టుపట్టిస్తే దీనిని ఆసరా చేసుకుని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మేము అధికారంలోకి వస్తే సమస్యలు పూర్తిగా పరిష్కరిస్తాం అని కాంగ్రెస్ నాయకులు చెప్పడంతో విద్యార్థి, యువత ఆ పార్టీ అధికారంలోకి రావడానికి తీవ్రమైన కృషి చేశారన్నారు. విద్యాశాఖను సిఎం రేవంత్‌రెడ్డి తన వద్దనే పెట్టుకున్నా.. గడిచిన 10 నెలల్లో విద్యారంగంలో ఉన్న సమస్యలపై ఇంతవరకు ఒక్క సమీక్షా సమావేశం కూడా నిర్వహించని పరిస్థితిలో ఉన్నారన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మొదలుకొని విశ్వవిద్యాలయాల వరకు అనేక సమస్యలతో విద్యార్థులు కొట్టుమిట్టాడుతున్నారు. గురుకులాల్లో ఉన్న విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురైతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు సంబంధించి స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌రూ.7,800 కోట్లు బకాయిలను మూడు సంవత్సరాలుగా విడుదల చేయకపోవడంతో దాదాపు 13 లక్షల మంది విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారన్నారు. తమ కోర్సులు పూర్తి అయినా కూడా కళాశాల యాజమాన్యాలు తమ ధ్రువపత్రాలు ఇవ్వకపోవడంతో వారు ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. సిఎం రేవంత్ రెడ్డి తక్షణమే విద్యారంగం సమీక్ష నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ నేతలు కోరారు.. లేకపోతే విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఇటికాల రామక్రిష్ణ, బానోత్ రాఘురాం, గ్యార నరేష్, నాగ జ్యోతి, లెనిన్ పాల్గొన్నారు.

# బౌద్ధ ధర్మంతోనే సమాజ రుగ్మతలు దూరం

మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమాజంలో రుగ్మతలకు గౌతమ బుద్ధుని బోధనలు ఒక్కటే శరణ్యమని, గౌతముని బోధనలను ఆచరించడం ద్వారా మానవ జీవితానికి పరిపూర్ణత సిద్ధిస్తుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కఠిన చీవర దానోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ లోని మహాబోధి బుద్ధ విహార్‌ని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించారు. జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. మహా బోధి దయకమండలి, మహా బోధి బుద్ధ విహార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కఠిన చీవర దానోత్సవంలో మంత్రి పాల్గొని, ప్రాచీన బౌద్ధ సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం వర్షావాసం ముగించిన బౌద్ధ భిక్షువులకు వస్త్రాలను దానం చేశారు. అంతకుముందు మంత్రి జూపల్లిని బౌద్ధ బిక్షువులు ఆశీర్వదించారు. అనంతరం డా.శివనాగిరెడ్డి పాళీ భాష నుంచి తెలుగులోకి అనువదించిన బుద్ధ వంశం అనే గ్రంథాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు.

బుద్ధిస్ట్ సాంస్కృతిక, వారసత్వ ఉత్సవాలు, త్రిపీటిక పఠన వేడుకలు, త్రిపీటికలను తెలుగులో అనువదించడానికి ఆర్థిక సహాయం చేయాలని మహాబోధి బుద్ధ విహార్ భిక్షువులు మంత్రిని కోరగా వెంటనే స్పందించిన ఆయన రూ.4కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మహా బోధి సొసైటీ, లైట్ ఆఫ్ బుద్ధధర్మ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ ఇండియా సంయుక్తంగా బుద్ధిస్ట్ సాంస్కృతిక, వారసత్వ ఉత్సవాలు నిర్వహించనున్నాయి. ఫిబ్రవరి 6, 2025 ఫిబ్రవరి 8 వరకు నాగర్జున సాగర్ లోని బుద్ధవనం, హైదరాబాద్‌లో జరిగే ఈ వేడుకలకు వివిధ దేశాల బౌద్ధ భిక్షువులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా మంత్రి



జూపల్లి మాట్లాడుతూ.. సమస్త జీవరాసుల పట్ల ప్రేమ, కరుణ, అహింస, శాంతి, సహనంతో ప్రకృతితో మమేకమై జీవించాలనే మహాబోధి గౌతమ బుద్ధుని జ్ఞానమార్గం నేటి సమాజానికి ఎంతో అవసరమని అన్నారు.

అనివార్య ప్రమాదాల నుండి ప్రపంచాన్ని రక్షించుకోవాలంటే బుద్ధుడు బోధించిన ప్రేమ, దయలతో కూడిన సందేశాన్ని అనుసరించడం తప్ప మరో మార్గం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ భిక్షువు హిత్తిక భంటేజీ, మహాబోధి సొసైటీ జనరల్ సెక్రటరీ ఆనంద్ భంటేజీ, మహాబోధి బుద్ధ విహార్ డైరెక్టర్ బుద్ధపాల భంటేజీ, బెంగళూర్ ఎంబీఎస్ సెక్రటరీ సుగతనంద భంటేజీ, మహా బోధి రీసెర్చ్ సెంటర్ (బెంగళూర్) డైరెక్టర్ బుద్ధదత్త భంటేజీ, మహాబోధి బుద్ధ విహార్ చీఫ్ పాట్రన్ అంజనేయరెడ్డి, డా.శివనాగిరెడ్డి, బౌద్ధ ఉపాసిక, ఉపాసికలు పాల్గొన్నారు.

# బిసి బిల్లు, కులగణనకు కృషి

టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌తో జాతీయ బిసి నేతల భేటి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** త్వరితగతిన జన గణనలో కుల గణనను పూర్తి చేయడంతో పాటు పెండిగ్‌లో ఉన్న బిసి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేయాలని టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేష్ కుమార్ గౌడ్‌కు బిసి సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ నేతృత్వంలో ప్రధాన కార్యదర్శి నంద గోపాల్ ఎరోళ్ల రాఘవేందర్ రక్షక్ దల్ చైర్మన్ ఉదయ్ కుమార్ నేత కార్యదర్శి విజయ్ కుమార్ ముదిరాజ్, హరి తిలక్ సింగ్‌లు మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ తో వివిధ బిసి సమస్యలపై చర్చించారు. జన గణనలో కుల గణన జాతీయ స్థాయిలో చేపట్టేందుకు కృషి చేయాలని పార్ల మెంటులో బిసి బిల్లు పెట్టి చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్లు చేపట్టేందుకు కేంద్రములో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కృషి చేయాలని వారు కోరారు.

## సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి

# ఎన్.బాలమల్లేష్‌కు ఘన సన్మానం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్. బాలమల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో హైదరాబాద్ పాతబస్తీకి చెందిన మాజీ ఎఐఎస్ఎఫ్ నాయకులు, ప్రముఖ న్యాయవాది ఎ.యాదగిరి, ఎన్.ఆర్.శ్రీనివాస్, బాలయ్య యాదవుల ఆధ్వర్యంలో ఎన్.బాలమల్లేష్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాలమల్లేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సమరశీల పోరాటాలను నిర్వహిస్తున్న సిపిఐకి మద్దతుగా ప్రజలందరూ కలిసి రావాలని ఆయన కోరారు. మూసీ పునరుజ్జీవనంలో భాగంగా ముందుగా పేదలను కూల్చివేసే ఆలోచనను ప్రభుత్వం విమరించుకోవాలని, అనివార్యమైతే అన్ని విధాలుగా వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో జీవనోపాధి కల్పించి ఒప్పించి ఖాళీ చేయించాలి తప్ప, బలవంతం చేయరాదన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శి డిజి సాయిల్ గౌడ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్.దశరథ్, సిపిఐ జిల్లా నాయకులు డిజంగయ్య పాల్గొన్నారు.

**నేడు జనగణనలో బిసి కులగణన అంశంపై రాష్ట్ర సెమినార్**

బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం (నేడు) జనగణనలో బిసి కుల గణన పేరుతో నిర్వహించనున్న రాష్ట్రస్థాయిలో బిసి కులాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన బాలమల్లేష్ కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని కూనంనేని సాంబశివరావు, రిటైర్డ్ ఐఎఎస్ టి చిరంజీవులు, రాజ్యసభ సభ్యులు ఆర్‌కృష్ణయ్య, ఉస్మానియా ప్రొఫెసర్ ప్రభంజనం యాదవ్ పాల్గొంటున్నారని పేర్కొన్నారు.

## బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో

# చేసిందంతా రేవ్ పార్టీలే

* శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి ఆరోపణ



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిందంతా రేవ్ పార్టీలేనని, యువకులను మత్తుకు బానిసలుగా మార్చారని తెలంగాణ క్రీడాప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మన్ శివసేనారెడ్డి ఆరోపించారు. అంతేగాక బిఆర్ఎస్ యువత జీవితాలను నిర్వీర్యం చేసిందని, తెలంగాణలో ఈ డ్రగ్స్ పార్టీ.. రేవ్ పార్టీ కల్చర్ పోవాలని కోరుతున్నానన్నారు. గత పదేళ్ల పాలనలో చేసిందంతా రేవ్ పార్టీ లేనని, ఈ ఘటనపై మాజీ మంత్రి కెటిఆర్ ఎందుకు స్పందిండంలేదని శివసేనారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్పోర్ట్స్ యూనివర్సిటీతో ఆరోగ్య తెలంగాణ దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడుగులు వేస్తుంటే గత ప్రభుత్వం బిఆర్ఎస్ మాత్రం డ్రగ్స్ దిశగా ముందుకు పోతోందని మండిపడ్డారు. అలాగే రాష్ట్రంలో డ్రగ్స్‌ను నిర్మూలించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుంటే.. మాజీ మంత్రి కెటిఆర్ బావమరిది స్వయంగా డ్రగ్స్, రేవ్ పార్టీల పేరుతో వ్యవహారం నడిపిస్తున్నారని ఆయన ఆరోపించారు.

ఇంత జరుగుతున్నా కెటిఆర్ దీనిపై ఎందుకు స్పందించడంలేదని సోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి నిలదీశారు. అంతేగాక దీని వెనుక ఎంతటివారు ఉన్నా శిక్షించాల్సిందేనని అన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి పార్టీలు చేసుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం క్షమించదని, గ్రామ స్థాయిలో మెసేజ్ వెళ్లేలా పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్న నమ్మకం తమకుందని తెలిపారు. తెలంగాణ యువతను ఓ ఆరోగ్య ధోరణిలోకి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంటే మళ్లీ పాత ధోరణికి తీసుకెళ్లేందుకు బిఆర్ఎస్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. అలాగే దీని వెనుక ఎంతటివారున్నా ఖచ్చితంగా శిక్షించాల్సిందేనని పోలీస్ యంత్రాంగాన్ని కోరుతున్నానని శివసేనా రెడ్డి అన్నారు.

# రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ప్రజాపక్షం / సంగారెడ్డిప్రతినిధి :** తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఆదివారం జోగిపేట వ్యవసాయ మార్కెటు యార్డు నూతన పాలక వర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ శెట్కర్ తో కలిసి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల ఆర్థిక అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రాదాన్యత ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని, గ్రామాలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాని ప్రతి రైతు అభివృద్ధి చెందేలా పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. జోగిపేట వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని దామోదర్ రాజనర్సింహ తెలిపారు. మార్కెట్ యార్డు పాలక వర్గం రైతుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పని చేసి మార్కెట్ యార్డుకు పేరును తీసుకు రావాలన్నారు. రాష్ట్రంలోని జోగిపేట, మార్కెట్



యార్డుకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేలా పాలక వర్గ సభ్యులు పనిచేయాలన్నారు. రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చడమే తమ పథకాల ప్రధాన లక్ష్యమని వివరించారు. రైతుల సంక్షేమం కోసం పలు పథకాలు అమలులో ఉన్నాయని మంత్రి తెలిపారు. పంటకు మద్దతు ధరను నిర్దేశించి రైతుల ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో 211 దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు కనీస దరకు తమ పంటను విక్రయించేలా సౌకర్యాం కల్పించినట్లు తెలిపారు. రైతులు తగిన ప్రతిఫలాన్ని పొందేలా ఈ చర్యలు ఉపయోగపడుతాయన్నారు. సంస్కరణలలో భాగంగా సన్న రకం దాన్యాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచుతున్నామని మంత్రి తెలిపారు .

## కాంగ్రెస్ సీనియర్ నాయకుడు,

# మాజీ ఎంఎల్‌సి ఇంద్రసేన్ రెడ్డి మృతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంఎల్‌సి ఎస్.ఇంద్రసేన్‌రెడ్డి(81 సంవత్సరాలు) శుక్రవారం అర్ధరాత్రి మరణించారు. గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్ లోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో మృతిచెందారు. ఆయనకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈనెల 29న (బుధవారం) ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హైదరాబాద్, నల్లకుంట మార్కెట్ వద్ద ఉన్న ఆయన నివాసం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సందర్శనార్థం ఇంద్రసేన్ రెడ్డి భౌతికకాయాన్నిపెట్టనున్నారు.

29న మధ్యాహ్నం 2గంటలకు మహాప్రస్థానంలో అంత్యక్రియలు జరగనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. విద్యార్థి దశ నుంచి ఇంద్రసేన్ రెడ్డి రాజకీయాల్లో అడుగుపెట్టారు. 1960 సంవత్సరంలో ఆయన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1972లో యువజన కాంగ్రెస్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శిగాను, జాతీయ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆ తర్వాత 1975లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎపిసిసి ఉపాధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఎఐసిసి సభ్యునిగా, నాటి అంజయ్య ప్రభుత్వంలో రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధిగా,1982లో ఎపి స్పోర్ట్స్ చైర్మన్‌గా, ఎపిఐడిసి చైర్మన్‌గా కూడా పనిచేశారు. ఆయన ఎగ్జిబిషన్ సొసైటీ, ఉస్మానియా గ్రాడ్యుయేట్ అసోసియేషన్, ఆర్థిక కమిటీ సభ్యులు, ఎంఎల్‌సిగా కూడా పనిచేశారు.



**మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పనిచేసిన ఇంద్రసేన్ రెడ్డి**

మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఇంద్రసేన్ రెడ్డి చురుగ్గా పనిచేశారని, కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాలలో పనిచేసి పార్టీకి, ప్రజలకు అనేక సేవలను అందించారని పలువురు గుర్తుచేశారు. ఆయన మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డంప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ సంతాపం వ్యక్తం చేశారు. జోగిపేట యార్డు అధికారులు నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 'మూడు పెండింగ్ డిఎ'లను విడుదల చేయండి : ఎస్‌టియు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఐదు డిఎలలో రాష్ట్ర ప్రభుత్వం ఒకటి మాత్రమే విడుదల చేయడం పట్ల ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారని ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి. సదానందంగౌడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించి, వెంటనే మూడు పెండింగ్ డిఎలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆరు నెలలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం కరువు భత్యంను (డిఎ) విడుదల చేస్తుందని, తదనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఐదు డి.ఎలు ఇవ్వాల్సి ఉండగా, కేవలం ఒకటి మాత్రమే విడుదల చేయడం సరి కాదని వారు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ పెండింగ్‌లో ఉన్న అన్ని డిఎలను తక్షణమే చెల్లిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పొందుపర్చిందని వారు గుర్తు చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని, గత పది నెలలుగా ఉద్యోగులు ఓపిక పట్టారని అన్నారు. ఉద్యోగుల జెఎసితో సిఎం చర్చలు జరిపిన అనంతరం కనీసం రెండు లేదా మూడు డిఎలు విడుదల చేస్తారని ఉద్యోగులు భావించారని, కానీ ఒక డిఎను మాత్రమే విడుదల చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ ప్రభుత్వం
అటవీశాఖ
టెండరు నోటీసు
లేఖ నెం. 792/ఎస్ 4/2022, తేది: 22.10.2024
పని పేరు: మహబూబ్‌నగర్ జిల్లాలోని అటవీశాఖకు మరియు జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖలకు గస్సేటేడ్ పాలిథీన్ సంచులను తయారు చేసి మహబూబ్‌నగర్ జిల్లాలో వివిధ నర్సరీలకు నేరుగా సరఫరా చేయుటకుగాను అటవీశాఖ టెండరును ఆహ్వానించడమైనది. పాలిథీన్ సంచుల వివరాలు ఈ క్రింది విధముగా తెలియజేయడమైనది.
1) 4"x7" 300 గేజి, 2) 5"x9" 300 గేజి, 3) 6"x8" 300 గేజి, 4) 9"x11" 400 గేజి, 5) 14"x15"500 గేజి.
టెండరు ఫారాలను జిల్లా అటవీశాఖ అధికారి కార్యాలయం నుండి తేదీ. 28.10.2024 నుంచి 03.11.2024 వరకు కార్యాలయ పనివేళలో ఉ. 10.30 గం.ల నుంచి సా. 5.00 గం.ల లోపు పొందవచ్చును. ఇందుకుగాను రూ. 2000/ డిడి జిల్లా అటవీశాఖ అధికారి కార్యాలయం, మహబూబ్‌నగర్ వారి పేరుమీద ఏదైనా జాతీయ బ్యాంకుపై తీసినది దాఖలు చేయాలి.
సీల్డు టెండరు తేదీ: 28/10/2024 నుండి 03/11/2024 వరకు కార్యాలయ పనివేళలో ఉ. 10.30 గం.ల నుంచి సా. 5.00 గం.ల లోపు మరియు 04/11/2024 న మధ్యాహ్నం 12.00 గం.ల వరకు తీసుకొనబడును. సీల్డు టెండరు దాఖలు చేయుటకు ఆఖరు తేదీ: 04/11/2024 న మ. 12.00 గం.ల వరకు. టెండరు తెరచు తేదీ. 04/11/2024 న మ 3.00 గం.లకు. తదుపరి వివరాలకు దిగువ సంతకం దారుని సంప్రదించగలరు.
సం/– జిల్లా అటవీ శాఖ అధికారి మహబూబ్‌నగర్ జిల్లా.
DIPR R.O. No. 5954-PP/CL/ADVT/1/2024-25, Date: 27-10-2024

# ఫోకస్

## పోలియోపై అప్రమత్తత అవసరం



మన దేశంలో పోలీయా కేసులు లేకపోయినప్పటికీ, పొరుగున ఉన్న పాకిస్తాన్‌లో ఈ ఏడాది ఏకంగా 28 కేసులు నమోదుకావడం ఆందోళన కలిగిస్తున్న విషయం. పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతాల్లో ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ నైజీరియాలో 61 పోలియో కేసులు నమోదయ్యాయి. అంగోలాలో 7, సూడాన్‌లో 9 చొప్పున కేసులు బయటపడ్డాయి. మన దేశంలో ఈ ఏడాది ఆగస్టు మాసంలో మేఘాలయ రాష్ట్రం పశ్చిమ గారో హిల్స్ జిల్లాలో పోలియో అనుమానాస్పద కేసు నమోదుకాగా, వైద్యపరీక్షల అనంతరం దానిని పక్షవాత సంబంధిత వ్యాధిగా నిర్ధారించారు. మన దేశంలో పోలియో కేసులు లేకపోవడం ఆనందకరమే. అయితే, పోలియోను పూర్తిగా నిర్మూలించామని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) ఊపిరితీసుకునేలోపే మళ్లీ కేసులు బయటపడడం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. పోలియా వ్యాక్సిన్ అభివృద్ధికి నాయకత్వం వహించిన జోనాన్ సాల్క్ జయంతి సందర్భంగా ఈ మహమ్మారి నివారణపై మరోసారి దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. 1914 అక్టోబర్ 28న జన్మించిన అమెరికా వైరాలజిస్టు సాల్క్ తన జీవితకాలంలో ఎన్నో రకాల వ్యాధులు, వాటి కారకాలపై విశేష పరిశోధనలు చేశాడు. 1995 జూన్ 23న ఆయన మరణించినప్పటికీ, పోలియో వ్యాక్సిన్ వంటి ఎన్నో అద్భుతమైన టీకాలను ప్రపంచానికి అందించి, చిరంజీవి అయ్యాడు. కాగా, భారత్ పోలియో రహిత దేశంగా అవతరించడానికి 1995లో చేపట్టిన పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ (పిపిఐ) కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడింది. డబ్ల్యుహెచ్ఒ ప్రపంచ పోలియో నిర్మూలన ఇనిషియేటివ్ కింద చేపట్టిన ఈ ప్రాజెక్టులో, ఐదేళ్లలోపు పిల్లలకు సామూహిక ఇమ్యునైజేషన్ ద్వారా పోలియో వ్యాప్తిని నిరోధించగలిగారు. జనసాంద్రతగల పట్టణాలు, అధిక జనసాంద్రత గల పట్టణాలు, ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టును సమర్థంగా నిర్వహించారు. పల్స్ పోలియోకు ప్రజల నుంచి కూడా మద్దతు లభించడం విశేషం. కాగా, నేషనల్ పోలియో సర్వైలెన్స్ ప్రాజెక్ట్ (ఎన్‌పిఎస్‌పి)ని భారత ప్రభుత్వం 1997లో ప్రారంభించింది. పోలియో ప్రాథమిక సూచనలైన అక్యూట్ ఫ్లాసిడ్ పక్షవాతం (ఎఎఫ్‌పి)ని పర్యవేక్షించి, నియంత్రించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. పోలియో గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, క్రమం తప్పకుండా పోలియో చుక్కలు వేయడం వంటి కార్యక్రమాలతో ఈ మహమ్మారిని అదుపుచేయడం కూడా ఈ ప్రాజెక్టు ప్రధాన ఎజెండా. మన దేశంలో పోలియో నిర్మూలన ప్రాజెక్టు నిరంతర ప్రక్రియగా కొనసాగాల్సిన అవసరం ఉంది. మనది ప్రపంచంలోనే అత్యధిక జనాభా గల దేశం. శిశు జననాలు ఎక్కువ. కాబట్టి పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా, పోలియో నిర్మూలన చర్యలు విస్తృతం కావాలి. ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో డ్రాప్స్ అందేలా చూడాలి. పోలియో నివారణకు టీకాలు వేసే సమయంలో ప్రజల్లో ఎన్నో అపోహలు, భయాలు ఉండేవి. ఇప్పుడు చుక్కల మందు రావడంతో పరిస్థితి కొంత మెరుగుపడింది. ప్రజల నుంచి సహకారం లభిస్తున్న తరుణంలో, కేంద్ర ప్రభుత్వం పోలియో ప్రాజెక్టును మరింత విస్తరించి, పోలియో రహిత దేశంగా భారత్ కొనసాగడానికి కృషి చేయాలి.

# నాణ్యతలేని మందులతో జాగ్రత్త

ఆరోగ్యం



వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు ఎంతో నమ్మకంగా మందులు కొంటాం. వాడతాం. ఆ మందుల్లో నాణ్యత లోపిస్తే, వ్యాధులు తగ్గవు. రోగి ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం లేకపోలేదు. చాలా మంది తరచు వాడే 'షెల్కాల్ 500', 'పాన్ డి', 'పారాసిటమాల్' వంటి ఔషధాల్లోనూ నాణ్యత లోపించడం దారుణం. మనం తరచు ఉపయోగించే 49 రకాల ఔషధాలకు నాణ్యతా ప్రమాణాలు లేవని సెంట్రల్ డ్రగ్ రెగ్యులేటరీ అథారిటీ (సిడిఆర్ఎ) ప్రకటించింది. మార్కెట్‌లో నాణ్యతా ప్రమాణాలు లేని మందుల అమ్మకాలపై ఆందోళన వ్యక్తం చేసింది. లైఫ్ మాక్స్ కేన్సర్ లేబరేటరీ తయారు చేస్తున్న కాల్షియం సప్లిమెంట్ 'షెల్కాల్ 500'ను ఈమధ్యకాలంలో వృద్ధులేగాక, మద్యవయస్కులు కూడా వాడుతున్నారు. అదే విధంగా గ్యాస్టిక్ సమస్యలు ఉన్నవారు కాంబినేషన్ డ్రగ్ 'పాన్ డి'ని, ఎముకల బలానికి విటమిన్ 'డి' టాబ్లెట్స్‌ను వాడడం సర్వసాధారణమైంది. అయితే, ఈ మందులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి తయారు చేయడం లేదని సిడిఆర్ఎ స్పష్టం చేసింది. పారాసిటమాల్, ఆక్సిటోసిన్, ఫ్లూకోనజోల్, విటమిన్ డి 3 వంటి సుపరిచిత ఔషధాలతో కలిపి మొత్తం 49 ఔషధ నమూనాలను 'నాట్ ఆఫ్ స్టాండర్డ్ క్వాలిటీ' (ఎన్ఎస్‌క్యు)గా గుర్తించారు. సిడిఆర్ఎ తనిఖీ చేసిన సుమారు 3,000 నమూనాల్లో 1.5 శాతం మాత్రమే నాసిరకంగా ఉన్నట్లు తేలింది. నాణ్యతా ప్రమాణాలను అందుకోవడంలో విఫలమైన 49 ఔషధాలను నివేదికలో వివరించారు. ఈ జాబితాలో ఆల్కెమ్ హెల్త్ సైన్స్, అరిస్టో ఫార్మాస్యూటికల్స్ మరియు హిందుస్థాన్ యాంటీబయాటిక్స్ వంటి ప్రఖ్యాత కంపెనీలకు చెందిన వివిధ ఉత్పత్తులు ఉన్నాయి.

నాణ్యత లేని మందులు ఇవే..

టామ్సులోసిన్ అండ్ డుటాస్టరైడ్ టాబ్లెట్స్ (యూరిమాక్స్ డీ).
కాల్షియం, విటమిన్ డీ 3 టాబ్లెట్ లు I.P (షెల్కాల్ 500)
పాంటోప్రజోల్ గ్యాస్ట్రోరెసిస్టెంట్, డోంపెరిడోన్ దీర్ఘకాలిక విడుదల క్యాప్సూల్స్ ఐపి (పాన్‌డి)
నాంద్రోలోన్ డెకానోయేట్ ఇంజెక్షన్ ఐపి 25 మి.గ్రా / మి.లీ
న్యూరోటెమ్ఎన్ టి
సెఫురోక్సిమ్ ఆక్సెటిల్ టాబ్లెట్స్ IP 500 mg (జెకెఎంఎస్‌సిఎల్ సప్లై)
లోపెరామైడ్ హైడ్రోక్లోరైడ్ టాబ్లెట్స్ IP (జెకెఎంఎస్‌సిఎల్ సప్లై)
ఫ్లోక్సేజెస్ఓజెడ్ (ఓఫ్లోక్సాసిన్ ఆర్నిడాజోల్ టాబ్లెట్స్ ఐపి)
మోక్సికా 250 [అమోక్సిసిలిన్ డిస్పెర్సబుల్ టాబ్లెట్స్ ఐపి 250 మి.గ్రా]
ఫ్రూసెమైడ్ ఇంజెక్షన్ ఐపి 20 మి.గ్రా
క్లోక్సాసిలిన్ సోడియం క్యాప్సూల్స్ ఐపి 250 మి.గ్రా
ఫ్లోరోమెథోలోన్ ఐ డ్రాప్స్ ఐపి
పాన్లిబ్ 40 టాబ్లెట్లు
బి సిడల్ 625
ట్రిప్సిన్, బ్రోమెలైన్– రుటోసైడ్ ట్రైహైడ్రేట్ టాబ్లెట్లు [ఫ్లావోషిన్]
సి మాంట్ ఎల్సి కిడ్ 60 మి.లీ (మాంటెలుకాస్ట్–లెవియోసెటిరిజైన్ డైహైడ్రోక్లోరైడ్ సిరప్)
యోగరాజ గుగ్గులు టాబ్లెట్
టెల్మిసార్టన్ ట్యాబ్ ఐపి 40 మి.గ్రా
పాంటోప్రజోల్ బిపి 40 మి.గ్రా.
గ్లిమెపిరైడ్ టాబ్లెట్ ఐపి.

అప్రమత్తంగా ఉండాలి..

సెంట్రల్ డ్రగ్ రెగ్యులేటరీ అథారిటీ (సిడిఆర్ఎ) తనిఖీల్లో కొన్ని మందులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేవన్న వాస్తవం బయటపడినంత మాత్రాన భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదు. అప్రమత్తంగా ఉండడమే సరైన మార్గం. డ్రగ్ కంట్రోలర్ జనరల్ రాజీవ్ సింగ్ రఘువంశీ ప్రకారం, ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ఏదైనా నిర్దిష్టమైన బ్యాచ్ నుంచి ఒక ఔషధ నమూనా విఫలమై ఉండవచ్చు. అంత మాత్రాన ఆ పేరుతో విక్రయించే అన్ని ఉత్పత్తులు నాసిరకంగా ఉన్నాయని అనుకోవడానికి వీల్లేదు. పరీక్షించిన నిర్దిష్టమైన బ్యాచ్‌ని మాత్రమే నాసిరకంగా పరిగణిస్తారు. నాణ్యత లేదని పేర్కొన్న మందుల్లో హిందుస్తాన్ యాంటీబయాటిక్స్‌కు చెందిన మెట్రోనిడాజోల్ టాబ్లెట్లు, రెయిన్ బో లైఫ్ సైన్సెస్ కు చెందిన డోంపెరిడోన్ టాబ్లెట్లు కూడా ఉన్నాయి. ఇలాంటి కంపెనీల ఉత్పత్తులను టోకు మొత్తంగా నాసిరకమైనవని భావించకూడదు. కర్ణాటక యాంటీబయాటిక్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ ఉత్పత్తి చేసే పారాసిటమాల్ టాబ్లెట్లలో నాణ్యతా సమస్యలు కూడా దర్యాప్తులో వెల్లడయ్యాయి. వివిధ మందుల విషయంలో సిడిఆర్ఎ వంటి సంస్థలు ప్రకటించే హెచ్చరికలను గమనించి, ఆయా బ్యాచ్‌తో ఉన్న మందులను వాడకుండా జాగ్రత్త పడడం అవసరం. అంతేగానీ, మందులన్నీ నాసిరకమంటూ ముద్ర వేయడం తగదు.

## అరటితో ఆరోగ్యం



ఆరోగ్యంగా ఉండాలంటే, మనకు ఎప్పుడూ అందుబాటులో ఉండే అరటి పండు తినాల్సిందే. ఒక రకంగా చెప్పాలంటే, ఇది సంపూర్ణ ఆహారం. ఇందులో ఎ, బి1, బి2, బి6, సి వంటి ఎన్నో విటమిన్లు సమృద్ధిగా ఉన్నాయి. మెగ్నీషియం, పొటాషియంలు పుష్కలంగా వుంటాయి. కార్బొహైడ్రేట్లు ఎక్కువగా ఉండటంతో ఇది మంచి శక్తివంతమైన ఆహారం. మనం తినే ఆహార పదార్థాల ద్వారా ఎంతోకొంత కొలెస్ట్రాల్ మన శరీరంలోకి చేరుతుంది. కానీ, అరటి పండు వల్ల కొలెస్ట్రాల్ చేరదు. సుమారు వంద గ్రాముల పరిమాణం ఉన్న అరటి పండు ద్వారా 90 కిలోల క్యాలరీల శక్తి, 23 గ్రాముల పిండి పదార్థాలు, 12 గ్రా. చక్కెర, 2.6 గ్రా పీచు పదార్థం, 1 గ్రా. ప్రొటీన్, 9 మి.గ్రా. విటమిన్ 'సి', 358 మి.గ్రా. పొటాషియం లభిస్తాయి. ఇంతే పరిమాణంలో ఉన్న యాపిల్ కంటే నాలుగు రెట్లు ఎక్కువగా ప్రొటీన్లు, రెండు రెట్ల పిండిపదార్థాలు, మూడు రెట్లు ఫాస్ఫరస్, ఐదింతల విటమిన్ 'ఎ', ఐరన్, రెండు రెట్లు ఇతర విటమిన్లు, ఖనిజాలు అరటి పండులో ఉంటాయి. ఫ్రక్టోజ్, గ్లూకోజ్, సుక్రోజ్, పీచుపదార్థాలు ఇందులో ఉన్నాయి కాబట్టి, నీరసంగా ఉండే వారికి ఇది దివ్యౌషధం. ఇన్సులిన్ స్రావాన్ని వెంటనే పెంచడంతో పాటు త్వరగా జీర్ణమయ్యే తేలికపాటి ఆహారం కూడా ఇదే. ఎక్కువ పీచు పదార్థం ఉన్నందువల్ల మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఛాతీలో మంట ఉన్నప్పుడు అరటి పండు తినడం మేలని అంటారు. ఈ ఫలంలో ఎక్కువగా ఉన్న ఐరన్ రక్తంలో హిమోగ్లోబిన్‌ను పెంచి రక్తహీనతను తగ్గిస్తుంది. ఎన్నో విధాల శరీరానికి మంచిచేసే అరటి పండును రోజువారీ ఆహారంలో భాగంగా చేర్చుకోవడం అవసరం.

# పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

- టర్కీ రాజధాని ఏది?
  అంకారా.
- 'ది ఇలియడ్ ఎవరు వ్రాసారు?
  హోమర్.
- మహా మాంద్యం ఏ సంవత్సరంలో ప్రారంభమైంది?
  1929.
- యునైటెడ్ కింగ్‌డమ్ యొక్క కరెన్సీ ఏమిటి?
  బ్రిటిష్ పౌండ్ స్టెర్లింగ్.
- రేడియం, పొలోనియంను ఎవరు కనుగొన్నారు?
  మేరీ క్యూరీ.
- జర్మనీ రాజధాని ఏది?
  బెర్లిన్.

88. మాగ్నా కార్టా ఏ సంవత్సరంలో ఉనికిలోకి వచ్చింది?
  1215.

- 'ఫాదర్ ఆఫ్ బయాలజీ' అని ఎవరిని పిలుస్తారు?
  అరిస్టాటిల్.
- ఇటలీ కరెన్సీ ఏమిటి?
  యూరో.
- యునైటెడ్ స్టేట్స్ ఏ సంవత్సరంలో స్వాతంత్ర్యం ప్రకటించింది?
  1776.
- 'ది ఆర్ట్ ఆఫ్ వార్' ఎవరు రాశారు?
  సన్ ట్జు.
- కెనడా రాజధాని ఏది?
  ఒట్టావా.
- సాహిత్యంలో నోబెల్ బహుమతి పొందిన మొదటి మహిళ ఎవరు?
  సెల్మా లాగర్‌లోఫ్.
- స్వీడిష్ కరెన్సీ ఏది?
  స్వీడిష్ క్రోనా.
- పునరుజ్జీవనం ఏ సంవత్సరంలో ప్రారంభమైంది?
  పునరుజ్జీవనం సాధారణంగా 14వ శతాబ్దంలో ప్రారంభమైనట్లు పరిగణించబడుతుంది.
- 'ది పెర్సిస్టెన్స్ ఆఫ్ మెమరీ' ఎవరు చిత్రించారు?
  సాల్వడార్ డాలీ.
- మెక్సికో రాజధాని ఏది?
  మెక్సికో సిటీ.
- నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకున్న మొదటి మహిళ ఎవరు?
  బెర్తా వాన్ సట్నర్.
- జపాన్ కరెన్సీ ఏమిటి?
  జపనీస్ యెన్
- ఇన్ఫెక్షన్‌తో పోరాడే రక్తంలోని భాగాన్ని పేర్కొనండి?
  జవాబు WBC (తెల్ల రక్త కణాలు)
- చౌరీ చౌరా గ్రామం భారతదేశంలోని ఏ రాష్ట్రంలో ఉంది?
  ఉత్తర ప్రదేశ్
- మీరు 'ప్రాక్సిమా డి' అంటే ఏమిటి?
  ఇది కొత్త ఎక్సోప్లానెట్.
- క్రిమ్సన్ రోజ్ ఏ జాతికి చెందినది?
  సీతాకోకచిలుక
- ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (UNEP) ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
  జవాబు నైరోబి, కెన్యా
- ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (UNEP) ఎప్పుడు స్థాపించబడింది?



## హమాలీల కూలీరేట్లు పెంచరేమి?

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గోదావరిఖని కూరగాయల మార్కెట్ లో పని చేస్తున్న హమాలీలకు కూలీ రేట్లు పెంచకుంటె ఆందోళన కార్యక్రమాలు చేపడతామని జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అధ్యక్షులు ఎం.ఎ.గౌస్ హోల్ సేల్ వ్యాపారులను హెచ్చరించారు. ఆదివారం గోదావరిఖని కూరగాయల మార్కెట్ లో ఆయన హమాలీలతో కలిసి హోల్ సేల్ వ్యాపారుల మొండి వైఖరి పై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోదావరిఖని కూరగాయల మార్కెట్ లో దాదాపు రెండు వందల మంది హమాలీ వర్కర్స్ హోల్ సేల్ వ్యాపారుల వద్ద గత ముప్పై సంవత్సరాలుగా పని చేస్తున్నారని, వారికి గత మూడు సంవత్సరాల క్రితం పెంచిన కూలీ రేట్లు చెల్లిస్తున్నారని, కూలీ రేట్లు పెంపు కాలపరిమితి ముగిసి సంవత్సరం గడిచినా ఇంత వరకు కూలీ రేట్లు పెంచాలని అడిగినా, డిమాండ్ లేఖలు ఇచ్చిన రేట్లు పెంచకుండా హోల్ సేల్ వ్యాపారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. చాలిచాలని కూలి రేట్ల చెల్లింపు తో, వారు మార్కెట్ లో ఉన్న అధిక రేట్ల వల్ల నిత్యావసర వస్తువులు తెచ్చుకోలేక అనేక అవస్తలు పడుతున్నారని ఆయన అన్నారు. తక్షణమే హోల్ సేల్ వ్యాపారులు స్పందించి హమాలీ కార్మికుల కు కూలీ రేట్లు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు, లేనిచో ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కండె లక్ష్మయ్య, రాంచందర్, సతీష్, ఎం.డి.జానీమియా తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌హెచ్‌పిలను క్రమబద్ధీకరించాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



ప్రజాపక్షం / ఆసిఫాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పి (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్) లను క్రమబద్ధీకరించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు దివాకర్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ 2020 నుండి పలు దఫాలుగా ఎంఎల్‌హెచ్‌పిలు రిక్రూట్మెంట్ అవటం జరిగిందని, వీరందరినీ ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని, 45 వేలు వేతనం ఇవ్వాలని, ఇతర రాష్ట్రాలలో మాదిరిగానే ఎంఎల్‌హెచ్‌పి లుగా కాకుండా సిహెచ్ఓ గా పరిగణించాలని, ప్రతిపాదిత పల్లె దావాఖాన సబ్ సెంటర్లో వీలైనంత త్వరగా పక్కా భవనాలను నిర్మించాలని పలు డిమాండ్లు చేశారు. అదేవిధంగా ఫీల్డ్ లెవల్ లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పిలు గణేష్, రాందాస్, ప్రశాంత్, సారిక, కీర్తన, తిరుమల, సుచరిత, ప్రశాంత్, విజయ సాగర్ పాల్గొన్నారు.

# తక్షణం మహిళా రిజర్వేషన్లు అమలు

### ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి



ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి : మహిళా రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలని,మహిళలను పాలనలో భాగస్వాములను చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి అన్నారు. ఖిలా వరంగల్ మండలంలో ఆదివారం చిట్యాల సువర్ణ అధ్యక్షతన భారత జాతీయ మహిళా సమాఖ్య ఖిలా వరంగల్ మండల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథి నేదునూరి జ్యోతి మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం లౌకిక వ్యవస్థ రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, మోడీ ప్రభుత్వంపై ధ్వజమెత్తరు. కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ పేరుతో మహిళా రిజర్వేషన్లు వాయిదా వేయడాన్ని తీవ్రంగా ఖండించిన దేశ అభివృద్ధిలో మహిళను భాగస్వామ్యం చేయాలంటే ప్రజాస్వామ్యం రాజ్యాంగం లౌకిక వ్యవస్థ పరిరక్షించబడాలంటే దేశ అభివృద్ధిలో మ హిళా శక్తి సామర్థ్యాలను వినియోగించబడాలన్నారు. రా జకీయ రంగంలో ఆర్థిక రం గంలో జనాభాలో సగభాగం ఉన్న మహిళా శక్తి లేకుండా దేశం అభివృద్ధి చెందడం అసాధ్యమన్నారు. డిగ్రీ వరకు బాలికలకు ఉచిత విద్య అందించాలని మహిళా పేరుమీదనే సంక్షేమ పథకాలను అందించాలని మహిళలపైజరిగేఅసమానతలను హిం సను అరికట్టాలని లేనియెడల ప్రభుత్వాలపై మహిళల ప్రతిఘటన తప్పదన్నారు. తేది 20, 24 నవంబర్ నెలలో హైదరాబాదులో భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలు జరుగుతాయన్నారు. జిల్లా, మండల స్థాయిలో ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ సభ్యత్వాలను చేర్పిస్తూ కమిటీలను వేస్తూ నిర్మాణాన్ని చేసి మహిళా సమాఖ్య ఉద్యమాల్ని ఉధృతం చేస్తామన్నారు. నిలువ నీడ లేని నిరుపేదలకు సెంటు గుంట లేని పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. భారత జా తీయ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి తాళ్లపల్లి రహేలా,జిల్లా సహాయ కార్యదర్శి సుంకరి భవాని, జిల్లా కార్యవర్గ సభ్యులు వనం సౌందర్య ,ఉమా సీనియర్ నాయకురాలు నవాంబి, తిరుపతమ్మ, గౌతమి, రాజేశ్వరి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

## 105వ ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయాలి

ప్రజాపక్షం/బైంసా : బైంసా పట్టణంలో ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి పెండరి ముత్యం అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ నెల 31న ఎఐటియుసి 105వ ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చారు. 1920వ సంవత్సరంలో లాజ పత్రాయి పజాబ్ కేసరి అధ్యక్షతన ఏర్పడిందని అన్నారు.బ్రిటిష్ పరిపాలనలోనే37 చట్టాలను పోరాటాలతో సాధించిన ఘనత ఎఐటియుసికి ఉందన్నారు.చట్టాలను రద్దు చేసి 4 కోడ్‌లు కార్మిక వ్యతిరేకమైనవి ప్రభుత్వం తెచ్చింది.రద్దుకై ఎఐటియుసి పోరాటం చేస్తుందన్నారు.31నయూనియన్‌కార్యాలయంలో పతాకావిష్కరణచేయాలన్నారు.బి.శివాజీ,ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మణ్,గంగాధర్, విట్టల్, సోమేశ్, జె.రాములు పాల్గొన్నారు.

# మహిళల హక్కుల సాధన సమరానికి సిద్ధం

### ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన




ప్రజాపక్షం / మహబూబ్‌నగర్ ప్రతినిధి : మహిళల హక్కుల సాధనకై మహిళా లోకం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన పిలుపునిచ్చారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) మహబూబ్‌నగర్ జిల్లా మహిళల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిలుగా ఉస్తెల సృజన మాట్లాడుతూ..శాస్త్ర సాంకేతిక రంగం అభివృద్ధి చెందుతుందని అబ్బుర పడుతున్న నేటి సమాజంలో మహిళలపై వికృత రూపంతో కొత్త పుంతలు తొక్కుతూ మహిల మన ప్రాణాలకు రక్షణ లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు అనుసరిస్తున్న మద్యం విధానంతో పచ్చని కుటుంబ వ్యవస్థ విధ్వంసం అవుతూ యువతను చెడు వ్యసనాలకు ప్రేరేపితం అవుతున్నారన్నారు. మహిళలపై రోజురోజుకు హింస దాడులు అత్యాచారాలు లైంగిక వేధింపులుపెరిగిపోతున్నాయని మహిళల మన ప్రాణాల రక్షణకు ఎన్ని చట్టాలు వచ్చినా స్త్రీలపై అఘాయిత్యాల పరంపర ఆగడం లేదని అన్నారు. ఎన్నికల ముందు మహిళా లోకానికి ఇచ్చిన వాగ్దానాలను అన్నిటిని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**ఎన్ఎఫ్ఐడబ్ల్యు నూతన జిల్లా కమిటీ ఎన్నిక**

భారత జాతీయ మహిళ సమాఖ్య ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన నేతృత్వంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యు మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షురాలుగా జి.భార్గవి, ప్రధాన కార్యదర్శి కొండి కంటి పద్మావతి, ఉపాధ్యక్షురాలుగా ఇందిరా, సహాయ కార్యదర్శిగా సత్యమ్మ, కోశాధికారిగా కృష్ణవేణి, కార్యవర్గ సభ్యులుగా కోట శ్రీలత, మాధవి, కమిటీ సభ్యులుగా జ్యోతి, ఎం పద్మలతో పాటు మరో పదకొండు మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు రాష్ట్ర నాయకురాలు ఇందిరా, జిల్లా నాయకులు కొండికంటి పద్మావతి, గాయని కే. శ్యామల, సుగుణ, శశికళ, లక్ష్మి , గీతమ్మ, రాధ, అరుణ, శేషికళ, జాహిదబేగం, వెంకటమ్మ, శిరీష, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలపై సాగుతున్న దాడులు, హత్యలను అరికడదాం



ప్రజాపక్షం/గజ్వేల్ (మెదక్‌జిల్లా) : గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ ఆర్ కాలనీ పల్లెపహాడ్ లో సిపిఐ ఆధ్వర్యంలో ఆదివారం మహిళా సమాఖ్య సంఘం ఏర్పటైంది. మహిళల భద్రత, మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యలు, ఆకృత్యాలు, అన్యాయాలను ఎదుర్కొనే క్రమంలో మహిళలు ఏకమై అడుగులు వేయాలని భావిస్తూ జాతీయ మహిళా సమైక్య సంఘం జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, సిపిఐ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ ఆధ్వర్యంలో నూతన మహిళా సమైక్య సంఘం ఏర్పాటు చేశారు. ఈ సంఘంలో అధ్యక్షురాలుగా శివలింగు లక్ష్మి, ఉపాధ్యక్షురాలుగా గూడూరి యాదవ్వ, సహాయ కార్యదర్శిగా మడుగూరి లావణ్యను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేశం, కొండకింది పోచయ్య, కొండి రాజం, రుద్రారం బిక్షపతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సలాంను పరామర్శించిన కూనంనేని

ప్రజాపక్షం/ఖమ్మం : సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాంను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పరామర్శించారు. ఇటీవల సలాం గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ అనారోగ్యానికి గురయ్యారు. ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న సలాంను కూనంనేని ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలలో పనిచేసే వారు అనారోగ్యానికి గురికావడం శోచనీయమని, సలాం త్వరగా కోలుకుని తిరిగి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. పరామర్శించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, నగర నాయకులు యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, చానా, జ్వాలా నర్సింహారావు, సురేష్‌నాయక్, నాగేశ్వరరావు, మాలకొండయ్య, కాశీంపాషా, ముజమిల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎఫ్ఐడబ్ల్యుతోనే సమస్యల పరిష్కారం



ప్రజాపక్షం/ఎల్కతుర్తి : భారత జాతీయ మహిళా సమాఖ్యతోనే మహిళా సమస్యల పరిష్కారం సాధ్యమని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మండ సదాలక్ష్మి అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాలపురంలో మహిళా ఎన్ఎఫ్ఐడబ్ల్యూ సభ్య త్వాల చేర్పింపు కార్యక్రమాన్ని సదాలక్ష్మి ప్రారంభించారు. ఈ సం దర్భంగా మండ సదాలక్ష్మి మాట్లాడుతూ మహిళలంతా మహిళా సమాఖ్యలో భాగస్వాములు కావాలని కోరారు.మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మంచాల రమాదేవి,జిల్లా ఉపాధ్యక్షురాలు గడ్డం లలిత తదితరులు పాల్గొన్నారు.

# ఈవారం స్టాక్ మార్కెట్‌లో అనిశ్చితి తప్పదా?



బాంబే స్టాక్ ఎక్ఛేంజ్ (బిఎస్ఇ), నేషనల్ స్టాక్ ఎక్ఛేంజ్ (బిఎస్ఇ)లో గతవారం చోటు చేసుకున్న పరిణామాలను గమనిస్తే, ఈవారం స్టాక్ మార్కెట్‌లో అనిశ్చితి తప్పదనే అభిప్రాయం కలుగుతోంది. ముఖ్యంగా గతవారం లావాదేవీలకు చివరి రోజరైన శుక్రవారం (అక్టోబర్ 25) స్టాక్ మార్కెట్ కుప్పకూలడం ఈ వాదనకు బలాన్నిస్తున్నది. ఎవరూ ఊహించని విధంగా ఆ రోజు స్టాక్ మార్కెట్ తీవ్రమైన అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంది.ఫలితంగా బిఎస్ఇలో సెన్సెక్స్, ఎన్ఎస్ఇలో నిఫ్టీ పాయింట్లు ఒక సగటున ఒక శాతం మేర పడిపోయాయి. మిడ్, స్మాల్ క్యాప్ సెగ్మెంట్లు 2 శాతం నష్టాన్ని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ 663 పాయింట్లు లేదా 0.83 శాతం క్షీణించి 79,402.29 వద్ద, నిఫ్టీ 219 పాయింట్లు లేదా 0.90 శాతం క్షీణించి 24,180.80 వద్ద ముగిశాయి. బిఎస్ఇ క్యాప్ సూచీలు 1.48 శాతం, స్మాల్ క్యాప్ సూచీలు 2.44 శాతం చొప్పున నష్టపోయాయి. ఇక్కడ లిస్టయిన కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ గత సెషన్‌లో దాదాపు రూ.444 లక్షల కోట్లు ఉండగా, శుక్రవారం సెషన్ ముగిసే సమయానికి రూ.438 లక్షల కోట్లకు పడిపోయింది. అంటే, ఇన్వెస్టర్ల సంపద ఒక్కరోజులోనే దాదాపు రూ.6 లక్షల కోట్లు ఆవిరైంది. అస్థిరత సూచీ అయిన ఇండియా విఐఎక్స్ దాదాపు 5 శాతం పెరిగి 14.63 కు చేరుకుంది. ఇది మార్కెట్ భాగస్వాములలో ఆందోళనను సూచిస్తుంది. సెన్సెక్స్, నిఫ్టీ 50 వరుసగా ఐదో సెషన్ నష్టాల్లో ముగిశాయి. స్థూలంగా చూస్తే, గత వారం సెన్సెక్స్ 2.2 శాతం, నిఫ్టీ 2.7 శాతం నష్టపోయాయి. సెన్సెక్స్, నిఫ్టీ 50 రెండూ సెప్టెంబర్ 27న తాకిన 85,978.25, 26,277.35 పాయింట్ల ఆల్ టైమ్ గరిష్టాల నుంచి 8 శాతం క్షీణించాయి. 'బేర్' ముందు 'బుల్' చేష్టలుడిగిపోయింది.

స్టాక్ మార్కెట్లు ఈ విధంగా కుప్పకూలడానికి ప్రధాన కారణాల్లో భారీ విదేశీ మూలధన ప్రవాహాన్ని ప్రముఖంగా ప్రస్తావించుకోవాలి. విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్‌పిఐ) దూకుడు అమ్మకాలే మార్కెట్ పతనానికి ఒక ముఖ్య కారణమని నిపుణులు భావిస్తున్నారు. అక్టోబర్‌లో ఎఫ్‌పిఐలు రూ.98,000 కోట్లకు పైగా విలువైన భారతీయ ఈక్విటీలను విక్రయించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. చైనా మార్కెట్ల చౌక వాల్యుయేషన్ కారణంగా, అలాగే, బీజింగ్ ఇటీవల కొన్ని ఉద్దీపన చర్యలను ప్రకటించిన నేపథ్యంలో, ఎఫ్పీఐలు తమ నిధులను చైనా స్టాక్స్‌లోకి మళ్లిస్తున్నారు. "ఎఫ్పీఐ అమ్మకాలు అనూహ్యంగా ఉన్నాయి. కోవిడ్19 సంక్షోభం, ప్రపంచ ఆర్థిక సంక్షోభం సమయంలో కూడా వారు ఇంత విలువైన భారతీయ ఈక్విటీలను విక్రయించలేదు. ఈ నెల 24 వరకు రూ.98,085 కోట్లకు చేరిన ఎఫ్ఐఐల భారీ, స్థిరమైన, అపూర్వ అమ్మకాలతో బైఆన్‌డిప్స్ వ్యూహం పనిచేయడం లేదని నిపుణులు పేర్కొంటున్నారు. అదే విధంగా భారతీయ కంపెనీల సెప్టెంబర్ త్రైమాసిక ఆదాయాలు నిరాశాపూరితంగా ఉండడం కూడా స్టాక్ మార్కెట్ల పతనానికి ఒక కారణం. ఇది మార్కెట్ వాల్యుయేషన్లపై ఆందోళనలను తీవ్రతరం చేసింది. ఇప్పటివరకు ప్రకటించిన రెండో త్రైమాసిక కార్పొరేట్ ఫలితాలు భారత కంపెనీ ఆదాయం, లాభాల వృద్ధి రేటు మందగించినట్లు తెలియజేస్తున్నాయని తాప్సే అన్నారు. "క్యూ2 గణాంకాలు బలహీనంగా ఉన్నాయి. బలహీనమైన గ్రామీణ వినియోగంతో పాటు పట్టణ వినియోగం కూడా బలహీనంగా ఉంది. 2025 ఆర్థిక సంవత్సరంలో ఆదాయ వృద్ధి 10 శాతం లేదా అంతకంటే తక్కువగా ఉండవన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. నవంబర్ 5న జరిగే అమెరికా ఎన్నికలపై అనిశ్చితి కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నది. తాజా ఒపీనియన్ పోల్ ట్రెండ్స్ కమలా హారిస్, డొనాల్ ట్రంప్ మధ్య హోరాహోరీ పోరును చూపిస్తున్నాయి. కమలా హారిస్ అధ్యక్షురాలైతే బైడెన్ ప్రభుత్వ వాణిజ్య విధానాలను ఆమె ముందుకు తీసుకెళ్లవచ్చన్న అభిప్రాయం ఉంది. మరోవైపు వాణిజ్య అసమతుల్యత, వలసలపై మరింత పరిశీలనతో ట్రంప్ మరింత లావాదేవీ విధానాన్ని అనుసరించవచ్చు. ఒకవేళ ట్రంప్ ఎన్నికైతే, అతను మార్కెట్‌ను పూర్తిగా దెబ్బతీసే చర్యలు తీసుకోకపోవచ్చు. అయితే పన్నులు, అధిక సుంకాలు విధిస్తే అది ప్రపంచ వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదు. భౌగోళిక అంశాలు కూడా భారత స్టాక్ మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. మధ్యప్రాచ్యంలో పరిణామాలు మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేస్తున్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం అంతర్జాతీయంగా మార్కెట్లను భయపెడ్తున్నాయి. కాగా, మార్కెట్ ఇప్పటికీ సరైన వాల్యుయేషన్స్ వద్ద లేదని, ఇది మార్కెట్ అమ్మకాలకు దోహదం చేస్తోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ట్రెండ్ లైన్ డేటా ప్రకారం, నిఫ్టీ 50 ప్రస్తుత ప్రైస్‌టుఎర్నింగ్స్ (పిఇ) నిష్పత్తి 22.8 వద్ద దాని ఒక సంవత్సరం, రెండేళ్ల సగటు పిఇ వరుసగా 22.6, 22.2 కంటే ఎక్కువ. ఇటీవల కరెక్షన్ తరువాత కూడా ఇప్పటికీ కొనుగోలు చేయదగిన పరిస్థితి లేదని, ప్రస్తుత మార్కెట్ వ్యాల్యూ ఇంకా ఎక్కువగానే ఉందని నిపుణుల అభిప్రాయం. ఇలావుంటే, వచ్చే వారం దీపావళి కారణంగా, దేశీయ మదుపరులు ఆచితూచి అడుగులు వేయడం ఖాయం. దేశంలో కొనసాగుతున్న 'బంగారం కొనుగోలు' సెంటిమెంట్ బలంగా ఉంటే, పండుగ పూర్తయ్యే వరకూ స్టాక్ మార్కెట్‌లో లావాదేవీలు క్షీణించే అవకాశం ఉంది. ఏదిఏమైనా, ఈవారం స్టాక్ మార్కెట్‌లో అనిశ్చితి తప్పదన్న అభిప్రాయం బలంగా వినిపిస్తున్నది. కాలానుగుణంగా మార్కెట్ క్షీణత సాధారణం. అయితే, వృద్ధి సామర్థ్యం, కార్పొరేట్ రాబడులు దీర్ఘకాలంలో మార్కెట్ ను ప్రభావితం చేస్తాయి. ప్రగతిశీల విధాన వాతావరణం, బలమైన స్థూల ఆర్థిక నిర్వహణ కారణంగా ఆర్థిక వ్యవస్థ తిరోగమన దశలో ఉన్నందున, వృద్ధి విజిబిలిటీ, దానిని కొనసాగించే ఆర్థిక వ్యవస్థ సామర్థ్యం గణనీయంగా పెరిగిందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. గత క్షీణతలన్నీ అవకాశాలుగా కనిపిస్తున్నాయని, భవిష్యత్తులో జరిగే పతనాలన్నీ రిస్క్ లుగా కనిపిస్తున్నాయని, అయితే ప్రస్తుత అమ్మకాలు కొత్త దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు అత్యుత్తమంగా బలమైన వ్యాపార నమూనాలను సమకూర్చుకోవడానికి ఒక అవకాశంగా కనిపిస్తోందన్న అభిప్రాయాలు కూడా లేకపోలేదు. మొత్తం మీద ఈవారం స్టాక్ మార్కెట్ తీరుతెన్నులు ఎలావుంటాయన్నది ప్రస్తుతానికి బిలియన్ డాలర్ల ప్రశ్న.

# బాంద్రా రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట



**ముంబయి :** ముంబయిలోని బాంద్రా రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగింది. గోరఖ్‌పూర్ రైల్‌లో వెళ్లేందుకు ప్రయాణికులు పోటెత్తారు. దీంతో ఒక్కసారిగా తొక్కిసలాట జరగగా 9 మంది గాయపడినట్లు మున్సిపల్, విపత్తు నియంత్రణ అధికారులు పేర్కొన్నారు. అయితే పశ్చిమ రైల్వే మాత్రం ఇద్దరు మాత్రమే గాయపడినట్లు ఒక ప్రకటనలో పేర్కొనడం గమనార్హం. రానున్నపండుగల నేపథ్యంలో ప్రజలు పెద్ద సంఖ్యలో తమ సొంతూళ్లకు పయనమయ్యారు. ఈ తరుణంలోనే బాంద్రా రైల్వేస్టేషన్‌కు భారీగా తరలి వచ్చారు. బాంద్రా–గోరఖ్‌పూర్ అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ రైలు ఒకటవ ప్లాట్‌ఫారంకు చేరుకోగానే రైలు ఎక్కేందుకు ఒక్కసారిగా ఎగబడడంతో తొక్కిసలాట జరిగినట్లు మున్సిపల్ అధికారులు చెప్పారు. రైలు కదులుతుండగానే కొంతమంది ప్రయాణికులు రైలు ఎక్కేందుకు ప్రయత్నించగా వారు ప్రమాదానికి గురైకిందపడిపోయారని, ఇద్దరికి గాయాలైనట్లు పశ్చిమ రైల్వే ఆదివారం ఉదయం ఒక ప్రకటనను విడుదల చేసింది. అక్కడే విధుల్లో ఉన్న ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి, హోంగార్డ్ అధికారులు వెంటనే స్పందించి క్షతగాత్రులను సమీపంలో ఉన్న భాభా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆ ప్రకటనలో తెలిపింది. ఇదిలా ఉండగా, ముంబయి విపత్తు నియంత్రణ విభాగం, మున్సిపల్ అధికారులు మాత్రం రిజర్వ్‌కాని రైలులోకి ఎక్కేందుకు ప్రయత్నించే క్రమంలో జరిగిన తొక్కిసలాటలో 9 మంది ప్రయాణికులకు గాయాలైనట్లు చెప్పారు. ఘటన లో గాయపడ్డ ప్రయాణికులను రైల్వే సిబ్బంది స్ట్రెచర్‌పై ఆసుపత్రికి తరలించిన దృశ్యాలను పలువురు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఈ ప్రమాదంలో గాయపడినవారిని షబీర్‌అబ్దుల్ రెహమాన్ (40), పరమేశ్వర సుఖదర్‌గుప్తా (28), రవీంద్ర హరిహర్ చుమా (30), రామసేవక్ రవీంద్ర ప్రసాద్ ప్రజాపతి (29), సంజయ్ తిలకం కాంగే (27), దివ్యాన్షు యోగేంద్ర యాదవ్ (18), మహ్మద్ షరీఫ్, షేక్ (25), ఇంద్రజిత్ సహాని (19), నూర్ మహ్మద్ షేక్ (18)గా గుర్తించారు.

**కేంద్రంపై సంజయ్ రౌత్ విమర్శలు**

కాగా, బాంద్రా రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనపై శివసేన (యుబిటి) నాయకుడు సంజయ్ రౌత్ స్పందించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం మూడోసారి కొలువుదీరి, రైల్వే మంత్రి బాధ్యతలు చేపట్టాక ఇప్పటివరకు 25కిపైగా పెద్ద రైలు ప్రమాదాలు జరిగాయని విమర్శించారు. ఈ దుర్ఘటనల్లో 100మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. 'ప్రధాని నరేంద్ర మోదీ ఏమో బుల్లెట్ రైళ్లు, మెట్రో, హైస్పీడ రైళ్ల గురించి మాట్లాడతారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ బస్సులను గాలిలో నడపడం గురించి మాట్లాడతారు. కానీ, క్షేత్రస్థాయిలో వాస్తవం వేరు. రైలు ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి. దీనికి రైల్వే మంత్రి బాధ్యుడు కాదా?' అని సంజయ్ రౌత్ ప్రశ్నించారు.

# మహాయుతి ప్రభుత్వం కుబేరులకు కొమ్ముకాస్తోంది...

## కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జి జైరాంరమేష్ ఆరోపణల దాడి



**న్యూఢిల్లీ :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతోన్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మహారాష్ట్రలోని మహయుతి సర్కార్‌పై రోజురోజుకూ తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధిస్తోంది. మహారాష్ట్రలో మహయుతి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలు, అడవుల శ్రేయస్సు కంటే కార్పోరేట్ కుబేరుల ప్రయోజనాలను కాపాడేందుకు తన అధికారశక్తులు అన్నింటినీ ఉపయోగిస్తున్నదని కాంగ్రెస్ పార్టీ ఆదివారం నాడు ఆరోపించింది. నంబరు 20వ తేదీన మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తన స్వరాన్ని తీవ్రస్థాయికి పెంచుతోంది. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జి జైరాంరమేష్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో ఆయన తన 'పోస్ట్'ను పెట్టారు. నవంబరు 23న అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఎజిఇఎల్) ప్రతిపాదించిన విధంగా జల విద్యుత్ ప్రాజెక్ట్‌ల ప్రతిపాదనలను ఆమోదించే కేంద్రం యొక్క ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ(ఇఎసి)కి అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ప్రధాన సలహాదారుని నియమించారని జైరాం రమేష్ ఆరోపించారు. వెంటనే ఆ తర్వాత 2023 డిసెంబరులో కొల్హాపూర్‌లోని 100కంటే ఎక్కువ గ్రామాల నివాసితులు రూ.7,000కోట్ల పాట్గం పంప్ స్టోరేజీ ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపిన విషయాన్ని ఆయన ఉదహరించారు. కొంతకాలంగా కొల్హాపూర్ ప్రాంతం తక్కువ వర్షపాతంతో సంఘర్షణకు గురిఅవుతోందన్నారు. నీటి లభ్యత చాలా తక్కువగా ఉన్నప్పటికీ ప్రాజెక్ట్‌కు అనుమతి లభించడానికి ముందు ఎలాంటి బహిరంగ సభలు నిర్వహించలేదని, దుర్భర నీటి పరిస్థితి సమస్య ప్రభావం కారణంగా స్థానికులు ఎంతగానో బాధపడుతున్నప్పటికీ మహయుతి ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని జైరాంరమేష్ ధ్వజమెత్తారు.పశ్చిమకనుమలలో పర్యావరణ సున్నిత ప్రాంతాలు మూడింటిలో ఒక ప్రతిపాదనకు ఆమోదం లభించడంతో ఈ ఆందోళన మొదలైందని ఆయన చెప్పారు. నిర్మాణ సమయంలో అడవులకు పెద్దయెత్తున నష్టం తలెత్తనున్నదన్న ప్రమాద హెచ్చరికలను ఏమాత్రం ఖాతరు చేయకుండా అదానీ సొంత పర్యావరణ మూల్యాంకనాలకు అనుగుణంగా ప్రాజెక్ట్‌లకు ఏదోవిధంగా ఆమోదం ఇవ్వాలన్నదే ప్రభుత్వ అభిమతంగా కనిపించిందని జైరాం రమేష్ ధ్వజమెత్తారు. బారతీయ జనతాపార్టీ (బిజెపి), మహాయుతి చట్టబద్ధమైన ప్రక్రియకు సంబంధించి నిసిగ్గుగా చేసే అవకతవకలు స్థానికసంస్థలు, స్థానిక పర్యావరణంపై స్పష్టంగా తీవ్ర ప్రభావం కలిగిస్తుందని జైరాం రమేష్ ఆరోపించారు.

# దెప్సాంగ్, దెమ్‌చోక్‌లో ఉపసంహరణ తొలి అడుగు

## తదుపరి ఉద్రిక్తతల సడలింపు : చైనాపై జైశంకర్



**ముంబయి :** లడాఖ్‌లో దెప్సాంగ్, దెమ్‌చోక్‌లలో సేనల ఉపసంహరణ తొలి అడుగు అని, భారత్ 2020 గస్తీ స్థాయికి తిరిగి వెళుతుందని ఆశిస్తున్నామని విదేశాంగ శాఖ మంత్రి (ఇఎఎం) ఎస్ జైశంకర్ ఆదివారం చెప్పారు. తదుపరి చర్య ఉద్రిక్తతల సడలింపు అని, ఆవలి పక్షం నుంచి అది జరుగుతోందని భారత్ నమ్మేంత వరకు అది జరగబోదని ఇఎఎం చైనాను దృష్టిలో పెట్టుకుని స్పష్టం చేశారు. నాలుగు సంవత్సరాలకు పైగా కొనసాగుతున్న సైనిక ప్రతిష్టంభనను అంతం చేస్తూ తూర్పు లడాఖ్‌లో ఎల్ఎసి పొడుగునా గస్తీపై చైనాతో ఒప్పందానికి వచ్చినట్లు భారత్ ఈ వారం ఆరంభంలో ప్రకటించింది. జైశంకర్ ముంబయిలో విలేకరుల గోష్ఠిలో మాట్లాడుతూ, దెప్సాంగ్, దెమ్‌చోక్‌లలో గస్తీ, సేనల ఉపసంహరణపై ఏకాభిప్రాయం సాధించినట్లు చెప్పారు. 'దానిని అమలు చేయడానికి వ్యవధి పడుతుందనేది వాస్తవం. ఇది సేనల ఉపసంహరణ, గస్తీకి సంబంధించిన అంశం. అంటే మన సేనలు పరస్పరం ఎదురుపడే స్థితికి వచ్చాయి. ఇప్పుడు అవి తమ స్థావరాలకు తిరిగి వెళ్లవలసి ఉంటుంది. 2020 స్థాయి తిరిగి నెలకొంటుందని ఆశిస్తున్నాం' అని ఆయన తెలిపారు. సేనల ఉపసంహరణ పూర్తి అనేది తొలి అడుగు అని, తదుపరి అడుగు ఉద్రిక్తతల సడలింపు అని, ఆవలి వైపు కూడా అది జరుగుతోందని భారత్ నమ్మేంత వరకు అది జరగబోదని ఇఎఎం వివరించారు. 'ఉద్రిక్తతల సడలింపు అనంతరం సరిహద్దుల నిర్వహణ ఎలా అనేది చర్చించనున్నాం' అని జైశంకర్ తెలిపారు.

# 'డిజిటల్ అరెస్టు'లపై చైతన్యమే కీలకం

- జనాన్ని లక్షం చేసుకునే వంచకులతో తస్మాత్ జాగ్రత్త
- 'మన్ కీ బాత్'లో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ :** 'డిజిటల్ అరెస్టు'ల సైబర్ నేరానికి పాల్పడుతూ జనాన్ని లక్షం చేసుకునే వంచకుల గురించి ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం తన నెలవారీ 'మన్ కీ బాత్'లో అప్రమత్తం చేశారు. అటువంటి కుంభకోణం ఎదురైనప్పుడు 'ఆగండి, ఆలోచించండి, చర్య తీసుకోండి' అనే మంత్రాన్ని అనుసరించవలసిందిగా ప్రజలకు ప్రధాని విజ్ఞప్తి చేశారు. ఆ చర్యలు వారికి డిజిటల్ భద్రత సమకూరుస్తాయని మోడీ స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్రాలతో కలసి దర్యాప్తు సంస్థలు పని చేస్తున్నాయని ఆయన చెప్పారు. అయితే. ఈ నేరం నుంచి స్వీయ రక్షణకు చైతన్యం కీలకం అని ప్రధాని ఉద్ఘాటించారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, భగవాన్ బిర్సా ముండా 150 జయంత్యుత్సవాలను నిర్వహించాలని దేశం నిర్ణయించిందని కూడా ప్రధాని వెల్లడించారు. సర్దార్ పటేల్ 150 జయంత్యుత్సవం ఈ నెల 31న మొదలు కానుండగా, బిర్సా ముండా జయంత్యుత్సవం నవంబర్ 15 నుంచి జరుగుతుందని మోడీ తెలియజేశారు. ఈ నెల 31న సర్దార్ పటేల్ జయంత్యుత్సవం దీపావళి పండగతో పాటే జరగనుండడంతో ఈ ఏడాది 'రన్ ఫర్ యూనిటీ' (సమైక్యత కోసం పరుగు) కార్యక్రమాన్ని మంగళవారం (29న) నిర్వహించనున్నట్లు మోడీ తెలిపారు. డిజిటల్ అరెస్టు సైబర్ నేరాన్ని ఎత్తిచూపేందుకు ఒక బాధితునికి, ఒక వంచకునికి మధ్య జరిగిన సంభాషణను కూడా ప్రధాని మోడీ తన 'మన్ కీ బాత్'లో పంచుకున్నారు. 'డిజిటల్ అరెస్టు ఫోన్ కాల్స్ చేసే వంచకులు కొన్నిసార్లు పోలీసులు, సిబిఐ, నార్కోటిక్స్, ఒక్కొక్కసారి ఆర్‌బిఐ వంటి వివిధ పేర్లను ఉపయోగించుకుంటూ ఎంతో నమ్మకంగా బోగస్ అధికారుల వలె సంభాషిస్తుంటారు. 'మన్ కీ బాత్' శ్రోతలు అనేక మంది ఆ విషయమై మనం చర్చించాలని ఆకాంక్షించారు' అని మోడీ తెలియజేశారు. 'ఆ వంచక ముఠాలు ఎలా పని చేస్తుంటాయో మీకు చెబుతాను. ఈ ప్రమాదకర గేమ్ ఏమిటి? దానిని అవగాహన చేసుకోవడం మీకు అత్యంత ప్రధానం' అని ఆయన అన్నారు. అటువంటి వంచకుల విధానాన్ని మోడీ వివరిస్తూ, వారు ముందుగా వ్యక్తిగత సమాచారం సేకరించి, తరువాత తమ రెండవ యత్నంగా భయ వాతావరణం సృష్టిస్తుంటారని చెప్పారు. 'మీరు క్రితం నెల గోవా వెళ్లారు, మీరు వెళ్లలేదా? మీ కుమార్తె ఢిల్లీలో చదువుకుంటోంది, సరేనా? వారు మీ గురించి అటువంటి సమాచారం ఎంతగానో సేకరించి మిమ్మల్ని విస్మయపరుస్తారు. రెండవ యత్నంగా భయ వాతావరణం సృష్టించి యూనిఫామ్, ప్రభుత్వ కార్యాలయం సెటప్. చట్టం సెక్షన్లు. వారు ఫోన్‌లోనే అంతగా మిమ్మల్ని భయపెడతారు. సంభాషణ మధ్యలో మీకు ఆలోచించుకోవడానికైనా వీలు కుదరదు' అని ఆయన వివరించారు. అటువంటి వంచకుల మూడవ యత్నం ఏమంటే సమయం గురించి ఒత్తిడి తీసుకురావడం అని ఆయన అన్నారు. 'మీరు ఇప్పుడు నిర్ణయించుకోవలసి ఉంటుంది లేదా మీరు అరెస్టు అవుతారు? ఆ వ్యక్తులు బాధితునిపై ఎంతో మానసిక ఒత్తిడి తీసుకువస్తారు. దీనితో అతను భయపడతాడు. ప్రతి వర్గం, వయో వర్గం నుంచి జనం డిజిటల్ అరెస్టు బాధితులు అవుతారు' అని ఆయన చెప్పారు. తాము కష్టించి ఆర్జించిన లక్షలాది రూపాయలను జనం వట్టి భయంతో నష్టపోయారని కూడా మోడీ తెలిపారు. 'అటువంటి కాల్ ఎప్పుడు వచ్చినా భయపడవద్దు. ఏ దర్యాప్తు సంస్థ కూడా ఈ విధంగా ఫోన్ కాల్ లేదా వీడియో కాల్ ద్వారా దర్యాప్తు చేయదని మీరు తెలుసుకోవాలి' అని ప్రధాని సూచించారు. బాధితులు జాతీయ సైబర్ విభాగం హెల్ప్‌లైన్ 1930కి డయల్ చేయాలని, అటువంటి సంఘటనలను సైబర్ క్రైమ్.గవ్.ఇన్‌కు తెలియజేయాలని కూడా మోడీ విజ్ఞప్తి చేశారు. చట్టంలో డిజిటల్ అరెస్ట్ వంటి విధానం ఏదీ లేదని, అది కేవలం వంచన, అబద్ధం అని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. సైబర్ కుంభకోణాలకు వ్యతిరేకంగా ఈ ప్రచారోద్యమంలో విద్యార్థులను భాగస్వాములను చేయవలసిందని పాఠశాలలు. కళాశాలలకు కూడా మోడీ విజ్ఞప్తి చేశారు.

## బెంగాల్‌లో శాంతి నెలకొనాలంటే

# సరిహద్దు చొరబాట్లు ఆగాలి

### కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



**కోల్‌కతా:** బంగ్లాదేశ్ నుంచి ఇండియాకు అక్రమ వలసలతో దేశంలో శాంతికి విఘాతం కలుగుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆందోళన వ్యక్తం చేశారు. సరిహద్దు చొరబాట్లను నిలిపివేస్తేనే పశ్చిమబెంగాల్‌లో శాంత నెలకొంటుందని అన్నారు. బెంగాల్‌లో ఇండియాబంగ్లాదేశ్ సరిహద్దుల వెంబడి పెట్రాపోల్ ల్యాండ్ పోర్ట్ వద్ద కొత్త ప్యాసింజర్ టెర్మినల్ భవనాన్ని ఆయన ఆదివారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2026లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలకు కళ్లెం వేస్తామని హామీ ఇచ్చారు. 'సరిహద్దులు అతిక్రమణను అడ్డుకునేందుకు చట్టపరమైన మార్గం లేనప్పుడు అక్రమ వలసలు చోటుచేసుకుంటాయి. అక్రమ వలసలు ఇండో–బంగ్లాదేశ్ శాంతికి విఘాతం. బెంగాల్ ప్రజలకు నేను ఒక విషయం చెప్పదలచుకున్నాను. 2026లో మార్పును కోరుకోండి. మేము ఈ చొరబాట్లకు అడ్డుకట్ట వేస్తాం. చొరబాట్లు ఆగిపోతేనే బెంగాల్‌లో శాంతి సాధ్యం'' అని అమిత్‌షా స్పష్టం చేశారు. పెట్రాపోల్ ల్యాండ్ పోర్ట్ వద్ద టెర్మినల్ భవన నిర్మాణానికి రూ.500 కోట్లు వెచ్చించారు. బెంగాల్‌లో శాంతిని నెలకొల్పేందుకు ల్యాండ పోర్టులు చాలా ముఖ్యమని అమిత్‌షా ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య కనెక్టివిటీ, సత్సంబంధాల మెరుగుగు ల్యాండ్ పోర్టులు అవసరమని అన్నారు. ఇందువల్ల ఉభయదేశాల మధ్య వాణిజ్య సంబంధాలు కూడా బలోపేతమవుతాయని చెప్పారు. బెంగాల్ అభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పంపుతున్న నిధులను టిఎంసి ప్రభుత్వం దోచుకుంటోందని ఆయన ఆరోపించారు. గత పదేళ్ల ఎన్‌డిఎ హయాంలో బెంగాల్‌కు రూ.56వేల కోట్లు ఇచ్చిందని, ఆ సొమ్ము ఎన్ఆర్ఇజిఎ లబ్ధిదారు లకు ఇచ్చారా? తృణమూల్ కాంగ్రెస్ వర్కర్ల చేతుల్లోకి వెళ్లిపోయాయా? అని తాను ఈరోజు ప్రశ్నిస్తున్నానని అన్నారు. దీనిపై దయచేసి ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. 2026లో రాజకీయ మార్పును రాష్ట్రంలో తీసుకురావాలని ప్రజలకు అమిత్‌షా పిలుపునిచ్చారు.

## 12 మంది భారత మత్స్యకారులు అరెస్టు

**కొలంబో :** తమ ప్రాదేశిక జలాల్లో అక్రమంగా చేపల వేట సాగిస్తున్నారని ఆరోపిస్తూ 12 మంది భారత మత్స్యకారులను శ్రీలంక నేవీ ఆదివారం అరెస్టు చేసింది. వారి సామాగ్రినికూడా స్వాధీనం చేసుకుంది. తాజాగా అరెస్టుతో అనేకమంది భారత జాలర్లు ద్వీపదేశంలోనే మగ్గుతున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 462 మంది జాలర్లను అరెస్టు చేశారు. ఉత్తర ప్రావిన్స్‌లోని జాఫ్నా, పాయింట్ పెడ్రో తీరం వద్ద మత్స్యకారులను అరెస్టు చేసి వారి సమాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు శ్రీలంక నేవీ ఒక పత్రికా ప్రకటనలో తెలిపింది. 12 మందిని అదుపులోకి తీసుకుని కంకెసంతురై హార్బర్‌కు తరలించామని, తదుపరి విచారణ కోసం మెయిలాడి ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగిస్తామని చెప్పింది. 2024లో ఇప్పటి వరకు శ్రీనలంక నేవీ 62 భారత జాలర్ల పడవలను పట్టుకోగా, 462 మందిని అదుపులోకి తీసుకుంది. చట్టపరమైన చర్యల కోసం వారిని అధికారులకు అప్పగించినట్లు నేవీ ఒక ప్రకటనలో వెల్లడించింది. కాగా, భారత్, శ్రీలంక మధ్య సంబంధాల్లో మత్స్య కారుల అంశం కొనసాగుతూనే ఉంది.

# అమర వీరులకు సిడిఎస్, ఆర్మీ చీఫ్ నివాళులు

## శ్రద్ధాంజలి ఘటించిన ప్రధాని మోడీ




**న్యూఢిల్లీ :** శౌర్య దివస్ (78వ) సందర్భంగా ఆదివారం ఢిల్లీలో నేషనల్ వార్ మెమోరియల్ వద్ద ఒక కార్యక్రమంలో రక్షణ దళాధిపతి (సిడిఎస్) జనరల్ అనిల్ చౌహాన్, సైనిక దళాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది విధి నిర్వహణలో అమరులైన పదాతిదళ సిబ్బందికి శ్రద్ధాంజలి ఘటించారు. అక్టోబర్ 27వ తేదీ పదాతిదళానికి విశిష్టమైనదని, 1947లో ఇదే రోజు పదాతిదళ సిబ్బంది భారత సైన్యం నుంచి శ్రీనగర్‌లో కాలు మోపిన మొదటి సైనికులని, నగర శివార్ల నుంచి దురాక్రమణదారులను ఖాళీ చేయించారని, ఆవిధంగా పాకిస్తాన్ దురాక్రమణ నుంచి జమ్ము కశ్మీర్‌ను కాపాడారని ఆర్మీ తెలియజేసింది. శౌర్య దివస్ కార్యక్రమంలో జనరల్ చౌహాన్, జనరల్ ద్వివేది పదాతిదళ సిబ్బందికి నివాళులు అర్పించేందుకు ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛాలు ఉంచారు. భారత సైన్యంలో అతిపెద్ద సమర విభాగం పదాతిదళం. ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఆదివారం ఈ సందర్భంగా 'ఎక్స్'లో అమరవీరులకు నివాళులు అర్పించారు. 'పదాతిదళ దినం సందర్భంగా అవిశ్రాంతంగా మనల్ని కాపాడుతుండే పదాతిదళంలోని అన్ని హోదాల సిబ్బంది, వెటరన్ల తిరుగులేని స్ఫూర్తికి, సాహసానికి మనం అంతా సలామ్ చేస్తున్నాం. వారు సదా ఏ ప్రతికూల పరిస్థితిలోనైనా దృఢచిత్తంతో ఉంటూ, మన దేశం భద్రతను, రక్షణను సాధ్యం చేస్తున్నారు. పదాతిదళం బలానికి, శక్తికి, కర్తవ్యానికి ప్రతీకగా నిలుస్తూ ప్రతి భారతీయునికి స్ఫూర్తి కలిగిస్తోంది' అని మోడీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పదాతిదళంలోని అన్ని విభాగాల కల్నల్‌లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# 70ఏళ్లు పైబడిన పౌరులకు మోదీ 'హెల్త్ కవరేజీ' కానుక

- 29న 'ఎబి-పిఎంజెఎవై'ను ప్రారంభించనున్న ప్రధానమంత్రి
- పేద, మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి, ధనిక వ్యత్యాసం ఆదాయంతో సంబంధం లేకుండా అందరికీ లబ్ధి
- రూ.5లక్షల వరకు ఉచిత చికిత్స పథకం-33 రాష్ట్రాలలో అమలు

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదాయ స్థాయితో సంబంధం లేకుండా 70సంవత్సరాల వయస్సుకు పైబడిన సీనియర్ సిటీజన్లు అందరికీ 'ఆయుష్మాన్ భారత్ ప్రధాన్‌మంత్రి జన్ ఆరోగ్య యోజన (ఎబిపిఎంజెఎవై)' కింద ఆరోగ్య బీమా పాలసీవల్ల లభించే భద్రతాపరిమితి(హెల్త్ కవరేజీ)ని మంగళవారం నుండి(అక్టోబరు29) నుంచి వర్తింపజేయనుంది. అధికారవర్గాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. ప్రస్తుతం పైలట్ ప్రాతిపదికన ఉన్నటువంటి ఎలక్ట్రానిక్ రిజిస్ట్రీ రొటీన్ ఇమ్యునైజేషన్లను నిర్వహించే యువిన్ పోర్టల్‌ను కూడా అదేరోజున ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు.వీటితో పాటే మరికొన్ని ప్రాజెక్ట్‌లను కూడా మోదీ మంగళవారంనాడే ప్రారంభించబోతున్నారని అధికారవర్గాలు తెలియజేశాయి.

కోవిడ్19 మేనేజ్‌మెంట్ సిస్టమ్ కోవిన్ ప్రతిరూపం సార్వత్రిక ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ కింద గర్భిణీలు, అదే సమయంలో వారి పిల్లలు 17సంవత్సరాల వయస్సు వచ్చే వరకు టీకా సంబంధిత శాశ్వత డిజిటల్ రికార్డును ఉంచే విధంగా అభివృద్ధి చేయబడింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించి, మరింత విస్తరించనున్న ఈ ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ 70సంవత్సరాలు, ఆపై బడిన వయస్సు వారికి వర్తించబడింది. 4.5కోట్ల కుటుంబాలకు చెందిన 6 కోట్ల మంది సిటీజెన్లకు ఈ స్కీమ్ కింద ప్రయోజనం లభించనున్నదని అధికారవర్గాలు తెలిపాయి. ఈ స్కీమ్ కింద లబ్ధిపొందాలనుకునే వారు పేద వారే కావచ్చు, మధ్యతరగతి వారే అయ్యిండొచ్చు, ఎగువ మధ్యతరగతి లేదా ధనికులే కావచ్చు, వారెవరు అయినప్పటికీ ఆదాయ స్థాయితో సంబంధం లేకుండా 70 సంవత్సరాలనుంచి ఆ పైబడిన వారరు అర్హులేనని చెప్పారు. 70ఏండ్లకు పైబడిన వయస్సు వారెవరైనాఆయుష్మాన్ కార్డును పొందేందుకు అర్హులని, వారికి ఎబిపిఎంజెఎవై ఎంపానెల్డ్ హాస్పిటల్స్‌లో రూ.5లక్షల వరకు ఉచిత ట్రీట్‌మెంట్‌ను ఈ స్కీమ్ ప్రారంభించిన నాటి నుంచి పొందే అవకాశం ఉన్నది. సెప్టెంబరు 1, 2024వరకు పిఎంజెఎవై ఎంప్యానెల్డ్ కింద ఉన్నటువంటవి12,696 ప్రైవేట్ ఆసుపత్రులు సహా మొత్తం 29,648 హాస్పిటల్స్ చేర్చబడ్డాయి. ఈ స్కీమ్ దేశంలోని 33రాష్ట్రాలు, ప్రస్తుతం ఢిల్లీ, ఒడిశా, పశ్చిమ బెంగాల్ మినహా కేంద్ర పాలిత ప్రాంతాలలో అమలుకానున్నది. ఇది అప్లికేషన్ ఆధారిత పథకమని అధికారులు చెప్పారు. పిఎంజెఎవై పోర్టల్ కింద ఆయుష్మాన్ యాప్‌లో రిజిస్టర్ చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని అధికారులు చెప్పారు. ఆధార్‌కార్డులో 70ఏళ్లు, ఆపైబడి వయస్సు నమోదు చేయబడినవారు ఈ స్కీమ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని అధికారులు తెలియజేశారు.

## ఒడిశాలో 14 జిల్లాలో

# 'దానా' ప్రభావం

**భువనేశ్వర్:** దానా తుపాను కారణంగా ఒడిశాలో మొత్తం 14 జిల్లాల్లో వరదలు సంభవించాయని... 35.95 లక్షల మంది ప్రజలు ప్రభావితమయ్యారని ఆ రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ మంత్రి సురేశ్ పూజారి ఆదివారం తెలిపారు. కాగా 8,10,896 మందిని 6,210 తుపాను సహాయ కేంద్రాలకు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. తీవ్రంగా దెబ్బతిన్న జిల్లాల్లో కేంద్రపారా, బాలాసోర్ మరియు భద్రక్ ఉన్నట్లు మంత్రి పేర్కొన్నారు. అయితే ఎటువంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. నిరాశ్రయులు 1,178 తుఫాను సహాయ కేంద్రాలలో ఆశ్రయం పొందారని... వారికి ఆహారంతోపాటు ఇతర అవసరమైన వస్తువులను అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా విపత్తులో ఇళ్లు కోల్పోయిన వారికి పాలిథిన్ షీట్లు అందజేస్తున్నట్లు పూజారీ చెప్పారు. 14 జిల్లాల్లో విస్తరించి ఉన్న 108 బ్లాకుల పరిధిలోని 1,671 గ్రామ పంచాయతీల్లోని ప్రజలను దానా తుపాను ప్రభావితం చేసిందన్నారు. ప్రాథమిక నివేదికల ప్రకారం తుపాను, తదుపరి వరదల కారణంగా దాదాపు 5,840 ఇళ్లు పూర్తిగా లేదా పాక్షికంగా దెబ్బతిన్నాయని తెలిపారు. 'విపత్తు సంభవించినప్పుడల్లా, ప్రజలు తమ ఇళ్లను కోల్పోతారు. పరిహారం పొందుతారు. ఈసారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి దశలవారీగా వారికి పక్కా గృహాలు మంజూరు చేస్తాం' అని మంత్రి వెల్లడించారు. రాష్ట్టంలోని తుపాను, వరద పీడిత ప్రాంతాల్లో ఉన్న కచ్చా ఇళ్ల సర్వే చేపట్టాలని ఒడిశా ప్రభుత్వం యోచిస్తోంది. తుపాను కారణంగా భారీ పంట నష్టం జరిగిందని పూజారి చెప్పారు. నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బందం ఒడిశాకు వస్తుందన్నారు. తెలిపారు.




# మనసులు తెలిసిన... మనుషుల గెలిచిన
# సాహితీ కర్మయోగి 'కొడవటిగంటి'




కొడవటిగంటి కుటుంబరావు... ఆప్తులకు సూక్ష్మంగా కొకు. తెలుగు సాహితీచరిత్రలో అత్యుత్తమ కథకుల్లో ఒకరిగా ఆయన పేరును పేర్కోవడానికి కారణాలు అనేకం. ఆయన ప్రత్యేకతలు కూడా ఎన్నో.. ఎన్నెన్నో. అన్నింటినీ ఒడిసిపట్టి, మూటగట్టి, అక్షరబద్ధం చేస్తే ఒక గ్రంథమే అవుతుంది. నిజానికి ఆయన గురించి ప్రత్యేకంగా చెప్పాల్సింది ఏమీ లేదు. కొకు రచనలే ఆయనను పరిచయం చేస్తాయి. పలకరిస్తాయి. మాట్లాడతాయి. సమాజంలో పేరుకుపోయిన కుళ్లును మన ముందు ఉంచుతాయి. ఆయన కథలు, రచనలు చదువుతున్నప్పుడు, వాటిలోని ప్రతి అక్షరాన్నీ తమకే వర్తిస్తాయని అనుకోని సామాన్యుడు ఉండడు. మధ్యతరగతి మనస్తత్వాన్ని అంతగా కాచివడబోసిన రచయిత మరొకరు లేరనడం అతిశయోక్తి కానేకాదు. గుంటూరు జిల్లా తెనాలిలో 1909 అక్టోబర్ 28న జన్మించిన కొకు హేతువాదాన్ని నమ్మారు. ఆచరించారు. ప్రచారం చేశారు. మార్క్సిస్టు దృక్పథంతోనే రచనలు కొనసాగించారు. 1980 ఆగస్టు 17న తుదిశ్వాస విడిచేవరకూ, సుమారు 50 సంవత్సరాల రచనా జీవితంలో తన వాదానికి కట్టుబడిన గొప్ప రచయిత కొకు. సమకాలీన మానవ జీవితాలను స్పృశించని రచనలు ఎందుకని ప్రశ్నిస్తారు కొకు. ఆయన కథలు మనసులను పరామృశిస్తారు. మనిషిలోని అంతర్ముఖంగా ఉన్న చెడును విమృశిస్తాయి. సామాజిక రుగ్మతలను ఎండగడతాయి. వెరసి మనిషి జీవితాన్ని సుసంపన్నం చేసేందుకు మార్గదర్శనం చేస్తాయి. నేటి తరానికి తెలియకపోవచ్చుగానీ, నిన్నటి తరం వారికి 'చందమామ', 'యువ' పత్రికలు సుపరిచితాలే. చందమామ కథలకు ఒక ప్రత్యేకతను, గుర్తింపును సంపాదించిపెట్టిన ఘనత కొకుకే దక్కుతుంది. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన కొకు బాల్యం మొత్తం గ్రామీణ వాతావరణంతో పెనవేసుకుపోయింది. మేనమామ వద్ద పెరిగిన ఆయనపై తన అన్న వెంకటసుబ్బయ్య ప్రభావం ఎంతో ఉంది. ఒక రకంగా కొకు రచయితగా మారడానికి వెంకటసుబ్బయ్యే కారణం. పాశ్చాత్య సాహిత్యంతో పరిచయం ఆయనను విస్తృత పాఠకుడిగా మార్చేసింది. 1929లో కాశీ హిందూ విశ్వవిద్యాలయంలో, ఫిజిక్స్ ప్రధాన పాఠ్యాంసంగా ఎంఎస్‌సిలో చేరిన ఆయన అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం కారణంగా చదువును కొనసాగించలేకపోయారు. ఆయన తొలి రచన 'ఒరియంటల్ వీక్లీ' అనే సినిమా పత్రికలో, 1930లో ప్రచురితమైంది. గృహలక్ష్మి పత్రిక ఆయన కథలకు పెద్దపీట వేసింది. 1931లో వరంగల్‌లో ఉపాధ్యాయ వృత్తిని కొనసాగించారు. పిల్లలకు ట్యూషన్లు చెప్పారు. ఆ సమయంలోనే పిల్లలమర్రి బాలకృష్ణ శాస్త్రి, పిల్లలమర్రి సాంబశివరావుతో కలిసి చక్రపాణి 'యువ' మాస పత్రికను ప్రారంభించారు. 1939లో భార్య పద్మావతి మరణం కొకును మానసికంగాకుంగతీసింది. ఆ తర్వాత సుమారు రెండేళ్ల పాటు ఆంధ్రపత్రికలో పని చేశారు. జరుక్‌శాస్త్రిగా సుప్రసిద్ధులైన జలసూత్రం రుక్మిణీనాథ్ శాస్త్ర అక్కడ కొకు సహోద్యోగి. 1942లో ఓ నాలుగు నెలలు ఓ మెటల్ కర్మాగారంలో పని చేశారు. అనంతరం రెండేళ్లు సిమ్లాలో జాతీయ యుద్ధ ప్రచారక సమితిలో కాపీరైటర్‌గా సేవలు అంఇదంచారు. ఒడిశా జయపూర్‌లోని ఇన్‌స్పెక్టరేట్ ఆఫ్ మెటల్ అండ్ స్టీల్ కంపెనీలో ఓ ఆరునెలలు ఫోర్మన్‌గా పని చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే, ఆయన చాలా కాలం నిలకడగా ఎక్కడా పని చేయలేదు. అయితే, పనిచేసిన ప్రతిచోటా భిన్న వ్యక్తిత్వాలను పరిశీలించే అవకాశం






ఏర్పడింది. రకరకాల మనుషులను, మనస్తత్వాలను చాలా దగ్గర నుంచి గమనించారు. అధ్యయనం చేశారు. చాలా కథల్లో ఆ వ్యక్తులనే పాత్రలుగా మార్చారు. మొదటి భార్య చనిపోయిన తర్వాత రెండో వివాహం చేసుకున్నప్పటికీ, ఆమె రెండు నెలలకే అనారోగ్యంతో చనిపోవడంతో, వరూధినిని మూడో పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత ఆయన పరుగుల వేగం తగ్గిందనే చెప్పాలి. మూడు నెలలు ఎయిర్ ఇండియా బొంబాయి (నేటి ముంబయి) కార్యాలయంలో అకౌంటెంట్‌గా పని చేసి, 1948లో ఆంధ్ర పత్రికలో చేరడం ఆయన వ్యక్తిగత, సాహితీ జీవితాలను మార్చేసింది. అదే దినపత్రికకు సంపాదకత్వం వహించే స్థాయికి చేరుకున్న ఆయన, సినిమా వారపత్రికకు కూడా సంపాదకుడిగా వ్యవహరించారు. 1952 జనవరి ఒకటో తేదీ కొకు జీవితంలో మరపురాని రోజు. అదే రోజు ఆయన చక్రపాణి నెలకొల్పిన డాల్టన్ పబ్లికేషన్స్ నుంచి విడుదలయ్యే చందమామలో చేరారు. ఆ తర్వాత ఆయన సుమారు మూడు దశాబ్దాలు అదే పత్రికకు ఎనలేని సేవలు అందించారు. ఎన్నో రచనలు చేశారు. మనసులు గెలిచారు. విశ్వానికి స్థలం, కాలం అనే రెండు పార్శ్వాలు ఉంటాయన్నది అందరికీ తెలిసిన సిద్ధాంతం. అయితే, బుద్ధి కొతల అనే మూడో కోణం కూడా ఉంటుందనేది కొకు ప్రతిపాదించిన సిద్ధాంతం. దీనిపై ఎంతో చర్చ జరిగింది. చర్చల్లో రచ్చకూడా జరిగింది. కొకు ప్రతిపాదించిన సాహిత్య శాస్త్రవిజ్ఞానం ఆయనకు అమరత్వాన్ని ప్రసాదించింది. ఆయన ఆధునిక ఆలోచనలను, పోకడలను ప్రగతివాదంగా చాలా మంది అంగీకరించారు. కానీ, కొద్ది మంది మూర్ఖత్వంగానూ, మరికొంత మంది వితండవాదంగానూ పేర్కొన్నారు. పదిహేనేళ్లకే ఆంగ్ల సాహిత్యంలో ప్రముఖుల రచనలు చదివి, విమర్శనాత్మక ఆలోచనను ఒంటబట్టించుకున్నారు. మానవ పురోగమనానికి సాహిత్యం ప్రేరణ కావాలని భావించారు. అందుకే, పద గంభీరతకు, సంక్లిష్టతకు తావులేని రీతిలో సరళమైన వాక్యాలతో, విమర్శనాత్మకంగా రాయడాన్ని తనదైన శైలిగా మార్చుకున్నారు. నాడు సమాజంలో ఉన్న విశ్వాసాలకు, అందరూ ఆమోదించిన సంప్రదాయాలకు పూర్తి భిన్నమైన ధోరణిలోసాగే కొకు ఆలోచనలు, రచనలు చాలా మందికి కొరుకుడుపడలేదు. ఆయన సాహితీ ప్రపంచంలో పెను తుపా ను సృష్టించడాన్ని ఛాందసవాదులు జీర్ణించుకోలేకపోయారు. కానీ, కొకు తన ఆలోచనలను మార్చుకోలేదు. వి మర్శల పరంపరను వదులుకోలేదు. అనాచారాలను నిగ్గదీసి ప్రశ్నించారు. అరాచకవాదులను నిర్మొహమాటంగా ఎదిరించారు. గోపీచంద్, జివి కృష్ణారావు, చక్రపాణి, ధనికొండ, బాలకృష్ణశాస్త్ర, చలం తదితరులంతా తెనాలి వాస్తవ్యులే కావడంతో, కొకుకు వారితో సాన్నిహిత్యం ఎక్కువ. నిరంతరం చర్చలు లేదా రచనలు... ఇదే ఆయన లోకమైంది. కమ్యూనిస్టు పార్టీతో సాన్నిహిత్యం, మార్క్సిజం పఠనం ఆయన రచనా విధానంలో వినూత్న మార్పులు తీసుకొచ్చాయి. హేతుబద్ధమైన ఆలోచన బలంగా రూపుదిద్దుకుంది. గతితార్కిక భౌతికవాద దృక్పథం ఏర్పడింది. ఆయన రచనల్లో ఆ ఛాయలు కనిపిస్తునే ఉంటాయి. సామాజిక స్పృహ పరిమళాలు వెదజల్లుతుంటాయి.

## కొకు వాక్కులు..

సాహిత్యం నుండి ప్రజల్నీ, రాజకీయాల నుండి సాహిత్యాన్నీ, ప్రజల నుండి రాజకీయాలనీ రక్షించే ప్రయత్నాలు చూస్తూంటే నాకు నవ్వొస్తుంది.

నియంతల మీదా, నిరుద్యోగమ్మీదా, లాకౌట్ల మీదా, యుద్ధాల మీదా గొంతెత్తేందుకు కళాకారులకు హక్కు లేదు.., అది రాజకీయులకే ఉందనడం మూర్ఖత్వం. అణగదొక్కాలనుకునేవారే ఇలాంటి తలతిక్కవాదం చేస్తారు.

ప్రకృతి రహస్యాలను వివరించలేనిది శాస్త్రం కాదు; జీవితంలోని కష్టాల్ని తీర్చలేనిది ఆవిష్కరణా కాదు; జీవితంలోని ప్రతీ కోణాన్ని చూపించలేనిది సాహిత్యమే కాదు

మారుతున్న కాలానికి అనుగుణంగా సాహిత్యమూ మారాలి. పాతకాలపు సాహిత్య పద్ధతులకే కట్టుబడి ఉండడమంటే మోసం చెయ్యడమే

కులం మిథ్య, మతం మిథ్య, ధనమొకటే నిజం.




## టాల్‌స్టాయ్ సంపాదన ఎంత?

రష్యా ప్రఖ్యాత రచయిత లియో టాల్‌స్టాయ్ బాగానే సంపాదించాడు. జూదం ఆడి పోగొట్టుకున్నదీ ఎక్కువే. అయితే, ఆయన నిజాయితీగా సంపాదించిన మొత్తం అక్షరాలా ఒక 'పెన్నీ'!. మాస్కోలోని తులా (మాస్కోవ్‌స్కీ) రైల్వే స్టేషన్‌లో ఓ ఘటన సందర్భంగా ఆయన స్వయంగా ఈ మాట చెప్పారు. విషయం ఏమిటంటే, ఒకసాఖ తులా ప్లాట్‌ఫామ్‌పై టాల్‌స్టాయ్ నిల్చొని ఉన్నప్పుడు, కొరియర్ రైలు అక్కడ కొద్దిసేపు ఆగింది. ఫస్ట్‌క్లాస్ క్యారేజ్ నుంచి దిగిన ఒక వ్యక్తి వేగంగా 'బఫెట్'వైపు దూసుకెళ్లాడు. కొద్ది క్షణాల తర్వాత అదే క్యారేజ్ నుంచి బయటకు వచ్చిన మహిళా 'జార్జ్', 'జార్జ్' అంటూ బిగ్గరగా కేకలు వేసింది. కానీ, బఫెట్‌పైనే దృష్టిపెట్టిన అతను ఆమె పిలుపు వినిపించుకోలేదు. అక్కడే నిల్చున్న టాల్‌స్టాయ్‌ను చూసి జార్జిని పిల్చుకొని రావాల్సిందిగా కోరింది. ఒక వృద్ధుడి సేవలకు తనకు ఉచితంగా వద్దని, అందుకు ప్రతిఫలంగా ఒక పెన్నీ ఇస్తానని హామీ కూడా ఇచ్చింది. టాల్‌స్టాయ్ అమె చెప్పినట్టుగానే జార్జి వద్దకు వెళ్లి, అతనిని తీసుకొచ్చాడు. ఆ మహిళ కూడా ఇచ్చిన హామీ మేరకు ఓ పెన్నీ నాణాన్ని టాల్‌స్టాయ్ చేతిలో పెట్టింది. అదే సమయంలో కొంత మంది ప్రయాణికులు అతనిని గుర్తుపట్టి, అతని రచనల గురించి గుసగులాడుకోవడం ఆమె విన్నది. తాను పెన్నీ ఇచ్చిన వ్యక్తి ప్రముఖ రచయిత టాల్‌స్టాయ్ అని తెలిసి, వెంటనే క్షమాపణలు చెప్పింది. చేసిన పనికి సిగ్గుపడుతున్నానని అంటూ పెన్నీని తిరిగి తీసుకోవడానికి ప్రయత్నించింది. కానీ, టాల్‌స్టాయ్ పెన్నీ వెనక్కు ఇవలేదు. 'నేను ఈ పైసాను వదులుకోలేను. ఎందుకంటే నేను జీవితంలో నిజాయితీగా సంపాదించిన ఏకైక పైసా ఇదే కావచ్చు' అని వ్యాఖ్యానించాడు. రైలు బయలుదేరుతున్నట్టు సూచించే మూడో బెల్ మోగతంతో, ఆ మహిళ మరోసారి క్షమాపణలు చెప్తూ క్యారేజ్‌లోకి వెళ్లిపోయింది. 'టాల్‌స్టాయ్స్ సోల్' పేరుతో రాసిన తన పుస్తకంలో ఇవాన్ నాజివిన్ ఈ వృత్తాంతాన్ని వివరించాడు. టాల్‌స్టాయ్ హాస్య చతురతకు ఇది ఓ ఉదాహరణగా పేర్కొన్నాడు. నిజాయితీగా సంపాదించిన ఏకైక పెన్నీ అదేనని అనడం అతని హాస్యసంపదకేకాదు... భేషజాలు లేని వ్యక్తిత్వానికి కూడా అద్దం పడుతుంది.

# తనివితీరని పాటల పయోనిధి అభ్యుదయ సాహిత్య సారథి 'దాశరథి'

నా తెలంగాణ కోటి రతనాల వీణ, ఈ నిజాం రాజు జన్మజన్మాల బూజు అంటూ తెలంగాణ అస్థిత్వాన్ని, నిజాం రాచరిక నియంతృత్వంపై తిరుగుబాటు చేసిన కవి, రచయిత దాశరథి కృష్ణమాచార్యులు. 1925 జూలై 22న మహబూబాబాద్ జిల్లా, చిన్నగూడూరులో దాశరథి వేంకటాచార్య, వెంకటమ్మ దంపతులకు జన్మించిన దైవ కానుక దాశరథి. ఉపాధ్యాయుడిగా, పంచాయతీ ఇన్‌స్పెక్టర్, ఆకాశవాణి ప్రయోక్తగా ఉద్యోగాలు చేస్తూనే అనేక సాహిత్య ప్రక్రియల్లో విశేష కృషి చేశాడు. కథలు, నాటికలు, అమూల్యమైన గ్రంథాలు, సినిమా పాటలు, కవితలు తెలుగుజాతికి కానుకలుగా అందించిన యుగకర్త దాశరథి. అగ్నిధార, రుద్రవీణ, మహాంద్రోదయం, తిమిరంతో సమరం లాంటి అనేక కావ్యాలలో జనజీవన స్రవంతిలోని సంఘర్షణలను తెలంగాణ ప్రజల సమస్యలు, కష్టాలు, కన్నీళ్ళు, వారు ఎదుర్కొంటున్న దోపిడి, దౌర్జన్యాలు, అన్యాయాలు, అక్రమాలు, అసంతృప్తి అద్భుతంగా వర్ణించాడు దాశరథి. దాశరథి కృష్ణమాచార్యులు స్పృశించిన సాహిత్య ప్రక్రియలన్నీ అద్భుతాలే, ఆణిముత్యాలే. దాశరథి కృష్ణమాచార్యులు సినిమా పాటలలో సైతం చక్కటి సాహిత్యం, అమలిన ప్రేమతత్వం, సహజ సౌందర్యం, భక్తి పారవశ్యంతో దైవారాధన, ఆధ్యాత్మిక చింతన, సమాజ సమస్యలు, విశ్వదర్శనం, మానవతా దృక్పథం, వ్యక్తిత్వ వికాసం కన్పిస్తాయి. ఒక మంచి పాట వ్రాయడం ఒక తపస్సులాంటిది, అర్థవంతమైన పదాలు, ఆది అంత్య ప్రాసలు, పాడుకోవడానికి అనుగుణమైన పంక్తుల నిడివి పండితుల నుండి సామాన్య ప్రజలకు పారవశ్యం కల్గించే భావ వ్యక్తీకరణం ముత్యాల దండవలె అక్షర నిర్మాణం అవసరమవుతుంది. దాశరథి పాటలో ఇవన్నీ మనం గమనిస్తాం, ఆస్వాదిస్తాం, అన్ని పాటలు అమూల్యమైన వజ్రాలే. మచ్చుకు కొన్ని పాటలు ఈ వ్యాసంలో అవలోకిద్దాం. ప్రకృతి అందాలు వర్ణిస్తూ.. 1964లో మంచి మనసులు చిత్రంలో గోదారిగట్టు, గట్టుమీద చెట్టు, చెట్టు కొమ్మన పిట్టను దర్శింప చేస్తాడు దాశరథి. విషాదం, విరహం, ఎదరుచూపులు, ప్రేమికులకు సమాజంలో ఎదురవుతుంటాయి. అలాంటి సన్నివేశం వర్ణిస్తూ 1967లో పూలరంగడు సినిమాలో నీవు రావు నిదుర రాదు, నిలిచిపోయే ఈ రేయి అంటూ ప్రశాంతంగా నిశ్శబ్ద నిశీదిలో ప్రియురాలు ప్రియునికై నిదురపోకుండా ఎదురు చూసే వాతావరణం అద్భుతంగా వ్రా శాడు దాశరథి. వేంకటేశ్వరస్వామికి సిఫార్సు చేయమని నడిరేయి ఏ జాములో స్వామి నినుచేర దిగివచ్చునో అం టూ పతిదేవుడు ఒడిలోన మురిసేటి వేళ, స్వామి చిరున వ్వు వెన్నెలలు కురిసేటి వేళ ప్రభువు కు నా మనవి వినిపించు మమ్మ.. అంటూ అలివేలుమంగమ్మకు ఒక భక్తుని విన్నపం నిత్యజీవితంలో మనం మన కు ఏదైన వస్తువు కావాలని నాన్నకు నేరుగా చెప్పకుండ అమ్మతో చెప్పించే సన్నివేశం గుర్తొచ్చే విధంగా ఈ పాట హృదయానికి హత్తుకుంటుంది. ఎన్ని తరాలు గడిచినా రేడియోలోనో, టెలివిజన్‌లోనో, మొబైల్ ఫోన్‌లోనో విన్నప్పుడు మనసుకు హాయినిస్తు, ప్రశాంతంగా సాగే పాటలుకొన్ని ఉంటాయి. అలాంటి పాటలే 1968లోని బంగారు గాజులు చిత్రంలోని విన్నవించుకోనా చిన్నకోరిక, ఇన్నాళ్ళు నా మదిలో ఉన్న



కోరిక. అదే విధంగా 1969లో మదిలో వీణలు మ్రోగే ఆశలెన్నో చెలరేగే, కలలైన కనని ఆనందం ఇలలోన విరిసే ఈ రేయి. ఒక భక్తుడు భగవంతుణ్ణి పిలిచే పాట 1968లో రాము చిత్రంలో రారా కృష్ణ య్య రారా కృష్ణయ్య దీనులను కాపాడ రారా కృష్ణయ్య అంటూ వ్రాసిన దాశరథి. 1969లో బుద్ధిమంతుడు సినిమాలో భగవంతుడు భక్తుడి కోరికను మన్నించి తన దగ్గరకు వచ్చి దర్శనమిచ్చి నిలబడితే నను పాలింపగ నడచీ వచ్చితివా మొర లాలింపగ తరలీ వచ్చితివా అంటూ భక్తుడి తన్మయత్వం, పారవశ్యం వర్ణిస్తాడు దాశరథి.అదే విధంగా 1970లో చిట్టిచెల్లెలు సినిమాలో మంగళగౌరి మముగన్న తల్లి, 1971లో అమాయకురాలు సినిమాలో పాడెద నీ నామమే గోపాల అని భక్తురాలి హృదయాంతరాలలో నుంచి పొంగో భక్తితో మంగళగౌరిని, గోపాలకృష్ణుణ్ణి వేడుకునే సన్నివేశాలలో వ్రాసిన పాటలు దాశరథి మనకిచ్చిన కానుకలు. ఇలా ఎన్నోపాటలు వ్రాసి సాహిత్యరంగంలో చిరంజీవిగా నిలిచిన మహనీయుడు దాశరథి నవంబర్ 5, 1987 నాడు స్వర్గ లోకంలో ఆస్థానకవి పదవి నలంకరించుమని పిలుపునందుకుని ఆ నల్ల ని ఆకాశంలో కానరాని భాస్కరుల మీద పరిశోధన చేయడానికి పయనమైనాడు. సముద్రంలోని ఆణిముత్యాలు, భువిలోని మల్లియలు, దివిలోని తారకలు దాశరథి పాటలు.

డా॥ఎస్. సూర్యప్రకాష్
9849488498

# కులవృత్తుల ఔన్నత్యం పాఠాల్లో ఎక్కడ?

భారతదేశంలో బహుళ జాతులు ఉండడం వల్ల, ఏ ఒక్క జాతిని విశేషంగా పేర్కొనక మన రాజ్యాంగంలో 'భారతీయులమైన మేము' దీని పేర్కొనబడింది, రాజ్యాంగ రచనకాలంలో కౌటిల్య, మను ధర్మశాస్త్రాలు చర్చకు వచ్చాయని, వాటిని ఆదర్శంగా గ్రహించక పలు రాజ్యాంగాలలో తెలుపబడిన ప్రజల హక్కులు అన్ని రావాలని అందేట్లుగా అంబేద్కర్ రాశారని ముఖ్య ప్రసంగకర్తగా హాజరై ప్రసంగించారు ఆచార్య కంచ ఐలయ్య. అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం వారు 'భారతదేశ ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సాహిత్యం' అనే అంశంపై పంజాబ్ ఆర్ట్స్ కౌన్సిల్ కొలాబిరేషన్‌తో చండీఘర్‌లోని 16వ సెక్టార్‌లో ఉన్న పంజాబ్ ఆర్ట్స్ కౌన్సిల్, కళాభవన్ హోటల్‌లో జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సభకు ప్రధాన ప్రసంగకర్తగా హాజరైన ఆచార్య కంచ ఐలయ్య తన ప్రసంగంలో తరతరాలుగా భారతదేశ భూభాగంలో దళారుల అణచివేత్త, స్త్రీల పట్ల వివక్ష, ఆంగ్లేయులు పాలకులుగా రావడంతో అం దరికి విద్య, మూఢనమ్మకాల నిర్మూలనతో పాటు నాటినుంచి నేటి వరకు మనకు మనం సాదించుకుంటూ 75 సం॥లు అవుతున్న ప్రస్తుత బిజెపి పాలకుకు వందలాది సం॥ల వెనక్కి తీసుకెళ్తున్నా రు 'సనాతన ధర్మం' పేరుతో అని చెప్పారు, 1985లో ఆంధ్రప్రదేశ్‌లో దళితులపై జరిగిన దాడిని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ దేశం అందరికి ఉచితంగా వైద్యం, విద్య ఇవ్వాలన్నది ఇప్పటికీ అంబేద్కర్ చెప్పినది పాలకులు పట్టించుకోవడం లేదనారు. ఇంతవరకు పాఠాల్లో కుమ్మరి, కమ్మరి, మంగలి మొదలైన వృత్తుల ఔనత్యాన్ని తెలుపుతూ పాఠశాల స్థాయిలో రాలేదన్నారు. ప్రస్తుత బిజెపి ప్రభుత్వం 'గోవు'ను మాత్రమే పూజించడం సరైంది కాదని సర్వజీవుల పట్ల సమాన దృష్టి ఉండాలని చెబుతూ, జాతి, మతం, కులం వివక్షలకు గులజాహిక అందరినీ సమంగా చూడాలని తన సుదీర్ఘ ప్రసంగంలో వివరించారు. ఈ సభకు పి.సర్వేద హమీద్ అధ్యక్షత వహిస్తూ తన వ్యాసంగంలో మాట్లాడుతూ... భారతదేశంలో ప్రస్తుతం ముస్లింల పట్ల పాలకు ప్రవర్తన ఆపేక్షనీయమన్నారు. స్త్రీ వివక్ష కోనసాగడం బాధకరమన్నారు. అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులు పెనుగొండ లక్ష్మి నా రాయణ తన స్వాగతోపన్యాసంలో ప్రస్తుత దేశ రాజకీయాలనువిపులీకరించారు. ముస్లింల పట్ల మొత్తం వ్యవస్థను ఎలా తప్పు దారిలో తీసుకువెలుతున్నారో వివరించారు. లద్దాక్ సంఘటనను ఉదారించారు. ఈ పాలనను విమర్శించినందుకు డాక్టర్ నరేంద్ర భోల్కర్, గోవింద్ పన్సారీ ఆచార్య ఎంఎం. కుల్బుర్గి, రోహిత్ వేముల, గౌరీ లంకేష్, ఆచార్య జిఎన్. సాయిబాబాలను ఎలా పొట్టన బెట్టుకున్నదో వివరించారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలను లక్ష్మి నారాయణ తెలియజేశారు. అతిథిగా విచ్చేసిన ఊర్మిలేష్ ప్రసంగిస్తూ ప్రస్తుత వ్యవస్థ పట్ట అప్రమత్తమైమన సర్వశక్తు లొడ్డి పోరాడి మతతత్వ శక్తులను మట్టుబెట్టలన్నారు. ముఖ్య అతిథిగా విశ్రాన స్వర్గజీత్ సనీ తన ప్రసంగంలో బిజెపి పాలన ఎంత ప్రమాదకరంగా ఉందో తెలిపారు. ప్రధాన కార్యదర్శి సుక్‌దేవ్ సురాని ప్రసంగించరు. సుర్జీత్ జజ్జ వందన సమర్పనలో ప్రారంభ సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో ఇంకా తెలుగురాష్ట్రాల్లోంచి ఆంధ్రప్రదేశ్ అరసం ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, తెలంగాణ అరసం అధ్యక్ష, కార్యదర్శులు డా॥ పల్లేరు వీరాస్వామి, డాక్టర్ రాపోలు సుదర్శన్‌లు పాల్గొన్నారు.



తెలంగాణ అరసం ఫోన్ : 9441779688

## గె(పి)లుపు

పగలే గురక పెట్టి నిద్రిస్తూ..
కలలు విపరీతంగా కంటూ..
కూర్చొని ఎంచక్కా తింటూ..
మాటల కోటలు కడుతూ..

ఒంటికి విశ్రాంతి ఇస్తూ..
సోమరి బిరుదు పొందుతూ..
చెమట కక్కడం మరిచిపోతే..
గెలుపుకు దూరంగా నిలిచి..

పేదరికాన్ని పెంచి పోషిస్తూ
పాతాళ లోతులకు దిగజారుతూ..
జీవచ్ఛవమై బతుకీడుస్తూ..
ఊరికి దూరం చావుకు దగ్గరై..

మనిషి అన్నదే మరుస్తున్నాం
అతీగతీ లేని బతుకు ఈడుస్తున్నాం !
శిశువు నడిచి పడిపోయినా..
అడుగులు వేయడం మానలేదు

ఆడితే ఓడవచ్చని తెలిసినా..
ఆడడం మరిచి పోలేదు
ఆడి ఓడినోడు అనుభవజ్ఞుడు
ఆడకనే ఓటమి అంగీరించినోడు..
అసమర్థుల రాజ్యానికే మహారాజు !
గెలుస్తామనే రిస్క్‌తో ఆడుతూ..
సుదూర గమ్యాన్ని దర్శిస్తూ..
అపనమ్మకాన్ని పాతరేసి..

పిరికితనాన్ని చీల్చి చెండాడి..
ఓటమి భయాన్ని ఆమడకు తరిమి..
స్వీయ సామర్థ్య పెట్టుబడి పెట్టి..
గెలుపు పిలుపును వింటూనే..

అపూర్వ విజయ తీరాలు చేరుదాం !
ఓటమిని గుణపాఠంగా చేసుకొని..
అనుభవ నిధిగా మదిన దాచుకొని..
పాత దారిన గొర్రెల్లా పోకుండా..

ఆలోచనకు సృజన జోడించి..
వినూత్న దారులకు పట్టం కట్టి..
అసాధ్యాల్ని సుసాధ్యం చేస్తూ..
స్వప్నాల్ని సాకారం చేసుకుంటూ..
గెలుపు పిలుపును ఆలకిస్తూ..
విజయ ఘంటికలు మోగిద్దాం !

మధుపాళీ
9949600037

## ఈ వారం కవితలు

### కాకి

కాకి నీవు కావు కావు
కోకిల వలే కొంటె దానవు కావు
కాకి నీ రూపం చూస్తే నలుపు
కోకిల పాట కన్నా నీ మనసు తెలుపు!
కాదు కాదు అది కాకి గోల
అది కాకి సంఘజీవిత సమావేశ హేల
కష్ట సుఖాలు ఆపద సంపదల వేళ
కలిసి పంచుకొని తిను సంభాషణ మేళ!
పరిసరాల పరిశీలివి కాలజ్ఞానివి
సంస్కార సంసార గోప్య సంసారివి
నోటిలోని రొట్టెనైన జాలిగా జారవిడుస్తావు
కుండ అడుగు నీళ్లను తెలివిగా తాగుతావు!

బ్రహ్మ ముహూర్తాన ముని వలె నిద్ర లేవడం
సూర్యాస్తమయానికి గూటికి చేరడం
గూట్లో దీపం నోట్లో భోజనం
మనిషికి నీవు చేయు మార్గదర్శనం!
బంధువుల రాక విపత్తుల జాడ పసికట్టు
పుల్ల పుల్ల ఏరి గూడుకట్టు
కోకిల గుడ్లను మాతృ ప్రేమతో పొదిగి పెట్టు
నియమ బద్ధ జీవితానికి జై కొట్టు!
కాకి పిల్ల కాకి కి ముద్దు అంటారు
కాకితో కబురంపుతే వస్తామంటారు
ఆచార వ్యవహార కర్మలలో ఆహ్వానిస్తారు
పిలిచి పితరుడని ముద్ద పెడతారు!
కాకి కి జంట కండ్లున్నా ఏకాక్షి అంటారు
కాకి జగడాల మారి కాదంటారు
కాకి శనేశ్వరుని వాహనం అంటారు
కాకి వలె కలకాలం జీవించమంటారు!

పి.బక్కారెడ్డి
9705315250

### బతుకు గడియారం

ఆ జాగల కాసేపు నడుము వాల్చు
పిట్టల చప్పుడు ఖాళీలను పూరిస్తది
చేతిలో గడ్డి పరకలు ముచ్చట్లు చెప్తాయ్
పైన కొమ్మలు ఏడికో తీసుకుపోతాయ్
చెట్లవేర్లు మెదడునరాలు కలిసిపోయి
మనలోంచి అవి వచ్చినట్లు...
'ఊమ్' అని పలకాలని ప్రయాస
గొడ్డలితో మెడవరకు నరుక్కుపోతరు

వృథలకు బలహీనతలను అంటగడతరు
అవసరాల పువ్వులొస్తాయ్ వికారంగా
అనవసరపు మాటల తీగలు విహీనంగా
గొడుగులకు చిల్లులు లేకుండా
గొంతులకు సిగ్గులు లేకుండా
మోస్తూ ఉన్నాం బతుకు గడియారాన్ని
అవహేళన సంబంధాల్లో
అసంబద్ధ సంతృప్తుల్లో

ఏం వెతుక్కుంటున్నామో
సిసలైనది మర్చిపోయి
లోతును తేలిక చేసి
లోలోతులకు కూరుకుపోయి
వికృతంగా వ్యవహరిస్తూ
లోకం తీరు బెల్లం పాకం
అర్థం పర్థం అసహ్య తీర్థం
అమ్మా అయ్యా పిల్లా జల్లా
సదువూ సంతా పైసామే పరమాత్మా..!
గురకలు కొడుతూ పండినం
భయం దిండు మీద
మన ఎదల మీదనుంచి వెళ్ళి
ఏపుకొచ్చిన చెట్లెక్కిరి వాళ్ళు
కల మేల్కొంటే అరుస్తాం
కొట్లాడ్తాం గుంజుకుంటాం
లేదంటే వాళ్ళలో కలుస్తాం..!!

రఘు వగ్గు

### దీపావళి శోభావళి



వచ్చింది దీపావళి
తొలగింది సంధ్యావళి
తెచ్చింది శోభావళి
మురిసింది జనావళి

ముక్కోపి ఆ లేమ
పురాణలకే గరిమ
చూపె! మహిళ మహిమ
ఆమెనే సత్యభామ

నరకాసురుని వధ
శ్వాస పీల్చెను వసుధ
తీరె సుజనుల భాద
తొలగి పోయెను వ్యధ
కొత్త అల్లుళ్ళ రాకడ
అత్తారిల్లోక పోకడ
టపాసుల తో గడబిడ
సరదాలతో వాడవాడ

దేశ మంతా పండుగ
గృహ సీమలు నిండుగ
తినుబండారాలు దండిగ
దీపాల వరుసలు మెండుగ

లక్ష్మీ పూజల కళకళ
పూజారులతో గలగల
వ్యాపారుల తళతళ
మెరిసే ధరణి మిలమిల

దీపావళి సంబరం
చేరెనుగా అంబరం
ఇలాగే కలకాలం
కలిసి ఉందాం అందరం

నమిలకొండ నాగేశ్వర్ రావు
8688553470

# ప్రతిఒక్కరి సంక్షేమమే ప్రజాప్రభుత్వం లక్ష్యం

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

గీత కార్మికులకు కాటమయ్య కిట్ల పంపిణీ

చెరువులకు చేపపిల్లల అందజేత

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన





**ప్రజాపక్షం/బోనకల్ :** ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ప్రజాప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతిఒక్కరి క్షేమం, సంక్షేమం గురించి ఆలోచిస్తుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం మండలంలోని తూటికుంట్ల నుంచి గోవిందాపురం(ఎల్), బ్రాహ్మణపల్లి నుంచి రాపల్లి, కలకోట నుంచి నారాయణపురం, ఆళ్లపాడు నుంచి నారాయణపురం, చిరునోముల నుంచి దబ్బాకుపల్లి గ్రామాలకు బిటి రోడ్ల నిర్మాణ పనులకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు శంకుస్థాపన చేశారు. కలకోట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బిసి సంక్షేమ శాఖఎక్సైజ్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం కిట్లను డిప్యూటీ సిఎం పంపిణీ చేశారు. అనంతరం కలకోట పెద్ద చెరువులో చేపల పంపకం కోసం ప్రభుత్వం 100 శాతం రాయితీపై ఇచ్చిన చేప పిల్లలను మత్స్య సహకార సంఘం సొసైటీ సభ్యులు బలుగూరి అచ్చయ్యకు మల్లు భట్టి విక్రమార్క అందజేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిప్యూటీ సిఎం భట్టి మాట్లాడారు. కల్లుగీత కార్మికుల భద్రత, ఆరోగ్యం, క్షేమం అన్నింటిని పరిగణలోకి తీసుకొని కాటమయ్య రక్షణ కవచాలను అందజేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం వృత్తిదారుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. వారికి కావాలిసిన సౌకర్యాలను కూడా అందించడంలో విఫలమైందన్నారు. భవిష్యత్‌లో కల్లు గీత కార్మికుల భద్రత కోసం రక్షణ కవచం కిట్లు మెరుగైనవి వస్తే వాటిని కూడా పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. చేప పిల్లల పంపిణీలో అవకతవకలు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ గణేష్, బిసి అభివృద్ధి అధికారి జి.జ్యోతి, తహసీల్దార్ అనిశెట్టి పున్న చందర్, టిపిసిసి మెంబర్ పైడిపల్లి కిషోర్‌కుమార్, మాజీ జడ్‌పిటిసి మోదుగు సుధీర్‌బాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గాలి దుర్గారావు, డిసిసి కార్యదర్శి బంధం నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఐ నాయకులు తూము రోషన్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు గూడ నరసింహ శాస్త్రి, పిల్లలమర్రి నాగేశ్వరావు, యంగల అమరయ్య, గౌడ సంఘం నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కార్మికుల వేతనాలు ఇప్పించండి

ఎఐటియుసి నేత, కార్పొరేటర్ క్లైమెంట్‌కు వినతి



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో వాటర్ వర్కర్స్‌లో పని చేస్తున్న కార్మికులకు తొమ్మిది నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని కార్పొరేషన్ ద్వారా చెల్లించేందుకు కృషి చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ, తోట రామాంజనేయులు కోరారు. ఆదివారం ఎఐటియుసి జాతీయ సమితి సభ్యుడు, నగర కార్పొరేటర్ బిజి క్లైమెంట్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానిక ఎఐటియుసి కార్యాలయంలో ఆదివారం కార్మికులు క్లైమెంట్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 2015 నుండి కాంట్రాక్ట్ పద్దతిలో పబ్లిక్ హెల్త్ విభాగంలో ఖమ్మం కార్పొరేషన్‌లో పని చేస్తున్నామని 2022 వరకు ప్రతి నెల వేతనాలు ఇచ్చేవారని పబ్లిక్ హెల్త్ విభాగాన్ని కార్పొరేషన్‌లో విలీనం చేయడంతో తమకు ఇబ్బందులు మొదలయ్యాయని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా బిజి క్లైమెంట్ మాట్లాడుతూ గతంలో పలుమార్లు వేతనాల విషయం ప్రస్తావించానని మరోసారి కమిషనర్‌ను కలిసి విన్నవిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్మిక కార్మికులు మహేష్, నవీన్, ఉపేందర్, వీరభద్రాచారి, అజయ్, హరీష్, మూర్తి, రవి పాల్గొన్నారు.

## సీతమ్మకు సిపిఐ ఘన నివాళి



**ప్రజాపక్షం/బోనకల్ :** మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన బొడ్డుపల్లి నాగయ్య సతీమణి సిపిఐ సభ్యురాలు బొడ్డుపల్లి సీతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె దశదిన కర్మను స్వగృహంలో ఆదివారం నిర్వహించారు. సీతమ్మ చిత్రపటానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఐ మండల సహయ కార్యదర్శి ఆకెన పవన్, శాఖ కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు లతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ బొడ్డుపల్లి నాగయ్య, సీతమ్మలు గ్రామంలో సిపిఐ అభివృద్ధికి ఏనలేని కృషి చేశారన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న నాటి నుండి నేటి వరకు కమ్యూనిస్టు పార్టీలోనే కొనసాగారన్నారు. యువత కమ్యూనిస్టుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. నివాళులర్పించిన వారిలో ఆయన సిపిఐ నాయకులు బోయినపల్లి బసవయ్య, బోళ్ల ప్రసాదరావు, గుంపుల జయరాజు, నాగయ్య కుమారులు బొడ్డుపల్లి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి రామారావు, బొడ్డుపల్లి ప్రకాశరావు తదితరులున్నారు.

## సిపిఐ దిమ్మె కూల్చిన వారిపై చర్యలు

వైరా మండల సిపిఐ కార్యదర్శి గోపాలరావు డిమాండ్



**ప్రజాపక్షం/వైరా :** రెబ్బవరం గ్రామంలో గన్నవరం క్రాస్ రోడ్డు బస్సు సెంటర్ వద్ద 30 సంవత్సరాలుగా ఉన్న బస్‌షెల్టర్‌ను కూల్చివేయడం దుర్మార్గమైన చర్య అని వైరా మండల సిపిఐ కార్యదర్శి యామాల గోపాలరావు అన్నారు. దిమ్మె కూల్చడం సరైంది కాదని, దిమ్మె కూల్చివేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. బస్టాండ్‌ను ప్రయాణీకుల సౌకర్యార్థం నిర్మించారని ఆనాటి దాతలు ఎంతో కృషి చేసి నిర్మించారని, వర్షాలు వచ్చినా ఎండలు వచ్చినా దాని కింద నిలబడి ఎందరరో సేద తీర్చుకునేవారని ఈ బస్టాండ్ సెంటర్ నుండి నెమలికి వెళ్లు ప్రయాణీకులు కొన్ని వందల మంది వెళుతుంటారని అలాంటి దానిని కూల్చడం సరైన పద్దతి కాదని దీనిపై ప్రభుత్వ అధికారులు వెంటనే దానిని సందర్శించి ప్రభుత్వ ఆస్తులు ధ్వసం చేసిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని గోపాలరావు డిమాండ్ చేశారు.

## 'ప్రజల మనిషి' రామ్‌రెడ్డి గోపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/కామేపల్లి:** నిత్యం ప్రజా సమస్యల ఏజెండానే ధ్యేయంగా పని చేస్తూ ముందుకు సాగుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి నిరంతరం పాటు పడుతున్న నేత రామ్‌రెడ్డి గోపాల్‌రెడ్డి అని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి గోపాల్‌రెడ్డిని రాష్ట్ర అగ్రికల్చర్, రైతు కమిషనర్ సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆదివారం ఆయన స్వగ్రామైన మండలంలోని పాత లింగాల గ్రామానికి వస్తుండగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు రామ్‌రెడ్డి చరణ్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, నాయకులు భానోత్ సుజాత మంగీలాల్, రామ్‌రెడ్డి జగన్నాథరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, గబ్రు నాయక్, సునీల లక్ష్మీ నారాయణ, గుజ్జర్లపూడి రాంబాబు, దమ్మాలపాటి సత్యనారాయణ, ఆర్ గోపిరెడ్డి, నరసింహ నాయక్, దేవండ్ల రామకృష్ణ, సరిరాంనాయక్, జర్పుల లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయాలి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఎన్నికల మేనిఫెస్టోలో చేప్పిన విధంగా ప్రభుత్వం హామీలను అమలు చేయాలని టిపిఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు జివి.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం రూరల్, సింగరేణి, కామేపల్లి మండలాల మహాసభలను స్థానిక యుటిఎఫ్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు పెండింగులో ఉన్న ఐదు డిఎలను వెంటనే విడుదల చేయాడంతో పాటు ఒక డిఎ ప్రకటన నిర్ణయాన్ని పునసమీక్షించాలన్నారు. ఇలా మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ప్రతిహామీని అమలు చేయాలన్నారు. తొలుత అక్కడ ఏర్పాటు చేసిన జెండాను శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అలాగే ఇటీవల మరణించిన ఉపాధ్యాయులకు రెండునిమిషాలు సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు షమి, రాంబాబు, రాందాస్, నాగేశ్వరరావు, సతీష్, నవీన్, మహేష్, నర్సింహారావు, వెంకటేశ్వరరావు, కృష్ణారావు, మంగీలాల్, శ్రీనివాసరావు, లక్ష్మి కుమారి, ప్రసాద్, సూర్య, శేషయ్య, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని భట్టికి సిపిఐ వినతి



**ప్రజాపక్షం/బోనకల్ :** మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో పలు సమస్యలను పరిష్కరించాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్‌లతో కలిసి వినతిపత్రం ఆదివారం అందజేశారు. మండల కేంద్రంలోని ఆర్వోబి బ్రిడ్జికి విద్యుత్ దీపాలు లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, తక్షణమే విద్యుత్ దీపాల ఏర్పాటు చేయాలని కోరారు. బోనకల్ గ్రామ పంచాయతీ వద్ద ఆర్వోబికి రింగ్ ఏర్పాటు చేయాలని, బోనకల్ బస్టాండ్ సెంటర్‌కు ఖమ్మం బస్టాండ్‌కు అనుసంధానంగా రైల్వే గేట్ వద్ద అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలన్నారు. మండల కేంద్రంలో పశువుల, మేకల సంత ఏర్పాటు చేసి మండల కురుమలకు, యాదవులకు, సంబంధిత వ్యాపారులకు ఆర్థిక తోడ్పాటు అందించాలన్నారు. జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు, ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులకు 250గజాల ఇంటి స్థలాన్ని అందజేయాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ గోడను నిర్మించాలని, నిరుద్యోగ యువతకు మండల కేంద్రాల్లో టామ్‌కామ్ ద్వారా విదేశీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు తక్షణమే మంజూరు చేయాలని, మహిళలకు రూ.2500 ఇవ్వాలని, ఆసరా, వృద్ధాప్య, వికలాంగ పెన్షన్‌లు పెంచాలని కోరారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందశారు. అనంతరం చిరునోముల గ్రామంలో 10వ వార్డులో విద్యుత్ స్తంభాలను వేయించి, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సిపిఐ గ్రామశాఖ కన్వీనర్ గుంపుల జయరాజు అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహయ కార్యదర్శి ఆకెన పవన్, బ్రాహ్మణపల్లి, కలకోట గ్రామ శాఖ కార్యదర్శులు గుడిద కృష్ణ, యంగల పెద్ద రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తూరుకు మంత్రి తుమ్మల పరామర్శ

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొత్తూరు ప్రభాకర్ రావు ఇటీవల ఓ ప్రమాదంలో గాయపడగా ఆదివారం సత్తుపల్లికి విచ్చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కొత్తూరు నివాసానికి వెళ్ళి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మండల పరిధిలోని కాకర్లపల్లి గ్రామంలోని సీనియర్ నాయకుడు కంచర్ల బాబురావు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. తుమ్మల వెంట చల్లగుళ్ళ నర్సింహరావు, పువ్వాళ్ళ ఉమా, కంచర్ల రమేష్, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

### వరమ్మకు మంత్రి తుమ్మల నివాళి

**ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పొరేషన్ నాల్గవ డివిజన్ కాంగ్రెస్ నాయకులు యల్లంపల్లి హన్మంతరావు మాతృమూర్తి యల్లంపల్లి వరమ్మ ఇటీవల మృతిచెందారు. ఆదివారం వరమ్మ దశ దిన కర్మల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏలూరి శ్రీనివాసరావు, కొంగర జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.





## కేసులు సత్వరమే పరిష్కరించండి



**ప్రజాపక్షం/సుజాతనగర్ :** పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ కేసులు లేకుండా సత్వరమే పరిష్కరించి, న్యాయం చేయాలని కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రెహ్మాన్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ సందర్భంగా పరిశీలించారు. విధులు పట్ల సమర్థవంతంగా పనిచేస్తున్న ఎస్సై జుబేదా బేగం ను, పోలీస్ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో చుంచుపల్లి సిఐ రాయల వెంకటేశ్వర్లు, సుజాతనగర్ ఎస్ఐ జుబేదాబేగం, ఏఎస్ఐ రాఘవులు, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ పి.వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ బాలు, నరేష్, రమేష్, మోహన్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు వెంటనే అందజేయండి

గ్రామ పంచాయతీవర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మల్లయ్య డిమాండ్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** గ్రామపంచాయతీలో పనిచేసే సిబ్బందికి పెండింగ్ జీతాలను వెంటనే ఇవ్వాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా కార్యదర్శి పిట్టల మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రఘునాథపాలెం మండల సమావేశం ఆదివారం మండల కార్యదర్శి రాజగోపాల్ అధ్యక్షతన రేగులచలక గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ పంచాయతీల్లో మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే కేటగిరిల వారీగా అమలు చేయాలన్నారు. కనీస వేతనం రూ. 18,500 ఇవ్వాలన్నారు. గ్రామ పంచాయతీల్లో కొత్తగా వచ్చిన పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందిని ఇబ్బందులు పెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జీతానికి తగినట్లుగా పని కూడా ఉండాలని కాని జీతం తక్కువ పని ఎక్కువగా ఉందన్నారు. దసరా సందర్భంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ఇప్పటి వరకు జీతాలు సిబ్బందికి అందలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే జీతాలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జి. రాందాస్, మండల అధ్యక్షులు బానోత్ మంగీలాల్, మండల నాయకులు లింగయ్య, రాము, మధు, ఉపేందర్, వీరయ్య, విజయలక్ష్మి, విజయ, శ్రీను, సైదులు, లాలు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టులు ఏకమయ్యే సమయం ఆసన్నం

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** దేశంలో మతోన్మాద బిజెపి ప్రభుత్వం రాజ్యం ఏలుతున్న సమయంలో కష్టజీవుల మనుగడకు మతోన్మాద పార్టీలకు సంఘీభావం తెలుపుతున్న రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలంటే కమ్యూనిస్టులంతా ఏకమయ్యే సమయం ఆసన్నమైందని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మండల పరిధిలోని పిండిప్రోలు గ్రామంలో పప్పుల భద్రయ్య నగర్ కామ్రేడ్ దేనేపల్లి వెంకన్న ప్రాంగణంలో 9వ మండల మహాసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ దేశంలో మతోన్మాద పార్టీ రాజ్యమేలుతున్న సమయంలో ప్రజలంతా ఆ పార్టీ వైపు మొగ్గుచూపుడంతో దేశ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి నెలకొందని ప్రజలను మభ్యపెట్టి మతోన్మాద పార్టీ బిజెపి పండుతున్న కుట్రలకు ఆద్యం పోస్తున్న కార్పొరేటర్ శక్తులకు గుణపాఠం చెప్పాలంటే కమ్యూనిస్టులంతా ఏకం కావడం అనివార్యమని అయినా అన్నారు.రాష్ట్రంలో పాలక ప్రభుత్వాలు ప్రజలను మభ్యపెట్టి నెరవేర్చలేని వాగ్దానాలను ఎన్నికల హామీల్లో ఇచ్చి ఏ ఒక్క హామీ అమలు చేయలేదని మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించినప్పటికీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు తెలిపాము కానీ ప్రజలకు అన్యాయం జరుగుతుందంటే మొదటగా పోరాడేది ఎర్రజెండా పార్టీలన్నని గుర్తు చేశారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరావు, బుగ్గవీటి సరళ, జిల్లా కార్యదర్శి నన్నూ నాగేశ్వరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బండి రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఎర్ర శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్, మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నాయకులు దొండేటి ఆనందరావు, అంగిరేకుల నరసయ్య, పద్మనాభల సుధాకర్, పప్పుల ప్రసాద్, చల్ల వెంకటేశ్వర్లు, రామనబోయిన రవి, పప్పుల ఉపేందర్, దొడ్డ లింగస్వామి, దొండేటి నిర్మల్ రావు, నాగటి సురేష్, పిట్టల పాపారావు పాల్గొన్నారు.

## షాదీఖాన నిర్మాణాలకు సహకారం అందిస్తాం : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** షాదీఖాన, మసీద్‌ల అభివృద్ధికి నా పూర్తి సహాయ సహకారాలుంటాయని సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి తెలిపారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జామే, మార్కెట్ మసీద్‌లకు నూతనంగా అఖండ మెజారిటీతో గెలిచిన సదర్(అధ్యక్షుడు)నాయబ్. రసూల్, కార్యదర్శి మహ్మద్ కమల్ పాషాలను ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ విజయ్‌కుమార్‌లు అభినందించారు. కార్యక్రమంలో గ్రాండ్ మౌలాలి, మహ్మద్ షాకీర్, రఫీ, మోనార్క్ రఫి, హమీద్, యూనిస్, ఆబీద్, ముస్లీం పెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.



## వ్యాపారాభివృద్ధితో పాటు సమాజ సేవ చేయాలి

ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్ సమావేశంలో ఎంపి వద్దిరాజు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వ్యాపారవేత్తలు తమ వ్యాపారాలు అభివృద్ధి చేసుకుంటూనే సమాజ సేవ చేయాలని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. తెలంగాణ ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ వార్షిక సర్వసభ్య సమావేశం, సదస్సు ఆదివారం నగరంలోని గాయత్రి ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. కార్యక్రమానికి ఎంపి వద్దిరాజు రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిస్ట్రిబ్యూటర్ సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని తెలిపారు. ప్రతియేటా డీలర్ షిప్ లైసెన్స్ రెన్యువల్ చేయించుకోవాల్సిన అవసరం లేకుండా గత ముఖ్యమంత్రి కెసిఆర్ చేసిన మేలును మరిచిపోకూడదన్నారు. వంట గ్యాస్ కారణంగా ప్రమాదాలు చోటు చేసుకోకుండా సురక్షా పైపులను డిస్ట్రిబ్యూటర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా అందజేయాల్సిన అవసరం ఉందని ఎంపి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపి రవిచంద్రను అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా శాలువతో సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను ఎంపి రవిచంద్ర సందర్శించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కల్లూరి జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, చరణ్, శ్రీకాంత్, మరికల్ పోత సుధీర్‌కుమార్, నాగసాయి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి భట్టికి వినతుల వెల్లువ

### విఆర్‌వోల సమస్యలు పరిష్కరించాలని

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** గత పాలకుల నిరంకుశ విధానాలతో విఆర్‌ఒలు అనేక ఇబ్బందులు పడ్డారని సర్వీస్ ప్రొటక్షన్, పేప్రొటక్షన్ కోల్పోయారని సమస్యలను పరిష్కరించాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కలెక్టరేట్‌లో ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విఆర్‌ఒల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు మాట్లాడుతూ 2020 సెప్టెంబరు 19న జిఒ నెం.29 ద్వారా విఆర్‌ఒ వ్యవస్థను రద్దు పరిచారని, 2022 జూలై 23న జిఒ నెం. 121 ద్వారా రి డిప్లాయిమెంట్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ భూములు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షకులుగా, సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక, సంస్థ ఎన్నికల నిర్వహణలో గ్రామ స్థాయిలో కీలక భూమిక విఆర్‌ఒ నిర్వహించే వారని తెలిపారు. మరల ఆప్షన్ పద్దతిలో విఆర్‌ఒలందరిని రెవెన్యూ శాఖలో తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బంకా కృష్ణయ్య, శీలం నరేంద్రప్రసాద్, వజ్జా రామారావు, చర్ల శ్రీనివాసరావు, మక్కాల శ్రీనివాస్, వాంకుడోత్ వెంకన్న, బానోత్ వస్త్రం, శాంతారావు, పుసం ముత్తయ్య, ఆర్.వెంకటేశ్వర్లు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.





### డిఎ ప్రకటించినందుకు కృతజ్ఞతలు

ఉద్యోగులపై మమకారంతో డిఎ ప్రకటించినందుకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఉద్యోగ సంఘాల నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఖమ్మం పర్యటనకు వచ్చిన సందర్భంగా ప్రజా భవన్ క్యాంపు కార్యాలయంలో ఉద్యోగ సంఘాల నేతలు భట్టి విక్రమార్కను కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర జెఎసి వైస్ ఛైర్మన్ దేవరకొండ సైదులు, టిజిఒ జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, టిఎన్‌జిఒ నాయకులు గుంటుపల్లి శ్రీనివాస్, జెడ్‌ఎస్ జైపాల్, విజయ్‌కుమార్, గంగవరపు బాలకృష్ణ, కొమరగిరి దుర్గాప్రసాద్, తాళ్లూరి శ్రీకాంత్, యర్రా రమేష్, ఆంజనేయులు, పెద్దినేని రాధాకృష్ణ, సగ్గుర్తి ప్రకాషరావు, రుక్మారావు, శంకర్, మట్టా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### అదనపు తరగతుల గదుల నిర్మాణానికి నిధులు ఇవ్వండి

**వైరా:** వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలోట అదనపుత తరగతుల నిర్మాణానికి బడ్జెట్ మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వైరా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ జ్యోతి వినతిపత్రాన్ని అందజేశారు. ఖమ్మం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఉప ముఖ్యమంత్రివర్యులను ఖమ్మంలో క్యాంపు ఆఫీసులో కలిసిన ప్రిన్సిపాల్ నవీనజ్యోతి తరగతి గదుల నిర్మాణానికి బడ్జెట్ ప్రపోజల్ రూపొందించి పంపించడం జరిగిందని, ప్రపోజల్స్ పరిశీలించి బడ్జెట్ శాంక్షన్ చేసి అదనపు తరగతి గదులు నిర్మాణం త్వరగా అయ్యేటట్లు చూడాల్సిందిగా వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ కొప్పిశెట్టి సురేష్, కంచర్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## కస్తూర్బాగాంధీ హాస్టల్‌లో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్?



**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల చెందిన సుమారు 15 మంది విద్యార్థులకు ఆదివారం సాయంత్రం ఫుడ్ పాయిజన్ అయినట్లు సమాచారం తెలిసింది. వారిని హుటాహుటిన కస్తూర్బా గాంధీ ఉపాధ్యాయ బృందం ముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు ప్రైవేట్ వాహనంలో పెద్దపెల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. కస్తూర్బా గాంధీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయిన విషయం తెలుసుకున్న విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురికావొద్దని ఉపాధ్యాయులు తెలిపారు.

## అద్భుతమైనది.. రామగిరి ఖిల్లా



**ప్రజాపక్షం/రామగిరి :** జెఎన్‌టియుహెచ్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, సతీమణి రామలక్ష్మి తో కలిసి చారిత్రాత్మకమైన నటువంటి రామగిరి కిల్లాను ఆదివారం సందర్శించారు. నాలుగు గంటల పాటు రామగిరి కిల్లాను పర్యటించిన రిజిస్ట్రార్ చరిత్రాత్మకమైనటువంటి కట్టడాలను ప్రదేశాలను తిలకించి మంత్ర ముగ్ధులైనారు. రిజిస్టార్ పిఏ భాస్కర్ జేఎన్టీయూ మంథని పరిపాలన అధికారి సుమన్ ఉన్నారు.

## కురుమసంఘం అధ్యక్షుడిగా బైరి రాజు



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కొత్తపల్లి పట్టణ కురుమ సంఘం అధ్యక్షుడిగా బైరి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్షుడిగా బైరి రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం పాలకవర్గం సభ్యులుగా మ్యాకల వెంకటేశం, పుల్ల రాజు, పెద్ది మురళి, ఎల్లమ్మల రమేష్, ఒగ్గరి శ్రీకాంత్, తొంటి వీరేశం, కూకట్ల కుమార్, ఒగ్గరి పోచమల్లులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రాజు మాట్లాడుతూ కుల అభివృద్ధికి పాటుపడతానని హామీ ఇచ్చారు. తన ఎన్నికకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను అందరికీ అందేలా పాటు పడతానని చెప్పారు. కుల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కులస్తులను కోరారు.

## జీవనశైలిలో మార్పులు చేసుకోండి



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** లయన్స్ కాళేశ్వరి కరీంనగర్ క్లబ్ ఆద్వర్యంలో క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. నగరంలోని కొండా సత్యాలక్ష్మి గార్డెన్‌లో సుశ్రుత క్యాన్సర్ హాస్పిటల్ సౌజన్యంతో అంకాలజీ డాక్టర్ అర్చన రెడ్డి డాక్టర్ అమర్‌నాథ్‌రెడ్డిలు క్యాన్సర్ లక్షణాలు, దశలు, చికిత్స, నివారణ అంశాలను వివరించారు. ప్రతి ఒక్కరు ముందు జాగ్రత్తగా పరీక్షలు చేయించుకోవాలని సలహా ఇచ్చారు. ఆహారపు అలవాట్లు జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని సూచించారు. అనంతరం పాల్గొన్న సభ్యులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో కాళేశ్వరి అధ్యక్షురాలు కంది జ్యోతి, కార్యదర్శి భారతి, సభ్యులు కొండ రాధిక, గాయత్రి, మునిపలి ఫణిత, పద్మజ, రాణి మహిళలు పాల్గొన్నారు.

## కస్తూరి లక్ష్మిరెడ్డికి డాక్టరేట్



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** సుల్తానాబాద్‌మండలం సాంబయ్యపల్లి గ్రామం వాసి సోషల్ జస్టిస్ ఫర్ కౌన్సిల్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ తెలంగాణ వైస్ చైర్మన్ కస్తూరి లక్ష్మి రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. అయన చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి శనివారం తమిళనాడులోని హోసూర్ లో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు, ఈ డాక్టరేట్‌ను ప్రధానం చేశారు.లక్ష్మి రెడ్డి మాట్లాడుతూ తమ జాతీయ చైర్మన్ డా. కొప్పుల విజయ్ కుమార్ సలహాలు, సూచనలతో ఎన్నో రకాల సామాజిక సేవా కార్యక్రమాలు,రైతన్నలకు ఉత్తమ వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలు చేయడం గమనించిన ఇంటర్నేషనల్ యూనివర్సిటీ వారు తనకు గౌరవ డాక్టరేట్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. యూనివర్సిటీ అధికారులు, హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు, వివిధ రాష్ట్రాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం

**ప్రజాపక్షం / చందుర్తి :** రైతులు దళారులను నమ్మి మోసపోకుండ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్ అన్నారు. ఆదివారం సనుగుల,మూడపెల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయంతో రైతులకు ఏక కాలంలో 2 లక్షల రూపాయాల రుణమాఫీ చేసిందన్నారు. కాంగ్రెస్ మాట ఇచ్చిన విధంగా సన్న రకం వడ్లకి 500 రూపాయలు బోనస్ ఇస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ లు తిప్పని శ్రీనివాస్ ,జలగం కిషన్ రావు,డైరెక్టర్లు,రైతులు పాల్గొన్నారు.

# మత్స్య కార్మిక కుటుంబాల అభ్యున్నతే లక్ష్యం

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం /వేములవాడ :** మిడ్ మానేరు రిజర్వాయర్ రుద్రవరంలో ఉచితంగా 80 వేల చేప పిల్లల విడుదలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మత్స్య కార్మిక కుటుంబాల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో మిడ్ మానేరు పరిధిలోని వేములవాడ అర్బన్ మండలం రుద్రవరంలో ఉచితంగా 80 వేల చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదివారం శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మత్స్యకారులకు 100% సబ్సిడీతో ఉచిత చేప బిల్లులను పంపిణీ చేసే కార్యక్రమాన్ని యజ్ఞంల నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ నెల నాలుగవ తేదీన మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ ఎల్ఎండిలో చేప పిల్లల్ని విడుదల చేశారని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 53 కోట్ల చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. చేపలను తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన మత్స్య కార్మికులకు ఐదు లక్షల ఆర్థిక సహాయం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది అన్నారు. మిడ్ మానేరు జలాశ పరిధిలోని రుద్రావరం గ్రామంలో గతంలో కేజీ కల్చర్ చేప పిల్లల పెంపకంపై అవగాహన కల్పించాం. మత్స్యకారులు ముందుకు వస్తే సబ్సిడీ ద్వారా కేజీ కల్చర్ చేపల యూనిట్ మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. దానికి సరిపడా మార్కెటింగ్ అవకాశాలను కూడా కల్పిస్తామని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కార్మిక ధార్మిక క్షేత్రంగా విరజిల్లుతుందని. మన ప్రాంత అభివృద్ధి లక్ష్యంగా ముందుకు పోతున్నామని ఇప్పటికే వేములవాడలో 50 కోట్లతో యారన్ డిపో, రాజన్న ఆలయ అభివృద్ధికి 50 కోట్ల నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. మత్స్యకారులు అన్ని అవకాశాలను అందిపుచ్చుకోనికి ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. జిల్లా లోని ఎన్ని వేల ఆరువందల నేలపై రెండు మంది మత్స్య కార్మిక కుటుంబాలకు చేతినిండా పని, ఆర్థికంగా ప్రగతిలోకి తీసుకువచ్చేందుకు మత్స్య శాఖ ఆధ్వర్యంలో మిడ్ మానేరులోమొత్తం 14 లక్షల పైచిలుకు చేప పిల్లలను విడుదల చేయనున్నామని వెల్లడించారు. ఇందులో భాగంగా మొదటి విడుతలో 80 వేల చేప పిల్లలను ఈ రోజు విడుదల చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి, అర్బన్ తాసిల్దార్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 317జిఓ బాధితులకు న్యాయం చేయాలి

### టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై. అశోక్‌కుమార్




**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** కాంగ్రెస్ నాయకులు అధికారంలోకివచ్చిన 15 రోజుల్లో బకాయిపడిన మూడు వాయిదాల డిఎలను విడుదల చేస్తామని, అందరికి ఆమోదయోగ్యమైన పిట్‌మెంట్‌తో పిఆర్‌సి ప్రకటిస్తామని, పెండింగ్ బిల్లులు విడుదల చేస్తామని, సిపిఎస్ రద్దు చేసి పాత పింఛన్‌ను పునరుద్దరిస్తామని . జివో 317 బాధితులకు న్యాయం చేస్తామని కాగ్రెస్ మెనిఫెస్టోలో ఎన్నో పేర్కొన్నారని కాని అధికారంలోకి 10 నెలలు గడస్తున్న తమ సమస్యల పరిష్కారం పట్ల కాం గ్రెస్ సర్కార్ చొరవ చూపటం లేదని టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ ఆరోపించారు. ఉద్యోగులకు హామినిచ్చినట్లుగా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపాలని, జివో 317 బాధితులందరికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగిన జనరల్ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగులకు మొదటి తారికున వేతనాలు ఇస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు ప్రకటించారు. జిఓ 317 సమస్యలపై మంత్రి వర్గ ఉప సంఘాన్ని నియమించినందుకు,సమస్యలను సానుకూలంలగా పరిష్కరిస్తానని ఆశించిన కమిటి సిఫార్సులను నిరాశకు గురిచేశాయన్నారు. భార్యభర్తలఆరోగ్యకారణాలతో బదిలీలకు జివో అవకాశం ఉన్నదని, స్థానికత కోల్పోయిన వారి గురి ంచి నిర్ణయం చేయకమపోతే కమిటితో ఏం ఉపయోగమని ప్రశ్నిస్తున్నారన్నారు. సిసిఎస్ రద్దు గురించి ఊసే లేదని, రెండెళ్లుగా వేలాది బిల్లులు క్లియర్ కావటం లేదన్నారు. వినిమయ ధరల సూచిక అనుగుణంగా ప్రతి ఆరునెలలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం ప్రకటించబడుతుందని,గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో ఈ ఆనవాయితీ పాటించటం లేదన్నారు.ఇవ్వాల్సిన సమయంలో ఇవ్వకుండ పండుగలప్పుడు కానుకలుగా ఇస్తున్నట్లు ప్రకటించటం విడ్డూ రంగా ఉందన్నారు. గత ప్రభుత్వం మూడు వాయిదాలుబకాయి పెడితే ఈ ప్రభుత్వం వచ్చాక మరో రెండు వాయిదాలువచ్చిచేరినట్లు తెలిపారు. కనీసం రెండు వాయిదాల డిఎ అయిన ఇప్పుడు ఇస్తారని ఉద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్నసందర్భంలో ఒక్క వాయిదామాత్రమే విడుదల చేయడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. జివో 317 పై ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునః సమీక్షించుకోవాలన్నారు.మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించి సమ స్యలు పరిష్కరించాలని అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, రాష్ట్రకార్యదర్శి కనకయ్య, రాములు, రాష్ట్ర సీనియర్ నాయకులు తిరుపతి రెడ్డి, పొన్నమల రాములు, నర్సింహరెడ్డి, శివాజీ మల్లేశం, జానకి రాములుపాల్గొన్నారు.

## కళాకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాజన్న సిరిసిల్ల జిల్లా కళాకారుల విభాగం ప్రధాన కార్యాలయం వేములవాడలో ఆదివారంజిల్లా అధ్యక్షులు వారాల దేవయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా ఉద్యమకారుల ఫోరం కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కళాతపస్వి యెల్ల పోశెట్టి మాట్లాడుతూ కళాకారులను గత ప్రభుత్వం పూర్తి విస్మరించారని గుర్తు చేస్తూ తెలంగాణ ఉద్యమకారుల కళాకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తూ ఉద్యమ కళాకారులను గుర్తించడానికి వెంటనే ఒక కమిటీ ఏర్పాటు చేసి ఉద్యమ కళాకారుల గుర్తింపుకార్డులుఅందజేయాలి. ఉత్తర తెలంగాణ కళాకారులవిభాగంకోఆర్డినేటర్ బొడ్డు రాములు, సమైక్య జిల్లా అధ్యక్షులు సావనపల్లి శ్రీనివాస్, జిల్లా కళాకారుల విభాగం ప్రధాన కార్యదర్శి మనువాడ లక్ష్మీనారాయణ, గుమ్మడి రాజేశం గౌడ్, మారం ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

## బిసి కులగణనపై బిజెపి వైఖరి వెల్లడించాలి



**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్:** తెలంగాణ రాష్ట్ర తరహాలోనేదేశవ్యాప్తంగా జాతిగణనలో బిసి కులగణను చేపట్టాలని,బిసి కులగణనపై బిజెపి ప్రభుత్వం తమ వైఖరిని వెల్లడించాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ డిమాండ్ చేశారు. బిసి కులగణన చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన బిజెపి పూర్తిగా విస్మరించిందన్నారు. జాతిగణనలో కులగణనను చేపట్టి బిసి రిజర్వేషన్లను జనా భా దామాషా ప్రకారం పెం చాలన్నారు. సామాజిక రిజర్వేషన్లపై వి ధించిన 50 శాతం పరిమితిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ మూలంగా బిసి విద్యార్థులకు మెరిట్ ఉన్నప్పటికీ ఎక్కువ మార్కులు పొందినప్పటికీ ఉద్యోగ అవకాశాలు రాలేదని, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు పరీక్ష రాస్తే మాత్రం ఉద్యోగాలు వస్తున్నాయని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభు త్వం దేశవ్యాప్తంగా చేపట్టబోయే జాతిగణనలో బిసి కులగణన చేపట్టాలని, లేనిపక్షంలో త్వరలో జరగబోయే మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికల్లో బిజెపికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా తక్షణమే బిసి కులగణన చేపట్టాలని, మహిళాబిల్లులలో బిసి మహిళలకు సబ్ కోటా కల్పించాలనే ప్రధాన డిమాండ్లతో 5, 6 తేదీల్లో వేలాది మంది తో చలో ఢిలీ కార్యక్రమాన్ని చేపట్టి ఎర్రకోటను ముట్టడిస్తామని హెచ్చరించారు.

## జర్నలిస్టు కుటుంబానికి పరామర్శ



**ప్రజాపక్షం / కోనరావుపేట :** రాజ న్న సిరిసిల్లజిల్లా కోనరావుపేట మం డలం ప్రెస్‌క్లబ్ ప్రెసిడెంట్ నిమ్మపల్లి గ్రామానికి చెందిన జర్నలిస్టులు దప్పుల కరుణాకర్, నరేష్‌ల తల్లి ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వారిని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని సూచించారు.

# విద్యారంగ పటిష్టతకు ప్రత్యేక దృష్టి

### ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్




**ప్రజాపక్షం/ధర్మపురి:** విద్యారంగం పటిష్టతకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేక దృష్టి సాగిస్తున్నదని రాష్ట్ర ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. నిరుద్యోగులకు బాసటగా నిలుస్తూ వివిధ పోటీ పరీక్షలకై వారిని సన్నద్ధం చేసేందుకు ఆల్ఫోర్స్ కళాశాలల అధినేత వి. నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో ఏర్పాటు చేసిన వివిఎస్‌ఆర్ ఈ క్లాసెస్ ఆప్‌ను ఆదివారం వివిఎస్‌ఆర్ తో కలిసి అడ్లూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులకు పోటీ పరీక్షలకు సమాయత్తం చేయడం కోసం ఏర్పాటు చేసిన ఆప్ ప్రారంభోత్సవానికి హాజరు కావడం ఆనందంగా ఉందన్నారు. నరేందర్ రెడ్డి తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. నరేందర్ రెడ్డి తనకు చాలా ఆప్తులన్నారు. ప్రయివేట్ కళాశాలల అధినేత అయిన నరేందర్ ఆ సంస్థల ద్వారా లక్షలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యాభోధన అందిస్తూ వారి భవిష్యత్తుకు చక్కని బాట వేస్తున్నారన్నారు. అంతెకాకుండా సుమారు 5వేల మందికి తన సంస్థలో ఉద్యోగాలు ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించిన విద్యావేత్తగా పేర్కొన్నారు. ఉన్నతమైన చదువులు చదివిన వ్యక్తి ప్రజా ప్రతినిధులైతే వారి విధానాల ద్వారా ప్రజలకు ఇటు ప్రభుత్వానికి మేలు జరుగుతుందని అన్నారు. దానికి ఉదాహరణగా మంత్రి శ్రీధర్ బాబు ను చెప్పుకోవచ్చన్నారు. విద్యా విషయంలో నిర్లక్ష్యం వద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి. నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ధర్మపురి నియోజకవర్గ వివిధ మండలాల అధ్యక్షులు ఎస్. దినేష్, శైలేందర్ రెడ్డి, వేముల సుభాష్, పార్టీ పట్టణ అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్, నాయకులు, ప్రసాద్, సుముఖ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులను రాష్ట్ర సాధకులుగా గుర్తించాలి



### తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు బండారి సుధాకర్

**ప్రజాపక్షం/ముత్తారం :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమకారులను రాష్ట్ర సాధకులుగా ప్రభుత్వం వెంటనే గుర్తించాలని, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు పరచాలని, సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు బండరి సుధాకర్ డిమాండ్ చేశారు. ముత్తారం ప్రెస్ క్లబ్ లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసి గుర్తించి, గుర్తింపు కార్డులు ఇవ్వాని ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలనని, ఉద్యమకారులకు సాంస్కృతిక సారథిలో వెయ్యి ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్లలో 10 శాతం ఉద్యమకారులకు కేటాయించాలని, అమరవీరుల కుటుంబాలన్నింటిని ఆదుకోవాలని, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఉద్యమ కళాకారుల కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేయాలనిడిమాండ్ చేశారు. మహిళా మండల అధ్యక్షురాలు ఇందారపు లక్ష్మి, మండల కార్యదర్శి అల్లంతిరుపతి,ఉపాధ్యక్షుడు నరేష్, మాజీ ఎంపిపి అత్తె చంద్రమౌళి, ఉద్యమకారులు అమ్ము శ్రీనివాస్, కొమురవెల్లి, నేరెళ్ల కుమార్, తూటి లక్ష్మణ్, బల మల్లు తో పాటు తదితరులున్నారు.

# మండలిలో గ్రాడ్యుయేట్ల గొంతుకవుతా..



**ప్రజాపక్షం / ధర్మపురి :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించి శాసన మండలిలోగ్రాడ్యుయేట్ల వాణి వినిపిస్తానని త్వరలో జరిగే గ్రాడ్యుయేట్ ఎమ్మె ల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మ న్ వి. నరేందర్‌రెడ్డి పే ర్కొన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో ఆదివారం ఆ యన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సమాయత్తమవుతున్న నిరుద్యోగులకు ఉద్యో గ అవకాశాలు కల్పించేందుకు ఆల్ఫోర్స్ పక్షాన ఉచిత యాప్ అందిస్తున్నామన్నారు. దీని ద్వారా 3వేల గంటల నిడివి గల నాణ్యమైన బోధన ఉద్యోగార్థులకు అందిస్తామన్నారు. దీనిని నిరుద్యోగులు ఉపయోగించుకుని రాబోవు ఉద్యోగ పరీక్షలలో విజయం సాధించాలన్నారు. రాష్ట్రంలో గత ఆరు నెలల కాల ంగా ఉద్యోగ నియామకాలు వేగంగా జరుగుతున్నాయని ఎలాంటి హడావుడి లేకుండా ఉద్యోగాలు చకచకా భర్తీ అవుతున్నాయని, దీని కోసం నిరుద్యోగులను సన్నద్ధం చేయాడానికి తమ సంస్థ ఆధ్వర్యంలో యాప్ ద్వారా ఉచితంగా కోచింగ్ అందిస్తున్నామని, ఉద్యోగార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాబోవు పట్టభద్రుల ఎన్నికల బరిలో ఉన్న తనకు అన్ని వైపులా మంచి స్పందన లభిస్తుందని తెలిపారు. దీని కోసం కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాలో వేలాదిమంది పట్టభద్రులను కలిశానన్నారు. తమ కష్టాలను వెళ్లబోసుకుంటున్న నిరుద్యోగుల బాధలు వింటూం టే కళ్లు చెమర్చుతున్నాయని అన్నారు. మరోవైపు ప్రయివేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాను గెలిచాక పై సమస్యలన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు. అన్ని సర్వేలు గెలుపు తనదేనని చెబుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ పెద్దలు పిలుపుమేరకు వారిని కలుసుకున్నానని, బహుశా కాంగ్రెస్ టికెట్‌పై బరిలో ఉండోచ్చని నరేందర్ రెడ్డి తెలిపారు.

# అబద్ధపు హామీలతో గద్దెనెక్కారు..

### మాజీ మంత్రి హరీష్‌రావు

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ..ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ మూడు సార్లు రైతబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారని..కాని అధికారంలోకి వచ్చాక రైతులను రైతుబంధు ఇవ్వకుండ మోసం చేస్తుందని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. ఆడపడుచులకు రెండు బతుకమ్మ చీరలు ఇస్తానని హామీనిచ్చి ఒక్కటి సైతం ఇవ్వలేదని విమర్శించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో క్యాంపు కార్యాలయంలో ఆదివారం 127 మందికి 28.65 లక్షల రూపాయల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను మాజీ మంత్రి హరీష్‌రావు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కెసిఆర్ రెండుపంటలు రబీ, యాసంగిలకు రైతుబంధు ఇస్తే ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ మూడు సార్లు ఇవ్వాలని డిమాండ్ చేశారని గుర్తుచేశారు. ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి తో తులం బంగారం ఇస్తానని చెప్పారని. తులంబంగారం దేవుడేరుగు కల్యాణ లక్ష్మి సైతం ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ అధికారం లోకి వచ్చాక ఉద్యోగులకు ఐదు డిఎలను పెండింగ్‌లో పెట్టిందన్నారు. నిరుద్యోగ యువతకు ఏడాది లోపు లక్ష ఉద్యోగాలు ఇస్తానన్నారని, కాని అధికారంలోకి వచ్చిన 11 నెలలు కావస్తుందని కనీసం 25వేల ఉద్యోగాలకు సైతం నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. పిఆర్‌సి ఇస్తానన్నారని, దాన్ని సైతం ఇవ్వలేదన్నారు. పేదోడికి ఇళ్లు ఇవ్వకుండ ఉన్న ఇం డ్లను సైతం కూలగొడుతున్నారన్నారు. తెలంగాణ అక్కచెల్లెల్లకు 2500 రూపాయలు ఇస్తానని బాండ్ పేపర్ సైతం రాసిచ్చారని దాని ఊసేలేదన్నారు. కెసిఆర్ హయాంలో సర్కార్ దవఖానలో ఆడపిల్ల పుడితే 13వేలు ఇచ్చి కెసిఆర్ కిట్ ఇచ్చి తల్లిబిడ్డను క్షేమంగా ఇంటివద్దనే జాగ్రత్తగా దించారన్నారు. కాని కాంగ్రెస్ సర్కార్ 13వేల రూపాయలు ఇవ్వటంలేదని, కెసిఆర్ కిట్ ఇవ్వటం లేదన్నారు. ప్రజలను మాయమాటలతో నమ్మించారని. ఇప్పుడేమో గొంతు కోస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి ఫారుక్‌హుస్సేన్, మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు, నాయకులు మారెడ్డి రవీందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు. కౌన్సిలర్లు బర్ల మల్లికార్జున్, మోహిస్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## ఎఐకెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్



**ప్రజాపక్షం/సూర్యాపేట:** ఆల్ ఇండియా కబడ్డీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా జిల్లా కేంద్రానికి చెందిన బిఆర్‌ఎస్ రాష్ట్ర యువజన నాయకులు మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్ ఎన్నికయ్యారు. ఆదివారం హైద్రాబాద్‌లోని కాసాని కృష్ణ అకాడమిలో నిర్వహించి కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఎన్నికలు ఎఐఎస్ అధికారి, సంఘం లీగల్ అడ్వైజర్ గెహ్లోట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆల్ ఇండియా కబడ్డీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కాసాని వీరేష్ ముదిరాజ్, కార్యదర్శిగా మహేందర్ రెడ్డిలు ఎన్నికైన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు, జిల్లా ఒలంపిక్ అధ్యక్షులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి, ఒలంపిక్స్ రాష్ట్ర కార్యదర్శి జగదీష్ యాదవ్, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వరంలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో కబడ్డీ క్రీడాకారుల సంక్షేమం, క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

## స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ జిల్లా స్కూల్ గేమ్స్ ఫడరేషన్ కార్యదర్శి దగ్గుపాటి విమల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి ఎస్‌జిఎఫ్ అండర్ 14, 17 బాలబాలికల వాలీబాల్ టోర్నమెంట్, సెలక్షన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి దగ్గుపాటి విమల మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి దాదాపు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారని,క్రీడాకారులందరికి భోజనం, మంచినీటి సదుపాయాలు కల్పించారని, ఈ అవకాశాన్ని కల్పించిన విద్యాశాఖ అధికారి బొల్లారం బిక్షపతికి ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు నాగరాజు, కవిత, రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్, శ్రీదేవి, చంద్రయ్య, సురేందర్, కర్ణాకర్ రెడ్డి, నుస్రత్, బ్రహ్మయ్య, మురళి, లెనిన్, సావిత్రి, రంగా, బొమ్మపాల గిరిబాబు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక



**ప్రజాపక్షం/నందికొండ :** నందికొండ మున్సిపాలిటీ పరిధిలో ని స్థానిక హిల్ కాలనీలో ఉన్న సెయింట్ జోసఫ్ పాఠశాల విద్యార్థులు బాస్కెట్ బాల్ పోటీలకు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా స్కూల్ గేమ్స్ ఫడరేషన్ వారి ఆధ్వర్యంలో కోదాడ పట్టణం సీసీ రెడ్డి పాఠశాలలో జరిగిన 14, 17 సంవత్సరాల బాల బాలికల బాస్కెట్ బాల్ సెలక్షన్స్ లో తమ సెయింట్ జోసఫ్ పాఠశాలకు చెందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల పి ఇ టి, నల్లగొండ జిల్లా నెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి కిరణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిస్టర్ లలిత అభినందనలు తెలిపారు.

## కీడు వచ్చిందని వార్డునే ఖాళీ చేసిన ప్రజలు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** కీడు వచ్చిందని వార్డు ప్రజలు వార్డును ఖాళీ చేసిన సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 20వ వార్డులో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం వార్డులో గత నెల రోజులుగా ఆరుగురు మరణించారు. మరణించిన ప్రతి వారు మంగళవారం చనిపోవడంతో వార్డు కౌన్సిలర్ అన్నేపర్తి రాజేష్ ఇలా ఎందుకు జరుగుతుందని వేదపండితులను సంప్రదించగా వార్డుకు కీడు వచ్చిందని చెప్పారు. వార్డులోని పెద్దలతో చర్చించి వార్డులో కౌన్సిలర్ ఇంటింటికి, గల్లీకి తిరిగి వార్డుకు కీడు వచ్చిందని ఒక రోజు వార్డు మొత్తం ఖాళీ చేయడంతో కీడు పోతుందని చెప్పారు. దీంతో వార్డు ప్రజలు ఆదివారం ఉదయం 6 గంటలకు ఇంటి ముందు కల్లాపి చల్లకుండానే ఇంటిని ఖాళీ చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు వార్డు సమీపంలోని చెట్ల కింద వంటవార్పు చేసి గడిపారు. గతంలో ఇలానే జరిగితే 2015లో నాటి కౌన్సిలర్ కుంభం రజితనాగరాజు ఆధ్వర్యంలో వార్డును ఖాళీ చేసినట్లు ప్రజలు చెప్పారు. సాయంత్రం 6 గంటలకు ప్రజలు తిరిగి తమ ఇండ్లకు చేరుకున్నారు.

## నేడు 2కె రన్

**ప్రజాపక్షం/సూర్యాపేట:** పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా నేడు (సోమవారం) జిల్లా కేంద్రంలోని ఎన్‌టిఆర్ పార్కు నుండి అమర వీరుల స్మారక 2కె రన్ ఉదయం 6 గంటలకు నిర్వహిస్తున్నట్లు డిఎస్‌పి రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2కె రన్‌కు జిల్లా ఎస్‌పి సన్‌ప్రీత్‌సింగ్‌తో పాటు పోలీస్ ఉన్నతాధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు. యువత, విద్యార్థులు పాల్గొని 2కె రన్ విజయవంతం చేయాలని కోరారు.

## మానవత్వం చాటుకున్న కొండేరు గ్రామ గణేష్ కమిటీ యూత్

**ప్రజాపక్షం / ఎర్రవల్లి :** కొండేరు గ్రామ కురువ కుమార్ తండ్రి నరసింహ బాల్యంలోనే తండ్రి మరణించాడు. తల్లికి అనారోగ్యం, ఎలాంటి పని చేసుకోవడానికి చేతకాదు కుమార్ అనే అబ్బాయికి చిన్నతనం నుంచి జన్యులో పాలున్నాయి ఆ అబ్బాయిని ఏ షాపులోకి వెళ్లిన ఆటోకి కూలి వెళ్దాం అన్నా ఆ అబ్బాయిని రాణించుకోరు అంటరాని వాడిగా చూస్తారు. మానవత్వంతో కొండేరు గ్రామ సవరమ్మ కట్ట గణేష్ కమిటీ యూత్ సభ్యులు క్వింటల్ బియ్యం 2 నెలలకు సరిపడా సరుకులు ఇవ్వడం జరిగింది. బాధితుడు కుమార్ మాట్లాడుతూ ఆవేదనతో నన్ను ఏ పనికి రానివ్వడం లేదు. కూలిపోదామన్న ఆటోలో ఉన్న మిగతా వారు ఎక్కువైనారు. నువ్వు వద్దు అని అంటున్నారు. ఉపాధి లేక వచ్చిన పింఛన్‌తోనే కాలం గడుపుకుంటున్నాము. నన్ను అంటరానివాడిలా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



# భావితరాలకు రక్షణగా ఉందాం

## మూసీమురికిని ప్రక్షాళన చేద్దాం

### ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి





**ప్రజాపక్షం/ శాలిగౌరారం :** నల్లగొండ జిల్లా, యాదాద్రి భువనగిరి జిల్లాల పరిధిలోని శాలిగౌరారం, అడ్డగూడూరు మండలాల మధ్యన మా నాయికుంట బ్రిడ్జిపై నిర్వహించిన తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి మూసి రైతుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎంఎల్‌ఏ మందుల సామేలు, నకిరేకల్ ఎంఎల్‌ఏ వేముల వీరేశం హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మురికి కూపంలో బతుకుతున్న మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు దారి చూపాలన్న ఆలోచనతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసి ప్రక్షాళనకు పూనుకున్నారు. దీనిలో భాగంగా మూసి పరివాహక ప్రాంతంలో నివసించే రైతులు, ప్రజలుకు దుర్గంధం వెదజల్లే మూసి నీళ్లతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పేద ప్రజల సంక్షేమం పట్టించుకోని గత ప్రభుత్వం నేటి ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వాన్ని బదునామ్ చేయడమే లక్ష్యంగా మాట్లాడుతున్నారన్నారు. మూసీ ప్రక్షాళన కోసం అవసరమైతే ప్రత్యేక అసెంబ్లీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ప్రతిపక్ష పార్టీలు చిల్లర మాటలు మానుకోవాలని అన్నారు. ఈ మధ్యకాలంలో కురిసిన భారీ వర్షాలకు బెంగళూరు, చెన్నై నగరాల పరిస్థితి ఏ విధంగా ఉన్నదో మనం కళ్ళారా చూశామని, అలాంటి పరిస్థితి హైదరాబాదు నగరానికి రా కుండా ఉండేందుకు ముఖ్యమంత్రి ముందు చూపుతో ఈ నిర్ణయం తీసుకున్నారని, ప్రతిపక్ష పార్టీలు సోషల్ మీడియాలో చేసే చిల్లర ప్రచారాలను ప్రజలు నమ్మరని అన్నారు.

**సుందరీకరణ కోసం కాదు..మూసీ పునరుజ్జీవనం కోసం**

మూసీ మురికి నుంచి ప్రజలను కాపాడాలన్నది మా ప్రభుత్వం చేస్తున్న సాహసోపేతమైన నిర్ణయమని, మూసి ప్రక్షాళన చేసి గోదావరి నీళ్లతో మూసిని సస్యశ్యామలం చేస్తామన్నారు.హైదరాబాద్ లోని మురికితో, కంపెనీల వ్యర్థలతో మూసి నదినకలుషితం అయ్యింది. బిజెపి కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి తోపాటు ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రధాని మోడీ సభర్మతి నదిని ప్రక్షాళన చేయడం సరైన చర్యని అంటూ రేవంత్ రెడ్డి మూసిని ప్రక్షాళన చేస్తే అడ్డుపడడం వెనక ఉన్న ఆంతర్యం ఏమిటని, రైతులను కాపాడడం కోసం దీపావళి తర్వాత నకిరేకల్‌లో ఇబ్రహీంపట్నంలో లక్ష మందితో సభలు పెడతామన్నారు.

**మూసీకి గత వైభవాన్ని తీసుకు వద్దాం ...**

దుర్భరమైన పరిస్థితిలో ఉన్న మూసీ నదిని ప్రక్షాళన చేసి గత వైభవాన్ని వచ్చి భావితరాలకు రక్షణగా ఉందామని అన్నారు. మూసి నదిని ప్రక్షాళన చేయాలంటే పరివాహక ప్రజల, రైతుల సహకారం ఉంటేనే రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకం గా తీసుకున్నటువంటి మూసి నది ప్రక్షాళనక ముందుకు సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాసోజు శంకరమ్మ , సీనియర్ నాయకులు జ్ఞాన సుందర్, మండల పార్టీ అధ్యక్షులు పోలేబోయిన లింగయ్య , మోత్కూరు మండల పార్టీ అధ్యక్షుడు వంగాల సత్యనారాయణ, అడ్వాకెట్ యుగంధర్, ముఖ్య నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు పద్మ , రైతులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

**మూసీ ప్రక్షాళనకు మద్దతు తెలిపిన రైతాంగం**

ప్రజాపక్షం/అడ్డగూడూరు: తుంగతూర్తి నియోజకవర్గ పరిధిలోని మానాయికుంట గురజాల మధ్యన మూసీవాగుబ్రిడ్జి పై ఎమ్మెల్యే మందుల సామేలు ఆద్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన మూసీ పునర్జీవం, ప్రక్షాళన రైతుల ఆత్మీయసమ్మేళంలో రైతులు ప్రజలు ఆదివారం మధ్యాహ్నం పాల్గొని విజయవంతం చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేలు, ముఖ్య అతిథులుగా నక్రికల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మూసీ కాలుష్యం నీళ్ల వల్ల పంటలు తిన్నవారికి, నీళ్లు తాగిన వారికి జబ్బులు వస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు అందుకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసీ పునర్జీవం, ప్రక్షాళన చేస్తుందగా బిఆర్ఎస్, బిజెపి అడ్డపడుతున్నాయి ఈమురికిప్రక్షాళనచేస్తున్నా ప్రభుత్వానికి అండగా వచ్చిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఐక్య పోరాటాల నిర్మాణమే సాయిబాబాకు నివాళి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఐక్య పోరాటాల నిర్మాణమే ప్రొఫెసర్ సాయిబాబాకు నిజమైన నివాళి అని ఉపాధ్యాయ ఎంఎల్‌సి నర్సిరెడ్డి అన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో యుటిఎఫ్ భవన్‌లో జరిగింది. ఈ సభలో ఉపాధ్యాయ ఎంఎల్‌సి పాల్గొని మాట్లాడుతూ 90శాతం అంగవైకల్యాన్ని కలిగిన సాయిబాబా ఈ దేశంలో పీడిత, ఆదివాసీ ప్రజల హక్కుల కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఫాసిస్ట్ ప్రభుత్వం ఆయనపై అక్రమ కేసులు పెట్టి, ఏ ఆధారాలు లేకుండా దాదాపు పది సంవత్సరాల కాలం జైలులో నిర్బంధించి కనీస వైద్యం అందించకుండా ఆయన ఆరోగ్యం పూర్తిగా క్షీణించేలా చేసి పరోక్షంగా ఆయన మృతికి కారణమైందన్నారు. సాయిబాబా పోరాట చైతన్యం ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిందని ఆయన చూపిన మార్గంలో పీడిత ప్రజల, ఆదివాసీల హక్కుల కోసం మనం ఐక్యంగా నిబద్ధతతో పోరాడటమే ఆయనకు మనం అర్పించే నివాళి అన్నారు.ఈ సభలో ప్రజాసంఘాల ఐక్య వేదిక అధ్యక్షులు దర్శనం నరసింహ, మిర్యాలగూడ మాజీ ఎంఎల్‌ఏ జూలకంటి రంగారెడ్డి, అరసవిల్లి కృష్ణ, ఎన్ వేణుగోపాల్, సిహెచ్ సుధాకర్‌రెడ్డి, ఎం. సోమయ్య, పన్నాల గోపాల్‌రెడ్డి, గురువయ్య, మోహన్, తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లోని బీసీ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి బాలికల వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల వల్ల విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతోపాటు మానసికొల్లాస అలవరుడుతుందన్నారు. క్రీడల వల్ల ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అవకాశం ఉన్నందున విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీవో బైరెడ్డి సంధ్య, ప్రిన్సిపాల్ ఉమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ సరిత, పీడీ ఇందిరారెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు సజ్జల రవీందర్‌రెడ్డి, చిలుకూరి బాలు, మాజీ ఎంపీపీ జిందా, టీడబ్ల్యు అనూష, నాగలక్ష్మి , సరిత, పీఈటీ శాంతి పాల్గొన్నారు.

## రూరల్ ప్రాంత రోడ్లన్నీ ప్రైవేట్ పరం కుట్ర

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** రూరల్ ప్రాతాల్లోని రోడ్లన్నీ బడాబాబులకు కట్టబెట్టి ప్రైవేట్ పరం చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల రోడ్లను బడా బాబులకు కట్టబెట్టి మంత్రి పొంగులేటి ప్రజల గుండెల్లో మొదటి బాంబు పెల్చారన్నారు. ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు విధానాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవలంభిస్తున్నారని ఆరోపించారు. బిఆర్‌ఎస్ పాలనలో బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ నాయకత్వంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు రోడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పించామని, 60 సంవత్సరాల నిర్లక్ష్యాన్ని ఎండగట్టి కేవలం పది సంవత్సరాల్లో అద్భుతమైన ప్రగతి సాధించామన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చాక ప్రజలపై మరోమారు తన విషబుద్ధిని ప్రదర్శించిందన్నారు. మంత్రివర్గ నిర్ణయం ప్రకారం రోడ్లను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడితే సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మంత్రివర్గ నిర్ణయంతో రానున్న రోజుల్లో ప్రజలు ఇంటినుండి బయటికి వెళ్తే ట్యాక్సులు కట్టే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకోచ్చేలా ఉందన్నారు. ఏ ప్రాతిపదికన రోడ్లను కేటాయిస్తున్నారో పూర్తి వివరాలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇదే విధానం కొనసాగితే రానున్న రోజుల్లో బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో అడ్డుకుంటామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, నాయకులు నెమ్మాది భిక్షం, వంటెద్దు నర్సింహ్మారెడ్డి, మొరిశెట్టి శ్రీనివాస్, సవరాల సత్యనారాయణ పాల్గొన్నారు.

**కెటిఆర్ ఇంటిపై పోలీసుల సోదాలు సరైంది కాదు**

ఏలాంటి కారణం, వారెంట్ లేకుండా ప్రతిపక్ష పార్టీ నేత కెటిఆర్ ఇంటిపై పోలీసులు సోదాలు చేయడం సరైంది కాదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కెటిఆర్ ఇంటిపై పోలీసులు దౌర్జన్యంగా దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఏలాంటి సంబంధం లేకున్నా పోలీసులు వ్యవహరిస్తున్న తీరును తప్పుపట్టారు. కాంగ్రెస్, బిజెపి పార్టీలు కసిలి ఆడుతున్న నాటకమన్నారు. సిఎం రేవంత్ రెడ్డి సోదరులపై వస్తున్న ఆరోపణలపై పోలీసులు వాళ్ళ ఇండ్లపై ఎందుకు దాడులు చేయడం లేదని ప్రశ్నించారు. ఇలాంటి చిల్లర దాడులతో భయపడేది లేదని, మాకు అరెస్టులు కొత్తేమి కాదని చెప్పారు.

## 'సత్య వీక్షణం' గ్రంథావిష్కరణ




**ప్రజాపక్షం/(నల్లగొండ) నకిరేకల్ :** విజ్ఞాన శాస్త్రంలో తత్వశాస్త్రాన్ని మేళవించి రచించిన సత్య వీక్షణం పుస్తకం ఒక అద్భుతమైన ప్రయోగమని తెలంగాణ బయాలజికల్ సైన్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత పెసర ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం నకిరేకల్‌లో గెండెల శ్రీనివాస్ రచించిన సత్యవీక్షణం గ్రంథావిష్కరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గెండెల శ్రీనివాస్ సత్యాన్వేషణ కోసం చేసిన ప్రయత్నం అభినందించదగింది అన్నారు. అనేక సత్యాలను సోదాహరణంగా ఈ పుస్తకం వివరిస్తుందన్నారు. టిబిఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సత్యవీక్షణం గ్రంథం విద్యార్థులలో ఉపాధ్యాయులలో ఆలోచనలు రేకెత్తించేదిగా ఉందన్నారు. ప్రముఖ కవి సారంగి వెంకన్న పుస్తక సమీక్ష చేశారు. తెలంగాణ బయాలజికల్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు చిట్టిపోలు సదానందం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ సాగర్ల సత్తయ్య, టిబిఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి అరూరి జానయ్య, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ముషం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల కోటా తేల్చేంతవరకూ ప్రభుత్వంపై సమరం



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్‌:** అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం లోపు స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ఆ సంఘం నేతలతో కలిసి 565 జాతీయ రహదరి నిర్బందించారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ 78 ఏళ్ల స్వతంత్ర భారతావనిలో రాజ్యాధికారానికి దూరమై దుర్భర జీవితాలు గడుపుతున్న దివ్యాంగుల సమస్యలపై దివ్యాంగుల ఓట్లతో గద్దెనెక్కిన సకలాంగుల ప్రజాప్రతినిధులు దివ్యాంగుల సమస్యలపై చట్టసభల్లో చర్చించకుండా అడుగడుగున దివ్యాంగుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల ముందు అధికారంలోకొస్తే మరుసటి నెల నుంచే వికలాంగుల పెన్షన్ 6000 కు పెంచుతామని ఆర్‌టిసిలో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని వాగ్దానం చేశారని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు చిన్నపాక మత్స్యగిరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర మహిళా నాయకురాలు గుడిపల్లి సుమతి, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సింహులు, సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు పోతురాజు సుధీర్, సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వరంగల్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ షరీఫ్, సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు గోగుల శేఖర్ రెడ్డి, సంఘం జిల్లా మహిళా నాయకురాలు అలివేలు, సంఘం మునుగోడు మండల ఉపాధ్యక్షులు ఒంటేపాక ముత్తయ్య, సంఘం చండూరు మండలం అధ్యక్షుడు ఆకారపు వెంకన్న పాల్గొన్నారు.

## గిరిజన భవన్‌కు స్థలం కేటాయించాలి



**ప్రజాపక్షం/తుంగతుర్తి:** బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో మండల కేంద్రానికి మంజూరైన గిరిజన భవన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించాలని బిఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపిపి తాటికొండ సీతయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో భూమి కేటాయించాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి ఎమెల్యే గాదరి కిషోర్ కుమార్ గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ భవన్ నిర్మాణానికి కోటి రూపాయలు మంజూరు చేసి టెండర్ ప్రక్రీయను పూర్తి చేసినట్లు తెలిపారు. నూతన ప్రభుత్వం ఏర్పడి 10నెలలు గడుస్తున్న నేటికి స్థలం కేటాయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైన స్థలం వెంటనే కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు గుండగాని రాములు గౌడ్, నాయకులు విరోజీ నాయక్, నరేష్ నాయక్, యాకూబ్ నాయక్, పుణ్యానాయక్, శంకర్ నాయక్, గాజుల యాదగిరి, వెంకన్న, నాగమల్లు, మనోజ్, వీరు, రవి పాల్గొన్నారు.

## పేరుకే సిసిఐ కేంద్రాలు...రైతులకు అందని ధరలు



**ప్రజాపక్షం/చందంపేట :** నల్గొండ జిల్లా చందంపేట మండలం పేరుకే సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రా లు అని కేంద్రాలకు రైతులు తీసుకువెళ్లిన పత్తికి ప్రభుత్వం ప్రకటించిన ధరలు మాత్రం ఇవ్వ డం లేదని సిపిఐ మండల కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య అన్నారు. ఆరుగాలం కష్ట పడి పండించిన పత్తి పంటను అమ్ముకుందామని రైతులు సిసిఐ కేంద్రాలకు తీసుకువస్తే అక్కడ తేమ శాతాలు చూసి పత్తిని కొనుగోలు చేస్తలేరని రైతులు పత్తిని వారి వద్ద ఉంచుకోవడం వలన నష్టం ఏర్పడుతుందని ఇదే అదునుగా చూసుకొని దళారులు ఊర్లలోకి వచ్చి తక్కువ మొత్తం చెల్లించి పత్తిని కొనుగోలు చేస్తూ రైతులను నట్టేట ముంచుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిసిఐ కేంద్రాల్లో పత్తిని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. దేవరకొండ నియోజకవర్గంలో 10కి పైన సిసిఐ కేంద్రాలు ఉన్నప్పటికి మధ్య దళారులు 5వేల నుండి 6వేల వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, గత నెలలో వర్షాలు పడడంతో చాలా వరకు పత్తి పంటకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం లేమ శాతాన్ని చూడకుండా రైతుల వద్ద నుండి పత్తిని కొనుగోలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## భువనగిరిలో ప్రారంభమైన క్రీడా పోటీలు



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయాల ఉమ్మడి నల్లగొండ జిల్లా 14 నుండి 19 సంవత్సరాల మధ్య వయస్సుగల విద్యార్థులకు క్రీడా పోటీలు ఎస్ఓఈ అనంతరం యాదాద్రి భువనగిరిలో ప్రారంభమైనాయి. ఈ ప్రారంభ వేడుకలలో ముఖ్య అతిథిగా అసిస్టెంట్ కమీషనరల్ ఆఫ్ పోలీస్ కొత్త కిషన్ రావు మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు శారీరిక దారుడ్యముతో పాటు మానసిక ఉల్లాసాన్నిపెంపొందిస్తాయి. విద్యతో పాటు క్రీడలు కూడా విద్యార్థులను ఉన్నత శిఖరాలు సాధించడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఎస్ఓఈ స్కూల్ ప్రిన్సిపాల్ వీరమల్ల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థులలో పట్టుదల చురుకుదనం పెరుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓఈ వైస్ ప్రిన్సిపాల్ ఝాన్సీ రెడ్డి, హేమీమా దశరథ, కవిత రూపా రెడ్డి, మురళి భువన ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మహాత్మా జ్యోతిభా పూలే పాఠశాలలు కళాశాలల నుండి విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పేదలకు ఆసరాగా నిలుస్తున్న సిఎంఆర్‌ఎఫ్ :ఎమ్మెల్యే గండ్ర



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలప ల్లి ప్రతినిధి:** ప్రైవేట్ వైద్యం చేసి ఆర్థికంగా నష్టపోయిన పేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ ఆసరాగా నిలుస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం భూపాలపల్లి మంజూరునగర్‌లోని ఎ మ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయ ణ రావు చెక్కులను పంపిణీ చేశారు. ఇందులో మొత్తం 99మంది లబ్ధిదారులు భూపాలపల్లి మున్సిపాలిటీ, భూ పాలపల్లి రూరల్, గణపురం, చిట్యాల, మొగుళ్లపల్లి మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన వారున్నారు. 99మంది లబ్ధిదారులకు రూ.25.68 లక్షలు. చెక్కులను ఎమ్మెల్యే గండ్ర చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్య చికిత్స చేసుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎన్నో కుటుంబాలకు ఈ రిలీఫ్‌ఫండ్ ఆసరాగా నిలుస్తుందని, బాధితులు అవసరమైన సమయంలో సిఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగపరచుకోవాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా సూచించా రు. కాంగ్రెస్ నాయకులు బుర్ర కొ మురయ్య, ఇస్లావత్ దేవన్, అప్పం కిషన్, క్యాథ రాజు సాంబమూర్తి, స్థానికకౌన్సిలర్లునాయకులుపాల్గొన్నారు.

## మేడారం అడవుల్లో అటవీ విపత్తు ప్రదేశాల పరిశీలన



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ములుగు జిల్లాలోని సమ్మక్క సారలమ్మ తాడ్వాయి మండలం మేడారం అడవుల్లో గత కొద్ది రోజుల క్రితం సంభవించిన భారీ అటవీ విపత్తు జరిగిన ప్రదేశాన్ని జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య, ములుగు జిల్లా అధ్యక్షులు పెట్టెం రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు జి సంజీవ, గోవిందరావుపేట మండలాధ్యక్షుడు సన్నగుండ్ల వెంకటేశ్వర్లతో కలిసి సందర్శించారు. గత కొన్ని రోజుల క్రితం మేడారం తాడ్వాయి రహదారికి ఆనుకొని ఉన్న దట్టమైన అడవి ప్రాంతంలో భారీ వర్షాలతో, సుడిగాలుల ప్రభావంతో సుమారుగా 600 ఎకరాల్లో రమారమిగా 70వేల చెట్లు వే ర్లతో సహ పెకలించుకొని నేలమట్టమయ్యాయి. భారీ వృక్షాలు ఈ విధం గా నేలమట్టమవడం ఇది మొదటిసారని స్థానికులు చెప్పుకొచ్చారు. దీని లో భారీ అటవీ ప్రళయంతో బీభత్సవం జరిగిందని అన్నారు. ఆ సమయంలో రహదారిపై రాకపోకలు ఉంటే తీవ్ర ప్రాణనష్టం జరిగి ఉండేదని తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య మాట్లాడుతూ ప్రకృతి విధ్వంసాల వల్లనే ఇలాంటి వైపరీత్యాలు సంభవిస్తున్నాయని ఇలాంటి సంఘటనలపై లోతై న అధ్యయనం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. అటవీ బచావో పేరిట కార్యక్రమాలు ఏర్పాటు చేసి ములుగు ప్రాంతంలో ఉన్న అడవులను కాపాడుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ములుగు జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. తాడ్వాయి మండల నాయకులు శ్రీ ను, వినోద్, అనిల్‌కుమార్, మహేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల చొరవతో రోడ్డు మరమ్మతులు



**ప్రజాపక్షం/నెక్కొండ:**వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని గుండ్లపల్లి చెరువు కట్ట పై భారీ వాహనాలు నిత్యం వెళ్ళడంతో రోడ్డు గుంతలుగా ఏర్పడి ప్రజల తీవ్రమైన ఇబ్బందే ఎదుర్కొంటున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని మహేందర్ తన సిబ్బందితో రోడ్డు గుంతల్లో కంకర వరం ఆదివారం పోసి రోడ్డుకు మరమ్మతులు చేశారు. దీంతో గుండ్రపల్లి, మడిపల్లి, పెద్ద కొరుపోలు, గ్రామాలతో పాటు గిరిజన తండాలకు నిత్యం వెళ్లి ప్రజలు పోలీసుల శ్రమదానానికీ ప్రశంసలు కురిపించారు. శాంతిభద్రతల విషయంలో కాదు ప్రజల అవసరాలను కూడా తీర్చుతామంటూ నెక్కొండ పోలీసులు ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారు. గతంలో భారీ వర్షాలకు నెక్కొండ నర్సంపేట వెళ్లి ప్రధాన రహదారి పెట్రోల్ బంకుల వద్ద కల్వర్టు మొత్తం ధ్వంసం అయిపోతుంది. ఆనాటి సీఐ హతీరామ్ తన సిబ్బందితో యుద్ధ ప్రాతిపాదికన్నా కొన్ని గంటల్లోనే రోడ్డుకు మనమధ్య చేసి యధావిధిగా వాహనాలను నడిపించారు మరో మారు విపరీతమైన వర్షాలతో ఇదే నెక్కొండ నర్సంపేట వెళ్లే ప్రధాన రహదారి పెట్రోల్ బంకుల వద్ద కల్వర్టు పై నుండి నీరు ప్రవహిస్తుండగా ఆనాటి సీఐ తిరుమల్ తన సిబ్బందితో ప్రయాణికులను నీటి ప్రవాహం నుండి సురక్షితంగా దాటించారు. ఇలా నెక్కొండ పోలీసులు ప్రజల అవసరాలు తీర్చుటలో ప్రత్యేక పాత్ర పోషించడంతో ప్రజల మనసుల్లో పోలీసులపై ఒక మంచి అభిప్రాయం ఏర్పడింది.

## నీటి సంపులో పడి చిన్నారి మృతి



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** నీటి సంపులో పడి చిన్నారి మృతిచెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. దీంతో భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామంలో ఆదివారం విషాదం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గడిపె అస్మిక(4) అనే చిన్నారి నీటి సంపులో పడి మృతిచెందింది. సంపత్, స్వర్ణలకు ముగ్గురు పిల్లలు కాగా అస్మిక చిన్న కూతురు. కాగా తల్లిదండ్రులు కూలి పని చేసుకుంటూ జీవిస్తుంటారు. ఆదివారం ఉదయం తల్లిదండ్రులు పనికి వెళ్లగా ఇంటి వద్ద ఆడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడింది. స్థానికులు గమనించి 108కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ వచ్చే లోపే చిన్నారి మృతిచెందినట్లు తెలిపారు.

## ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి





**ప్రజాపక్షం/లింగాలఘణపురం:**మండలంలోని కళ్లెం గ్రామానికి చెందిన, కళ్లెం ప్రాథమిక సహకార సంఘం, కురుమ సంఘం, మాజీ అధ్యక్షులు, బండ చంద్రమౌళి, తల్లి, బండ అయ్యమ్మ, ఆదివారం మృతి చెందగా, ఈ విషయం తెలుసుకొని, ఆడపడుచు, చిన్న మంగమ్మ, ఏడ్చుకుంటూ, హఠాత్తుగా గుండెపోటుతో మంగమ్మ మృతి చెందింది. వదిన మరదలు, మృతి చెందడం, కుటుంబానికి తీరని లోటు అని, గ్రామ ప్రజలు, బాధపడ్డారు. గ్రామ ప్రజలు, వీరి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్, మార్పు శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## తవ్వకాల్లో బయటపడిన పురాతన విగ్రహాలు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండవరంగల్ మధ్యలో ములుగు రోడ్డు వద్ద నిర్మాణం కోసం చేపట్టిన తవ్వకాల్లో పురాతన రాతి విగ్రహాలు బయట పడ్డాయి. ఇండస్ట్రియల్ ఎస్టేట్ మూలమలుపు వద్ద పెట్రోల్ బంక్ వెనకాల బయటపడ్డ పురాతన రాతి విగ్రహాలను చూసి తవ్వకలు నిలిపి వేశారు. ఈ విగ్రహాలలో పెద్దమ్మ తల్లిని పోలిన పురాతన విగ్రహం ఒకటి ఉండడంతో పలువురు మహిళలు అక్కడికి చేరుకుని కొబ్బరి కాయలు కొట్టి పూజలు నిర్వహించారు.ఈ విగ్రహాలు ఏ కాలం నాటివి, పురావస్తు శాఖ వారు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

## విజయ షాపింగ్ మాల్‌లో
# విద్యుత్‌ఘాతం

**మూడు బట్టల షాపులు పూర్తిగా దగ్ధం**
**సుమారు రూ.20 కోట్లకు పైగా ఆస్థి నష్టం**



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** జనగామలో ఆదివారం ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. మూడు బట్టల షాపులు దగ్ధమయ్యాయి. సుమారు రూ.20కోట్లకు పైగా ఆస్థి నట్టం జరిగినట్లు సమాచారం. షాట్ సర్క్యూట్ మూలంగా జరిగిన ప్రమాదాన్ని అరికట్టడంతో పూర్తిగా అగ్రిమాపక సిబ్బంది విఫలమైంది. పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికి ప్రయోజనం లేకుండా పోయింది. ప్రమాదం జరిగిన పక్కన బ్యాంక్, ముత్తూట్ ఫైనాన్ కంపెనీలు ఉండడంతో వాటికి కూడా ప్రామాదం పొంచి ఉండగా పోలీసులు అతి జాగ్రత్తగా మంటల్ని ఆర్పి అదుపులోకి తేవడంలో పెద్ద ప్రమాదం తప్పింది. పూర్తి వివరాల్ని పరిశీలిస్తే జనగామలో ఉన్న బట్టల షాపుల్లో అతి పెద్ద షాపు విజయ షాపింగ్ మాల్. ఉదయం 6 గంటల సమయంలో షాప్ నుండి పొగలు రావడంతో సూసిన వారు సమాచారం అందించారు. వెంటనే రంగంలోకి దింగిన పోలీసులు అగ్నిమాపక సిబ్బందిని అప్రమత్తం చేశారు. 6.0 గంటల సమయంలో ఫైర్ ఇంజన్లు అక్కడకు చేరుకొని మంటల్ని ఆర్పే ప్రయత్నంలో నిమగ్నం అయ్యాయి. అయితే మొదటగా విజయ లక్ష్మి షాపింగ్ మాల్‌లో షాట్ సర్క్యూట్ అయి పూర్తిగా దగ్ధం కాగా పక్కనే ఉన్న ఎస్ ఆర్ షాపింగ్ మాల్‌లో మంటలు విస్తరించాయి. మంటల్ని ఆర్పుతున్న క్రమంలో శ్రీలక్ష్మి షాపింగ్ మాల్‌లోకి సైతం మంటలు విస్తరించడంతో పోలీసులు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. అప్పటికే పక్కన ఉన్న ఆలేరు, స్టేషన్‌ఘనపూర్, పాలకుర్తి ఫైర్ స్టేషన్లకు సమాచారం ఇవ్వడంతో అక్కడి నుండి సైతం వాహనాలు వయ్యాయి. ఒకొక వాహనం రెండు, మూడు సార్లు నీటిని నింపుకొని వచ్చినా మంటలు అదుపు కాలేదు. ఉదయం షాట్ సర్క్యూట్‌లో మొదలైనా మంటలు మద్యాహ్నం వరకు అదుపులోకి వచ్చాయి. పోలీసులు ఫైర్ అధికారులు ఎంతకు స్పందించినా ఫలితం లేకపోయింది. రూ.20 కోట్లకు పైగా ఆస్థి నష్టం షాట్ సర్క్యూట్‌తో సుమారు రూ.20 కోట్లకు పైగా ఆస్థి నష్టం జరిగినట్లు అంచనా. విజయ షాపింగ్ మాల్‌లోనే సుమారు రూ.10 కోట్లకు పైగా వస్త్రాలు ఉండగా శ్రీలక్ష్మి, ఎస్ ఆర్ షాపింగ్ మాల్‌లోనూ ఐదేసి కోట్లకు పైగా వస్త్రాలు ఉ న్నాయి. బిల్డింగ్‌తో తదితర వాటితో పోలిస్తే సుమారు రూ.30 కోట్లకు పైగా ఆస్థి నష్టం జరిగిందనే చెప్పాలి. అత్యధికంగా మాత్రం విజయ షాపింగ్ మాల్‌లో నష్టం జరిగింది. బిల్డింగ్ కింది బాగంతో పాటు పై భాగంలోని వస్త్రాలు పూర్తిగా దగ్ధం అయ్యాయి.

**చమటోడ్చిన పోలీసులు, ఫైర్ సిబ్బంది :** ఆదివారం జనగామలో జరిగిన అగ్ని ప్రమాదంలో భారీ మొత్తంలో ప్రమాదం జరిగింది. పోలీసులు, ఫైర్ సిబ్బంది తీవ్రంగా కష్ట పడ్డారు. పొగలు కమ్ముకుంట విషయం తెలియగానే సిఐ దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సిబ్బంది అక్కడికి చేరుకొని పరిశీలించారు. వెంటనే అగ్ని మాపక సబ్బందికి సమాచారం ఇచ్చారు. పాలకుర్తి, స్టేషన్ ఘనపూర్, ఆలేరు స్టేషన్లకు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే అక్కడకు చేరుకొని మంటల్ని ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే వాటర్ అయిపోవడంతో ఇబ్బంద జరిగింది. ఒకొకరు ఒకొక సమయంలో రావడంతో ఇబ్బంది ఏర్పడి. మూడు ఫైర్ ఇంజన్లు ఒకే దఫా రంగంలోకి దిగితో కొంత ప్రమాదం తగ్గేది. అయితే షటర్లు తెరచుకోకపోవడంతో చివరకు జెసిబిల సహాయంలో తొలగించి మంటల్ని ఆర్పే ప్రయత్నం చేశారు.

## పేదలకు వరం సిఎం రిలీఫ్‌ఫండ్
### ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి



**ప్రజాపక్షం/రాయపర్తి:** సిఎం రిలీఫ్‌ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 32 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన సుమారు 880000 రూపాయల విలువగల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి సిఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. పెద్ద మొత్తంలో సిఎం రిలీఫ్ రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నిరుపేదల అభివృద్ధియే లక్ష్యంగా అనేక సంక్షేమాలకు రూపకల్పన చేసి అమలు చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో అనేక సంక్షేమాలు పథకాలు చేపట్టబోతున్నమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అ ధ్యక్షుడు హమ్య నాయక్, మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, పాలకుర్తి సోమనాథ ఆలయ చైర్మన్ కృష్ణమాచార్యులు, మచ్చ నీలయ్య,కుంట రమేష్, ఎండి మహమ్మద్, మహేందర్ రెడ్డి, ఎసి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణారెడ్డి, గుగులోత్ హరిలాల్ పాల్గొన్నారు.

## నీటి కొరత తీర్చిన ఎమ్మెల్యే కెఆర్



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** హసన్‌పర్తి మండలంలోని సిద్ధాపురం గ్రామస్థులు డయల్ యువర్ ఎమ్మెల్యే 8096107107 నంబరుకు ఫోన్ చేసి మోటారు కావాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజుకు తెలిపారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి కొత్త 15 హెచ్‌పిపీ ఓపెన్ వెల్ పంపు సెట్ బిగించారు. ఆదివారం గ్రామ కాంగ్రెస్ నాయకులు, మండల నాయకులు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఆత్మకూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తంగేళ్లపల్లి తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, 66వ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు మంద రాజు, మండల యువజన ఉపాధ్యక్షుడు రుద్రారపు అనిల్, వీసంసురేందర్ రెడ్డి, మాజీ మార్కెట్ డైరెక్టర్ ఆరెల్లి వెంకటస్వామి, ఎర్ర గట్టుగుట్ట ధర్మకర్త తో పాటు తదితరులు పాల్గొన్నారు

## సైకిల్ రైడర్స్‌లో జోష్ నింపిన పోలీస్ కమిషనర్



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన సైకిల్ ర్యాలీలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూతో పాటు, యువత, చిన్నారులు, వృద్దులు, పోలీసులు ఉత్సహంగా పాల్గొన్నారు. ఎజె పెడల్స్, ట్రై సిటి సైకిల్ రైడర్స్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ ర్యాలీలో వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొనగా, సెంట్రల్ జోన్ డిసిపి షేక్ సలీమా పచ్చా జెండా ఊపి ఈ సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయం నుండి హనుమకొండ చౌరస్తా, ఎం.జి.ఎం, మట్టేవాడ పోలీస్ స్టేషన్ తిరిగి ఇదే మార్గం నుండి బాల సముద్రం, నక్కలగుట్ట మీదగా పోలీస్ కమిషనరేట్ కార్యాలయం వరకు చేరుకున్నారు. ఈ ర్యాలీ వరంగల్ పోలీస్ కమిషనర్ సైకిలింగ్ రైడర్స్‌తో కల్సి పోలీస్ అమర వీరులకు జోహర్లు అంటూ నినాదాలు చేస్తు రైడర్స్‌ను ఉత్సహపర్చారు. అనంతరం ఈ సైకిల్ ర్యాలీ పాల్గొన్న సైకిల్ రైడర్లకు పోలీస్ అధికారుల చేతుల మీదుగా సర్టిఫికేట్లను ప్రధానం చేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి రోజు సైకిలింగ్ చేయడం ద్వారా మరింత ఆరోగ్యంగా వుండటంతో పాటు, రోజంతా ఉత్సహంగా తమ విధుల్లో రాణించవచ్చని, ప్రతి ఒక్కరు సైకిలింగ్ కోసం కొద్ది సమయాన్ని కేటాయించడం ద్వారా ఆరోగ్య సమస్యలు దూరం కావవ్చని, అలాగే పోలీస్ అమరవీరులను స్మరిస్తూ నిర్వహించిన ఈ ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పోలీస్ అమరవీరుల కుటుంబాలతో పాటు, పోలీసుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ర్యాలీలో అదనపు డిసిపి రవి, ఎసిపిలు జితేందర్ రెడ్డి, అనంతయ్య, ఇన్స్‌స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఎజె పెడల్స్ యాజమాన్యం, ట్రైసిటి సైకిల్ రైడర్స్, పబ్లిక్ గార్డెన్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, నిట్ కళాశాల విద్యార్థులతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గోన్నారు.

## నరకాసురవధ ఉత్సవాలకు ఏర్పాట్ల పరిశీలన



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** ఈనెల 30న ఉర్సు గుట్ట ప్రాంగణంలో జరిగే నరకాసుర వధ ఉత్సవాల సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వరంగల్ ఏపీపీ నందిరాం నాయక్ తెలిపారు. నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి వినతి మేరకు ఆదివారం ఏసీపీ నందిరాంనాయక్, మిల్స్ కాలనీ సిఐ జూపూడి వెంకటరత్నం, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవితో కలిసి ఉత్సవాల గ్రౌండ్‌ను పరిశీలించారు. ఉత్సవాలు జరిగే విధానాన్ని అధ్యక్షుడు రవి ఎసిపి వివరించారు. ప్రజాప్రతినిధులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బారికేడ్లను నిర్మించాలని ఎసిపి కమిటీకి తెలిపారు. గ్రౌండ్ పరిశీలనలో మిల్స్ కాలనీ సిఐ జూపల్లి వెంకటరత్నం, ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి శతపతి శ్యామలరావు, కోశాధికారి కనుకుంట్ల రవి, ప్రచార కార్యదర్శి మరుపల్ల గౌతమ్, ఆర్గనైజర్లు గౌడ రామ్, కుండె రాజు, మరుపల్ల శివ, కొమ్ము రాజు, దాసరి రాజు ఉన్నారు.

## రైతులు దళారులను ఆశ్రయించొద్దు
### పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**ప్రజాపక్షం/పరకాల :** రైతులు పండించిన ప్రతి వరి ధాన్యం గింజను తెలంగాణ ప్రభుత్వం కొంటుందని రైతులు దలార్ల వద్దకు పోవద్దని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి రైతులను కోరారు. ఆదివారం పరకాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరకాల వ్యవసాయ మార్కెట్లో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి వరి గింజను తెలంగాణ ప్రభుత్వం కొంటుందని ఏ ఒక్క రైతు తొందరపడి దళారులకు అమ్ముకోవద్దని ఆయన రైతులను కోరారు. వరిధాన్యంలో మొదటి రకం ధాన్యానికి 2320 రూపాయలు రెండో రకం ధాన్యానికి 2300 ధరను తెలంగాణ ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. అదేవిధంగా రైతులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను భాగంగా సన్నధాన్యానికి 500 రూపాయల బోనస్ను ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతులు ఫేమస్ శాతం 17 కంటే తక్కువగా ఉండే విధంగా చూడాలని కోరారు. బోనస్ రావాలంటే తేమశాతం తక్కువగా ఉండేవా ఏర్పాట్లను రైతులు చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ఎన్నో రకాల వినూత్న పథకాలను ప్రారంభించి అమలుపరిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే రైతు ప్రభుత్వం అని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. రైతులకు ఏక కాలంలో 2 లక్షల రుణమాఫీ చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన అన్నారు. అదేవిధంగా రానున్న కొద్ది రోజుల్లో రైతులకు రైతు బంధు పథకం ద్వారా వచ్చే డబ్బులను వారి ఖాతాల్లో జమిచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మార్కెట్ కమిటీ చందుపట్ల రాజిరెడ్డి, చైర్మన్ సింగిల్ విండో చైర్మన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొయ్యడ శ్రీనివాస్, సోదా అనిత రామకృష్ణ,దేవేందర్ రెడ్డి,చిన్నాల గొనాద్, మాజీ సర్పంచ్ చందర్, మాజీ ఎంపిపి రామ్మూర్తి తో పాటు నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

## మల్లికార్జునస్వామిని దర్శించుకున్న మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/వరంగల్ :** చేర్యాలలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురెల్లి మల్లికార్జునస్వామి దేవస్థానాన్ని తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దేవాలయ సాంప్రదాయం ప్రకారం ఒగ్గు పూజారులు, వేదపండితులు మంత్రికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. మంత్రి వెంట కొండా సురేఖ, కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రికి ఆలయ అధికారులు స్వామివారి తీర్థ ప్రమాదాలను అందించి వేదాశీర్వచనం చేశారు. స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. ఆలయ సిబ్బందితో కలిసి మంత్రి ఆలయాన్ని, పరిసరాలను పరిశీలించారు. అనంతరం మనువడి పుట్టు వెంట్రుకలను స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. తమ కుటుంబ ఇలవేల్పు అయిన కొమురవెల్లి మల్లన్నను ప్రతీ ఏడాది దర్శించుకుంటామన్నారు. ఆనవాయితీగా తమ మనువడి పుట్టు వెంట్రుకలు సమర్పించేందుకు కొమురవెల్లి దేవస్థానానికి వచ్చినట్లు మంత్రి తెలిపారు. కొమురవెల్లి ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేయాల్సినవసరం ఉందన్నారు. ఆ దిశగా డిపిఆర్‌లు సిద్ధం చేసి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. డిసెంబరులో స్వామివారి కల్యాణం ఉన్నందున కల్యాణం అనంతం అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తామన్నారు. పెండింగ్ పనులు పూర్తికి చర్యలు చేపట్టేలా అధికారులతో చర్చిస్తామని మంత్రి స్పష్టం చేశారు. గొల్ల కురుమలకు ఆరాధ్య దైవమైన కొమురవెల్లి మల్లన్న ఆలయాన్ని యాదగిరి శ్రీలక్ష్మీ నర్సింహస్వామి దేవస్థానం స్థాయిలో గొప్పగా అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూ సమీకరణ సంబంధిత అశాలపై సమీక్షించిన అనంతరం దేవాలయాభివృద్ధికి తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై నిర్ణయానికి వస్తామని మంత్రి కొండా సురేఖ తెలిపారు.

## ఆర్థిక సర్వేలో ప్రతి ఇల్లు సర్వే చేయాలి
### కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** త్వరలో చేపట్టను స్వామాజిక ఆర్థిక సర్వేలో ప్రతి ఇల్లు సర్వే చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సామాజిక ఆర్థిక సర్వే ప్రక్రియపై ఆదివారం రెవెన్యూ, పంచాయతీ రాజ్, సంక్షేమ, ప్రణాళిక, డిఆర్డీఓ, మున్సిపల్ శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే ప్రక్రియ నిర్వహణకు 933 ఎన్యూమరేటర్లు అవసరం ఉన్నదని తెలిపారు. 10 మంది ఎన్యూమరేటర్లుకు పర్యవేక్షణకు ఒక మండల స్థాయి అధికారిని పర్యవేక్షణ అ ధికారిగా నియమించనున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది, డిఆర్డీవీ సిబ్బంది ఎన్యూమరేటర్లుగా నియమించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించే శిక్షణా కార్యక్రమంలో ట్రైనర్లు పాల్గొని తదుపరి మండలస్థాయిలో సర్వే టీములకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సర్వే ప్రక్రియ పర్యవేక్షణ చేయాలని తెలిపారు. సోమవారం ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లుకు నియామకపు ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు సర్వే వివరాలను డేటా ఎంట్రీ పూర్తి చేయాలని తెలిపారు. ఎలాంటి తప్పులకు తావు లేకుండా డేటా ఎంట్రీ చేసేందుకు సిబ్బందిని నియమించి శిక్షణ ఇవ్వాలని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో సిబ్బందిని ఎంపిక చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సిపిఓ నారాయణ రావు, డిఆర్డీఓ అవినాష్, సిపిఓ బాబురావు, సంక్షేమ అధికారి చిన్నయ్య, ఆర్డీఓ మంగిలాల్, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం

**ప్రజాపక్షం/ఏటూరునాగారం:** క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, క్రీడల్లో పోటీతత్వాన్ని అలవరచుకోవాలని మంత్రి సీతక్క తనయుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు సూర్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జడ్పిహెచ్‌ఎస్ క్రీడా మైదానంలో హోప్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్ జరిగాయి. ఈ ఫైనల్స్‌లో మురళి లెవన్, షారు లెవన్ జట్లు తలపడ్డాయి. షారులెవన్ జట్టు 15 ఓవర్లకు ఎనిమిది వికెట్ల నష్టానికి 89 పరుగులు చేయగా మురళి లెవన్ జట్టు 13 ఓవర్ మూడు బాళ్లకు 90 పరుగులు చేసి ఒక వికెట్ కోల్పోయి విజయం సాధించింది. ఈ మేరకు ఫైనల్స్‌లో గెలుపొందిన మురళి లెవన్ జట్టుకు సూర్య కప్‌తో పాటు రూ.30 వేలు మొదటి బహుమతి, రెండవ బహుమతి షారు లెవన్ జట్టుకు రూ.15వేల నగదు, కప్‌ను సూర్య అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. క్రీడాకారుల మధ్య స్నేహం పెంచుకోవాలన్నారు. చెడు మార్గాలను వీడి ఉన్నత స్థాయికి ఎదిగేవిధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పి కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ సలీం, అయ్యగారు రాధాకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## తాగునీటికై తండ్లాట..

**ప్రభుత్వాలు మారినా నీటి కష్టాలు మారలేదు..**
**అధికారుల పట్టింపు కరువు?**



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ములుగు జిల్లా బండారుపల్లి గ్రామంలో గత రెండు మూడు నెలల నుండి మిషన్ భగీరథ నీరు రాక గ్రామస్తులు చాలా ఇబ్బందులుకు గురవుతున్నారు. బండారుపల్లి గ్రామంలోని తండావాసులు గత మూడు నాలుగు నెలల నుండి త్రాగునీటికై నానా అవస్థలు పడుతున్నారు. మిషన్ భగీరథ నీళ్లు రాక ఇబ్బందులకు గురై అదే కాలనీలో ఉన్న ఒక చేతి పంప్ దాదాపు రెండు మూడు నెలలుగా చెడిపోయింది. దీనిపై అదే కాలనీవాసులు చేతి పంపులు మరమ్మత్తులు చేయాలని సంబంధిత కార్యదర్శికి లిఖిత పూర్వకంగా మెమోరాండం ఇచ్చారు. అయినప్పటికి కార్యదర్శి పట్టించుకోలేదని తండావాసులు అంటున్నారు. కార్యదర్శికి ఎన్నోసార్లు మొరపెట్టుకున్న ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో నిధులు లేవని నేను ఏమి చేయలేనని చేతులు ఎత్తేస్తున్నాడని తండావాసులు అంటున్నారు. ఇలా అయితే తండావాసులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని వారు అంటున్నారు. ఇప్పటికే త్రాగునీరు లేక చాలా ఇబ్బందులు పడుతున్న తండావాసులు ఏ అధికారి వద్దకు పోయినా బడ్జెట్ లేదని అంటున్నారు. తప్పా మాకు త్రాగునీరు అందిస్తూ ఉన్నామని ఎవరు అనడం లేదని వారు మొర పెట్టుకుంటున్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ నీరు గాని చేతి పంపు మరమ్మత్తులు చేసి దాని ద్వారా వచ్చిన నీరు గాని మాకు త్వరగా అందించాలని, లేని పక్షంలో తండావాసులు రోడ్డుపైకి ఎక్కి ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని నీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

# అక్రమాలకు పాల్పడిన రైస్‌మిల్లులపై కొరడా

సిఎంఆర్ నిర్లక్ష్యంపై క్రిమినల్ కేసులు




**ప్రజాపక్షం/నిజామాబాద్‌ప్రతినిధి:** కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) అందజేయటంలో నిర్లక్ష్యం వహిస్తున్న రైస్‌మిల్లులపై ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. ప్రభుత్వం నుంచి ధాన్యం స్వీకరించి నిబంధనల మేరకు మర ఆడించిన బియ్యాన్ని తిరిగి ఇవ్వటంలో వైఫల్యం చెందిన రైస్‌మిల్లుల్లో పౌర సరఫరాల శాఖ, విజిలెన్స్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేపడుతుండగా ఇప్పటివరకు ఎనిమిది, 14 రైస్‌మిల్ యాజామాన్యాలపై చర్యలకు ఉపక్రమించారు. బోధన్, బాన్సువాడ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలో అక్రమాలు అధికంగా జరిగినట్లు గుర్తించారు. వర్ని మండలంలోనే ఏకంగా ఐదు రైస్‌మిల్లుల్లో పేరుకుపోయిన సిఎంఆర్ ఆగ్రో ఇండస్ట్రీస్, రాయల్ ట్రేడింగ్ కంపెనీ, ఎస్ఎఆర్ ట్రేడర్స్, వాసి పారాబాయిల్డ్ రైస్‌మిల్, గంగా రైస్‌మిల్లులున్నాయి. నిజామాబాద్ రూరల్ మండలంలోని కాలూర్ శివారులో లక్ష్మీ గణపతి నర్సింహా ఆగ్రో ఇండస్ట్రీస్, బోధన్ మండంలోని శ్రీనివాసనగర్‌లోని దాదాబాయి ఇండస్ట్రీస్, పోతంగల్ మండలం కారేగావ్‌లోని అర్కామ్ ట్రేడర్లపై దాదా బాయి ఇండస్ట్రీస్, పోతంగల్ మండలం కారేగావ్‌లోని అర్కామ్ ట్రేడర్లపై ఇదివరకే క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అత్యధికంగా గంగారైస్‌మిల్ నుంచి రూ. 8.09 కోట్లు, రాయల్ ట్రేడింగ్ కంపెనీ రూ. 6.48కోట్లు, ఎంఎస్ఆర్ ఆగ్రో ఇండస్ట్రీస్ రూ.5.05 కోట్ల బకాయిలున్నట్లు గుర్తించారు. కస్టం మిల్లింగ్ రైస్ (సిఎంఆర్)ను పలువురు మిల్లర్లు భారీగా పక్కదారి పట్టిన ఘటనపై అధికారులు సీరియస్‌గా వ్యవహరిస్తున్నారు.

జిల్లాలోని పలు రైస్‌మిల్లులలో పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేయటంతో పక్కదారి పట్టిన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సుమారు 1,16,245 క్వింటాళ్లకు సంబంధించి రూ.40 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి పట్టించినట్లు గుర్తించారు. అక్రమాలకు పాల్పడిన ఏడుగురు రైస్‌మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అనుమానమున్న మరో ఇద్దరిపై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లాలోని రైస్‌మిల్లర్లలో కలవరం మొదలైంది. అధికారులు సమగ్రంగా విచారణ చేపడితే రూ. వంద కోట్లకు పైగా అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని మరికొందరు మిల్లర్లు పేర్కొంటున్నారు.ప్రభుత్వం నుంచి పొందిన ధాన్యాన్ని రైస్‌మిల్లర్లు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఏడుగురు రైస్‌మిల్లర్లు రూ. 40 కోట్ల విలువైన ధాన్యాన్ని పక్కదారి పట్టించినట్లు విచారణలో తేలింది.

**సుమారు100కోట్లకుపైగా విలువైన ధాన్యంపక్కదారి:** జిల్లావ్యాప్తంగా సుమారు 100 కోట్లకు పైగా విలువైన ధాన్యం పక్కదారి పట్టడంతో పాటు కేటాయించిన ధాన్యం మాయం చేసినట్లు తేలటంతో 14 మిల్లులపై క్రిమినల్ కేసులు పెట్టి, కేటాయించిన ధాన్యం లెక్కలు తీస్తున్నారు అధికారులు. నిందితులపై (ఆర్ఆర్) రెవెన్యూ రికవరీ చట్టం అమలు చేయనున్నారు. జిల్లాల్లో బాయిల్డ్ రైస్‌మిల్లులు 60 ఉండగా రా రైస్‌మిల్లులు 207 ఉన్నాయి. డిఫాల్ట్‌గా ఉన్న మిల్లులకు ధాన్యం కేటాయించవద్దని పౌర సరఫరాల కార్పోరేషన్ నిర్ణయం తీసుకున్నప్పటికీ అది పూర్తిగా అమలు కావటం లేదు.

## విద్యా వికాసాన్ని పంచుతున్న సరస్వతి శిశుమందిరాలు



**ప్రజాపక్షం/గజ్వేల్:** సరస్వతీ శిశు మందిరాలు విద్యా వికాసాన్ని పంచుతూ సమాజంలో తమదైన ప్రత్యేకత చాటుకుంటున్నట్లు మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్ సరస్వతి శిశు మందిర్ లో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం, అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపనను ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్త, సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నరేష్ బాబుతో కలిసి చేసిన అనంతంర ఆయన ప్రసంగించారు. విలువలతో కూడిన విద్యను అందిస్తూ జాతి వికాసంలో తనదైన ముద్ర వేసుకుంటున్న సరస్వతి శిశు మందిరాలు సమాజంలో విద్యా యజ్ఞం లక్ష్యంగా, విద్యార్థుల అభ్యున్నతి, వికాసం, ప్రకాశంతో ముందుకెళ్తున్నట్లు స్పష్టం చేశారు. అంతేకాకుండా తమదైన శైలిలో ప్రత్యేక శిక్షణ, నూతన ఒరవడికి శ్రీకారం చుడుతున్న సరస్వతి శిశు మందిరాలు భిన్నమైన పాత్ర పోషిస్తూ విద్యార్థులను అన్ని రకాలుగా తీర్చిదిద్దుతూ జాతికి అంకితం చేస్తున్నట్లు తెలిపారు. మిగతా పాఠశాలలకు భిన్నంగా అడుగులు వేస్తున్న ఈ పాఠశాలలు జాతీయ భావాన్ని పెంపొందిస్తూండగా, ప్రధాని నరేంద్ర మోడీ ఉన్నత లక్ష్యంతో చేపడుతున్న కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా గజ్వేల్ సరస్వతి శిశు మందిర్ అభివృద్ధికి కృషి చేస్తున్న డాక్టర్ నరేష్ బాబును ఆయన అభినందించారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్ రహీం, ప్రబంధకారిణి, అధ్యక్షులు డాక్టర్ పద్మజ్యోతి, కార్యదర్శి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, శిశు మందిర్ నిర్వాహకులు డాక్టర్ మీలా శ్రీధర్, దొంతి నరేష్, బిజెపి నాయకులు గురువారెడ్డి, నందన్ గౌడ్, పేర్ల శ్రీనివాస్, మనోహర్ యాదవ్, ఎంల్కటీ సురేష్, కమ్మరి శీను, వేణు తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ముధోల్:** మండల కేంద్రంలో హిందూవాహిని శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విప్లవకారుడు భగత్ సింగ్,సాహిత్య స్రామాట్ అన్నాభావు సాఠె,ప్రపంచానికి హిందుత్వాన్ని చాటిన స్వామి వివేకానంద విగ్రహాలను ఆదివారం ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఆవిష్కరించారు.విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా హిందూవాహిని కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు.బైక్ ర్యాలీలో గ్రామస్తులు అనేక సంఘాలు పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.విగ్రహ ఆవిష్కరణ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశ నిర్మాణంలో త్యాగాలు చేసిన మహోన్నత వ్యక్తుల విగ్రాహాలు ఆవిష్కరించడం సంతోషదగ్గ విషయమన్నారు.వారు దేశానికి చేసిన సేవలని గుర్తుచేశారు.వారి స్ఫూర్తి ఆదేశంగా భావించి యువకులు ప్రతి ఒక్కరూ వారి మార్గంలో నడవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నర్సా గౌడ్,పిఎసిఎ,డైరెక్టర్ సుదర్శన్,మాజీ ఎంపీటీసీ దేవోజీ భూమేష్,బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న,మండల బీజేపీ నాయకులు తాటివార్ రమేష్,వరగంటి జీవన్,గ్రామభివృద్ధి సంఘం అధ్యక్షుడు గుంజలోళ్ల నారాయణ,కార్యదర్శి మెత్రి సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రతా ప్రమాణాలు పాటించాలి: ఎస్‌పి జానకి షర్మిల



**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్:** అనుమతులు లేకుండా బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేస్తే పేలుడు పదార్థాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల హెచ్చరించారు.ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నిర్మల్ జిల్లా పట్టణ పరిసర ప్రాంత పరిధిలోని ఆయా గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేసిన,సరైన భద్రతా ప్రమాణాలు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేసిన,విక్రయాలు జరిపిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తసుకుంటామని ఎస్‌పి హెచ్చరించారు.దీపావళిని పురస్కరించుకుని బాణాసంచా తయారీ,విక్రయదారులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని,నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా విక్రయాలు జరిపితే చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్‌పి అన్నారు.

## టివిలను చోరీ చేసిన కేసులో నిందితుడిని పట్టుకున్న రైల్వే పోలీసులు



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** రైల్వేస్టేషన్‌లో నిద్రిస్తున్న ప్రయాణీకుడి వద్ద ఉన్న రెండు టివిలను ఎత్తుకెళ్లిన ఘటన రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ధర్మాబాద్‌కు చెందిన మాధవప్ప నిజామాబాద్‌లో రెండు టివిలను శనివారం కొనుగోలు చేసి ధర్మాబాద్‌కు వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వచ్చి ట్రెయిన్ సమయం ఆలస్యం కావటంతో స్టేషన్‌లో పడుకున్నాడు. అదును చూసి నాందేడ్ జిల్లా కిన్వాట్‌కు చెందిన శంకర్ నాగు అనే వ్యక్తి టివిలను ఎత్తుకెళ్లాడు. లేచి చూసే సరికి టివిలు కనిపించకపోవటంతో ఆందోళన చెందిన బాధితుడు వెంటనే రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దొంగతనం చేసిన టివిలను ఆదివారం స్వంత గ్రామానికి వెళ్లేందుకు ప్రయత్నించగా సీసీ పుటేజీ ఆధారంగా నిందితుడు శంకర్ నాగును ఐడి పార్టీ పోలీసులు హన్మాండ్లు, గురుదాస్ పట్టుకున్నారు. కార్యక్రమంలోఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి, ఆర్‌ఎస్సై ప్రవీన్ పాల్గొన్నారు.

## పత్తి సాగులో గంజాయి సాగు

ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడిన రైతు

16 కేజీల గంజాయి, 17 మొక్కల అవశేషాలు స్వాధీనం

**ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతినిధి:** పత్తి పంటలో లాభాలు వస్తాయో రావు తెలియదు ,పత్తి సాగులో గంజాయి సాగు చేస్తే రెటింపు లాభాలు వస్తాయని ఓ రైతు పత్తి సాగులో గంజాయి సాగు చేసి ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డ ఉదంతం సంగారెడ్డి జిల్లాలో వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్లితే సంగారెడ్డి జిల్లా మట్టుపల్లి మండలం ఉసిరకపల్లి గ్రామంలో మన్నె విఠల్ అనే రైతు తనకు ఉన్న భూమిలో ప్రతి సాగు చేశాడు. పత్తి సాగులో మధ్య మధ్యలో 17 గంజాయి మొక్కలను పెంచాడు. ఈ మొక్కలను ఎండబెట్టి పత్తిచేనులో ఉన్నటు వంటి కొట్టం గంజాయి మొక్కల నుంచి గంజాయిని వేరు చేసి గంజాయిని ఎండబెట్టి శుద్ధి చేశాడు. అమ్మకానికి గంజాయిని తయారు చేసిన క్రమంలో శనివారం సంగారెడ్డి ఎక్సైజ్ ఎస్.టి.ఎఫ్ పోలీసలు గంజాయిని స్వాదీనం చేసుకున్నారు. గంజాయితో పాటు గంజాయి మొక్కల అవశేసాలను కూడా ఎక్సైజ్ పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. ఈ గంజాయిని పట్టుకున్నటు వంటి ఎస్.టి. ఎఫ్ టీమ్‌లో సీఐ వీనారెడ్డి, ఎస్సై అనిల్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ విఠల్ కానిస్టేబుళ్లు సతీష్ ,మోహన్,రామారావు నాయకులున్నారు. ఇదే సంగారెడ్డి జిల్లాలో గత నెలలో మరేడుపల్లి గ్రామంలో పత్తి చేసులో 20 గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు గుర్తించిన ఎక్సైజ్ పోలీసులు వాటిని స్వాదీనం చేసుకున్నారు. ఆ రైతుపై కేసు నమోదు చేశారు. గంజాయిని పట్టుకున్నటు వంటి ఎక్సైజ్ టీం ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వివి. కలమహాసన్ రెడ్డి డిప్యూటీ కమిషనర్ హరికిషన్, అసిస్టెంట్ కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఏఈఎస్ శ్రీనివాసరావు అభినందించారు.

## విహెచ్ పుస్తకావిష్కరణలో పాల్గొన్న ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్




**ప్రజాపక్షం/నిజాంసాగర్:** భారత దేశ రాజధాని ఢిల్లీ నగరంలో గల తెలంగాణ భవన్‌లో ఆదివారం నాడు మాజీ ఎంపి రాజ్యసభ సభ్యులు వీ.హన్మంతురావ్ పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ పుస్తకాన్ని మాజీ స్పీకర్ మీరా కుమారి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపిలు తారిఖ్ అన్వర్, కొప్పుల రాజు, జాతీయ మైనార్టీ అధ్యక్షులు ఇమ్రాన్, ప్రతాప్, జహిరాబాద్ ఎంప సురేష్‌కుమార్ షెట్కార్, అల్లం రాజు, తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మెన్ కాసుల బాలరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హన్మంతురావ్‌ను గురించి వారు కొనియాడారు.

## ఆదివాసీ అడవిబిడ్డలకు అండగా ఉంటాం

ఎంఎల్‌ఎ గడ్డం వినోద్




**ప్రజాపక్షం/కాసిపేట:** ఆదివాసి బిడ్డలు అడవిలో నివసిస్తారు కాబట్టి వారి కష్టాలు తీర్చి వారికి అందుబాటులో ఉంటూ ఎల్లప్పుడూ అండగా ఉంటామని బెల్లంపల్లి ఎంఎల్‌ఎ గడ్డం వినోద్ అన్నారు. ఆదివారం కాసిపేట మండలంలోని మద్దిమాడ గ్రామపంచాయతీ పరిధిలోని సల్పల వాగు వెంకటాద్రి దేవాలయం వద్ద అంగరంగ వైభవంగా ఆదివాసి దండారి దర్బార్ నిర్వహించారు. ఆదివాసి దర్బార్ కు ఎంఎల్‌ఎ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంతకుముందు ప్రభుత్వం ఏం చేసినా చేయకపోయినా, రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని గిరిజనులకు హామీ ఇచ్చారు. మీకు ఏ సమస్య ఉన్న తీర్చడానికి నేను ఉన్నానని ఆదివాసీలకు భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రితో మాట్లాడి ఆదివాసులకు ప్రత్యేక నిధులు కేటాయించి ఆదివాసీల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. అంతకుముందు నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో డప్పు దరువులతో, గుసాడి వేషధారణతో ఘనంగా స్వాగతం పలికారు. ఎంఎల్‌ఎ తన కూతురుతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ నిర్వహణ కమిటీ గౌరవ అధ్యక్షుడు రాయి సిడాం రాందాస్, అధ్యక్షుడు ఆడ జంగు, ప్రధాన కార్యదర్శి సోయం సూరు, పెంద్రం హనుమంతు, వెడమ కిషన్, మడావి గోపాల్,మాడావి వెంకటేష్, ఆత్రం జంగు,తదితరులు పాల్గొన్నారు.

**మండల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తా**

**నెన్నెల :** మండల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని బెల్లంపల్లి ఎంఎల్‌ఎ గడ్డం వినోద్ అన్నారు. ఆదివారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. మన్నెగూడ క్రాస్ రోడ్ వద్ద నుంచి కుష్టేపల్లి కోనంపేట వరకు బీట్ రోడ్డు, మన్నెగూడెం ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రోడ్డును మంజూరు చేశానన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో మన్నెగూడెం కోణంపేట గ్రామస్తుల రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయన్నారు. ఆ ప్రాంత ప్రజల దశాబ్ద కల సాకారం అవుతుందని ఆనందం వ్యక్తం చేశారు. రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గట్టు మల్లేష్, నాయకులు బొమ్మన హరీష్, గౌడ్ తోట శ్రీనివాస్, కిషన్ రెడ్డి, గట్టు బానేష్, బాపు రెడ్డి, ప్రతాపరెడ్డి, పోసిరెడ్డి సంధ్య, శిరీష పాల్గొన్నారు.

## మేమెంతో మాకంత వాటా కావాలి..!




**ప్రజాపక్షం/నిర్మల్‌రూరల్:** దేశ జనాభాలో 90 శాతం నికి పైగా, అత్యధిక శాతం ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి జనాభాకు జనాభా ప్రాతిపదికలన రిజర్వేషన్లను అమలు చేయాలని, నిర్మల్ లో జరిగిన చర్చా వేదికలో పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రోజున నిర్మల్ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలుపై చర్చా వేదికను నిర్వహించారు. ఈ డబ్బులు ఎస్ రిజర్వేషన్లు సమంజసమేనా.. అనే అంశంపై జరిగిన చర్చా వేదికలో, బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు అమలవుతున్న రిజర్వేషన్లలో జరుగుతున్న అన్యాయం గురించి దర్శనం దేవేందర్ ఆధ్వర్యంలో చర్చించారు. కేంద్ర ప్రభుత్వం 2019 లో తీసుకొచ్చిన ఈ రిజర్వేషన్లపై పలువురు మండిపడ్డారు. రాజ్యాంగ హక్కులను తుంగలో తొక్కిజనాభాలో కేవలం 7 శాతం కుడా లేని ఓసిలకు ఆర్థిక వెనుకబాటును సాకుగా చూపి, 10శాతం రిజర్వేషన్లను అమలు చేయడం సమంజసం కాదని అన్నారు. ఇ డబుల్ ఎస్ రిజర్వేషన్ల వల్ల ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థులు, నిరుద్యోగులు ఎన్నో ఉద్యోగ, విద్యా అవకాశాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు అయ్యే వరకు ఉద్యమించాలని ఈ సందర్భంగా పలువురు సూచించారు. త్వరలో అన్యాయాలపై గ్రామ గ్రామాన చైతన్య కార్యక్రమాలను నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేస్తామని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో సంఘం అధ్యక్షుడు వెలుమల ప్రభాకర్, వివిధ సంఘాల నాయకులు జుట్టు గజేందర్, జే.లక్ష్మ ణ్, కటకం మురళి, శంకర్, మారపాక భీమయ్య, లక్ష్మ ణ్, రాజలింగం, రమణ గౌడ్, మహేంద్రా చారి, సాయన్న, రాజన్న, విజయ్ కుమార్, అశోక్ కుమార్, లాద్య రాందాస్, లక్ష్మ ణ్ పాల్గొన్నారు.

## ఆరునెలల్లో సిరాల ప్రాజెక్టు పనుల పూర్తి ...

పునర్నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ శంకుస్థాపన



**ప్రజాపక్షం/బైంసా:** ఆరు నెలల్లో సిరాల ప్రాజెక్టు పనులు పూర్తిచేసి రైతాంగానికి సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే పవార రామారావు పటేల్ అన్నారు. ఆదివారం 8 కోట్ల రూపాయల నిధులతో చేపట్టనున్న సిరాల ప్రాజెక్టు, ఇలేగాం చెరువు పనులకు భూమి పూజ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 18 నెలల క్రితం సిరాల ప్రాజెక్టు భారీ వర్షాలతో తెగిపోయిందని, ఆ సమయంలో తాను అక్కడే ఉండి రైతుల కష్టాలు తెలుసుకోవడం జరిగిందన్నారు. తాను ఎమ్మెల్యే అయ్యాక సిరాల ప్రాజెక్టుకు పూర్వ వైభవం తెచ్చేందుకు తెచ్చేందుకు నిధులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని విన్నవించడం జరిగిందన్నారు. రైతాంగ సంక్షేమమే తన ధ్యేయమని ప్రాజెక్టు పూర్తి చేసి సిరాల ఇలేగాం, దేగాం, రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. ప్రభుత్వం తమది కానప్పటికీ, ప్రభుత్వంతో కోట్లాడి నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి పరుస్తామన్నారు. అప్పటి పాలకుల నిర్లక్ష్య వైఖరి మూలంగా నిజాం కాలం నాటి సిరాల ప్రాజెక్ట్ ను ఎవరు పట్టించుకోలేదన్నారు. ఒకప్పుడు నియోజకవర్గంలో ఇదే పెద్ద ప్రాజెక్టు అన్నారు. రైతులు, మత్స్యకారులు, నష్టపోయారని ప్రభుత్వం వారికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావ్ పటేల్, ప్రాజెక్ట్ కాంట్రాక్టర్ మురళి ధర్ రెడ్డి, డిఇఇ అన్లి కుమార్, మాజీ ఎంపిపి అబ్దుల్ రజాక్, నాయకులు సోలంకి భీంరావ్, సాంళి రమేష్, పండిత్ రావ్ పటేల్, మాజీ సర్పంచ్‌లు చిన్నన్న, శ్రీనివాస్, మహిళ మోర్చా మండల అధ్యక్షురాలు సిరం సుష్మరెడ్డి, మాజీ ఎంపిటిసి సుభాష్, సిరాల, ఇలేగామ్ గ్రామ పెద్దలు, మండల నాయకులు పాల్గొన్నారు.

## మల్లన్నసాగర్ నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి

ప్లాట్ల పట్టాలు, భూమి ఎక్కడుందో తెలువని పరిస్థితి

నిర్వాసితులు కన్నుమూస్తే... కాటికి స్థలం లేని వైనం

డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్



**ప్రజాపక్షం/గజ్వేల్:** మల్లన్న సాగర్ నిర్వాసితులకు భూసేకరణ చట్టం 2013 ప్రకారం పరిహారం, పునరావాసం కల్పించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వాసిత వేములఘాట్ కాలనీలో బాధితులను కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు 1636 కుటుంబాలకు ఇండ్ల స్థలాల రిజిస్ట్రేషన్ చేసినప్పటికీ స్థలాలు చూపించలేదని స్పష్టం చేశారు. అయితే గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే స్పందించి ఇండ్లు, ఇంటి స్థలాలు, ప్యాకేజీలు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల నుండి ముంపు బాధితులను బలవంతంగా ఖాళీ చేయించగా, ఆ సమయంలో నిర్వాసితులకు ఇవ్వాల్సిన రూ.50 వేల రవాణా ఖర్చులను దళారులు కొట్టేసిన వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని తెలిపారు. సర్వం కోల్పోయి అనాథలైన వారి డబ్బులు పక్కదారి పట్టడం దురదృష్టకరం కాగా, తిరిగి చెల్లించే విధంగా ప్రభుత్వం దృష్టి పెట్టాలని చెప్పారు. ముంపు గ్రామాలు వేముల ఘట్, పల్లెపహడ్, ఏట్టిగడ్డ కిష్టాపూర్, ఎర్రవల్లిలో నాలుగు ఉన్నత పాఠశాలలు ఉండగా, ప్రస్తుతం కేవలం ఏటిగడ్డ కిష్టాపూర్‌లో మాత్రమే హై స్కూల్ ఏర్పాటు చేయడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇవ్వగా, కార్యరూపం దాల్చకపోవడంతో వారు అడ్డా కూలీలుగా పనిచేస్తున్నట్లు స్పష్టం చేశారు. ముంపు గ్రామాల్లో బడి, గుడి, అంగన్ వాడి కేంద్రాలు, పంచాయతీ భవనాలు ఉండగా, ప్రస్తుతం అవేమీ కనిపించడం లేదని అన్నారు. నిర్వాసిత గ్రామాల ప్రజలకు ఉపాధి హామీ పనులు చూపించాలని, స్మశాన వాటిక స్థలాలు కేటాయించాలని చెప్పారు. దీనిని దృష్టిలో పెట్టుకొని సీఎం రేవంత్ రెడ్డి వారి సమస్యలను పరిష్కరించి ఇచ్చిన హామీ మేరకు ప్యాకేజీలు వర్తింపచేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు శ్రీనివాస్ రెడ్డి, నర్సింహ రెడ్డి ఉపేందర్, శీను, డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు పాల్గొన్నారు.

## సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం




**ప్రజాపక్షం/తాండూర్:** తాండూరు మండలం ఐబీ కేంద్రంలోని భగత్ సింగ్ భవన్ లో సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్, రాష్ట్ర సమితి సభ్యుడు మిట్టపల్లి వెంకటస్వామిలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తాండూర్ మండలం సిపిఐ పార్టీ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మండల సిపిఐ కార్యదర్శిగా సాలిగామ సంతోష్, సహాయ కార్యదర్శులుగా నరాల ప్రహ్లాద్, మలిశెట్టి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా వాసాల నాగరాజు, కోశాధికారిగా పట్టి శంకర్ లను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం లో రైతు కూలీ సంఘం జిల్లా కార్యవర్గ కొండు బానేష్, బెల్లంపల్లి టౌన్ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, బెల్లంపల్లి రూరల్ మండల కార్యదర్శి బొంతల లక్ష్మి నారాయణ, ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ బయ్య మొగిలి, మాజీ ఎంపిపి కామెర మల్లయ్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేరుకు కిరాణం.. మద్యంవిక్రయం..!

జిల్లాలో జోరుగా బెల్టు షాపులు

పట్టించుకోని ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులు

మద్యం మత్తులో గ్రామాలు...

మాముళ్ళ మత్తులో అధికారులు




**ప్రజాపక్షం/మంచిర్యాలప్రతినిధి:** జిల్లాలో బెల్ట్ షాపుల దందా జోరుగా సాగుతుంది. మారుమూల పల్లెల్లో సైతం మద్యం అమ్మకాలు బార్ షాపులను మించి సాగుతున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. గ్రామాల్లో రాత్రి పగలు తేడా లేకుండా మద్యం అమ్మకాలు యదేచ్ఛగా సాగుతున్న, పల్లెల్లోని ప్రజలు మత్తులో తూలుతున్న పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. గ్రామాల్లో వీధి వీధికి మద్యం దుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకు వస్తున్నాయి. జిల్లాలోని అన్ని మండలాల్లోని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ లైసెన్స్ పొందిన బార్, వైన్ షాపుల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్ణీత ధరలకు మద్యం అమ్మకాలు చేస్తుంటారు, కానీ పల్లెల్లో వెలిసిన బెల్ట్ షాపుల్లో ఇష్టారీతిన ఎంఆర్‌పి ధరలకు మించిన ధరతో మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. వైన్స్, బార్ షాపులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి సమయానుగుణంగా అమ్మకం చేస్తుంటే బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలు అర్ధరాత్రి అనంతరం కూడా కొనసాగిస్తుండటం విశేషం.

**నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపుల నిర్వాహణ**

పల్లెల్లోని ప్రతి వీధిలో ఒక బెల్ట్ షాపు ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. పేరుకు కిరాణం దుకాణంగా ఏర్పాటు చేసి అందులో మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగిస్తున్నారు. వైన్స్ షాపుల్లో తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసి గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుకాణాల్లో అధిక ధరకు అమ్మకం చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఒక దశలో వైన్స్ షాపుల యజమానులు తమ అమ్మకాలను పెంచుకునేందుకు వారే బెల్ట్ షాపులను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. దీంతో ఇదే అదునుగా బెల్టు షాపుల నిర్వహకులు క్వార్టర్‌పై రూ. 30, హాఫ్‌పై రూ.60, ఫుల్ బాటిల్ కనీసం రూ.120 వరకు బీర్ పై రూ.50 అదనంగా వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా వైన్ షాపు లలో ఉండే ప్రతి ఒక బ్రాండ్ మద్యం బెల్టు షాపుల్లో ఉండటం గమనార్హం. ఒక్క మాటలో చెప్పా లంటే ఎక్సైజ్ కేవలం గుడుంబా స్థావరాలపైనే దృష్టి పెట్టడంతో పరోక్షంగా బెల్టు షాపుల నిర్వాహకులను పెంచి పోషించినట్లుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లోని ఏ బెల్టు షాపు తలపు తట్టిన చాలు ఎటిఎం లాగ కావాల్సిన మద్యం ఏ సమయంలోనైన ప్రత్యక్షం అవుతుంది. గ్రామాల్లో మధ్య రాత్రి మద్యం అమ్మకాలు చేయడంతో యువత మత్తులో ఏం చేస్తుందో కూడ అర్థం కాకుండా పోతోంది.

**అధికారుల కనుసన్నల్లోనే..**

జిల్లా వ్యాప్తంగా ప్రతి నెల బెల్టు షాపుల ద్వారా లక్షల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. వైన్స్ యాజమానులు, ఎక్సైజ్ అధికారుల అండదండలతో జిల్లాలోని ప్రతి పల్లెల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు అవుతున్నాయని ఆరోపణలు అధికంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైన జిల్లా యంత్రాంగం అక్రమంగా గ్రామాల్లో నిర్వహిస్తున మద్యం దుకాణాలపై దృష్టిసారించి వాటిని నిర్మూలించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని గ్రామీణ ప్రాంత మహిళలు కోరుతున్నారు.

## క్రీడ

# రెండో వన్డేలో కివీస్ విజయం



## పోరాడి ఓడిన భారత్

న్యూజిలాండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్ రెండో మ్యాచ్‌లో భారత మహిళల జట్టు ఓడింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో టీమ్ఇండియాపై కివీస్ 76 పరుగుల తేడాతో నెగ్గింది. 260 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమ్ఇండియా ఓవర్లకే ఆలౌటైంది. రాధా యాదవ్ (48 పరుగులు) టాప్ స్కోరర్. కివీస్ బౌలర్లలో తహుహు, సోఫీ డివైన్ చెరో 3, కర్సన్, జెస్ కిర్ తలో 2 వికెట్లు దక్కించుకున్నారు. ఛేజింగ్‌లో టీమ్ఇండియాకు తొలి ఓవర్‌లోనే ఎదురుదెబ్బ తగిలింది. ఇన్నింగ్స్ నాలుగో బంతికే స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన (0) పరుగుల ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరింది. ఆ తర్వాత కాసేపటికే మరో ఓపెనర్ షఫాలీ వర్మ (11 పరుగులు) ఎల్‌బీడబ్ల్యూగా వెనుదిరిగింది. ఇక అక్కడ్నుంచి టీమ్ఇండియా వరుసగా వికెట్లు కోల్పోయింది. యస్తికా భాటియా (12 పరుగులు), జెమిమా రోడ్రిగ్స్ (17 పరుగులు) హర్మన్‌ప్రీత్ కౌర్ (24 పరుగులు), హసబిన్స్ (15 పరుగులు) వరుసగా ఔటయ్యారు.

**పోరాడిన రాధ**

భారత్ 108కే 8 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో టీమ్ఇండియా 125 పరుగుల చేయడం కూడా కష్టమే అనిపించింది. కానీ, రాధా య దవ్ అద్భుతంగా పోరాడింది. సైమా ఠాకూర్ (29 పరుగులు)తో కలిసి తొమ్మిదో వికెట్‌కు 70 పరుగులు జోడించింది. భారత్ ఇన్నింగ్స్‌లో ఇదే పెద్ద భాగస్వామ్యం. వీళ్లిద్దరూ పోరాడి ఓటమి అంతరాన్ని తగ్గించారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ నిర్ణీత ఓవర్లలో 2599 పరుగులు చేసింది. కెప్టెన్ సోఫీ డివైన్ (79 పరుగులు), సుజీ బీట్స్ (58 పరుగులు) హాఫ్ సెంచరీలతో రాణించారు. మ్యాడీ గ్రీన్ (42 పరుగులు), జార్జియా (41 పరుగులు) ఆకట్టుకున్నారు. ఇక టీమ్ఇండియా బౌలర్లలో రాధా యాదవ్ 4, దీప్తి శర్మ 2, సైమ ఠాకూర్, ప్రియా మిశ్ర తలో 1 వికెట్ దక్కించుకున్నారు. కాగా, ఇదే సిరీస్‌లో తొలి వన్డేలో భారత్ 59 పరుగుల తేడాతో నెగ్గింది. ఇక తాజాగా రెండో మ్యాచ్‌లో కివీస్ విజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్ 1–1తో సమం అయ్యింది. ఇక ఇరుజట్ల మధ్య చివరి మ్యాచ్ అక్టోబర్ 29న జరగనుంది.



## పాక్‌కు కొత్త కెప్టెన్... బాబర్‌కు రెస్ట్

బాబర్ అజామ్ స్థానంలో సీనియర్ ఆటగాడు, వికెట్‌కీపర్ బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్ పాక్ వన్డే, టీ20 కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఈ మేరకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ప్రకటన చేసింది. స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ సల్మాన్ ఆఘాను వైస్ కెప్టెన్‌గా నియమించారు. నవంబర్ 4 నుంచి ఆస్ట్రేలియాతో జరగనున్న మూడు వన్డేల సిరీస్‌తో రిజ్వాన్ కెప్టెన్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించనున్నాడు. వన్డే సిరీస్ అనంతరం ఆసీస్‌తోనే పాక్ మూడు టీ20లు ఆడనుంది. ఈ సిరీస్‌ల కోసం పాక్ సెలక్టర్లు ఇవాళే జట్లను ప్రకటించారు. ఆసీస్ పర్యటన అనంతరం పాక్ జట్టు జింబాబ్వే టూర్‌కు వెళ్లనుంది. నవంబర్ 24 నుంచి ఆతిథ్య జట్టుతో మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడనుంది. జింబాబ్వే పర్యటనకు బాబర్ అజామ్‌ను ఎంపిక చేయకుండా విశ్రాంతి ఇచ్చారు.

## అలా అయితే జట్టులో చీలికలు..

### రోహిత్, గంభీర్‌కు భారత మాజీ హెచ్చరిక



న్యూజిలాండ్‌తో మూడు టెస్టుల సిరీస్‌లో టీమ్ఇండియాకు ఎదురుండదని అంతా అనుకున్నారు. కానీ, న్యూజిలాండ్ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో గెలిచి భారత్‌కు షాక్ ఇచ్చింది. ఈ సిరీస్ ఓటమితో డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలను టీమ్ఇండియా సంక్లిష్టం చేసుకుంది. దీంతో ఆటగాళ్లు, జట్టు యజమాన్యంపై పలువురు మాజీలు విమర్శలు గుప్పిస్తున్నారు. రెండు మ్యాచ్‌లకూ తుది జట్టును ఎంపిక సరిగ్గా లేదని భారత మాజీ బ్యాటర్ మనోజ్ తివారీ విమర్శించాడు. 'బెంగళూరు టెస్టులో టీమ్ఇండియా ప్రధాన శత్రువు వాతావరణం. ఎందుకంటే ఈ మ్యాచ్‌కు టర్నింగ్ ట్రాక్‌ను సిద్ధం చేశారు. టాస్ గెలిచిన భారత్ మొదట ఫీల్డింగ్ కాకుండా బ్యాటింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ఎందుకు ఎంచుకున్నారో నాకు తెలియదు. అక్కడే భారత్ పతనం మొదలైంది. మ్యాచ్‌కు జట్టు ఎంపిక సరిగ్గా లేదు. తొలి టెస్టులో ఓటమి ఎదురవడంతో తర్వాత మ్యాచ్‌కు తుదిజట్టులో మూడు మార్పులు చేశారు. వాషింగ్టన్ సుందర్‌ను తీసుకోవడం బాగుంది. అయితే, కుల్‌దీప్ యాదవ్ వికెట్లు పడగొట్టలేకపోయాడని దీని అర్థం కాదు. బ్యాటింగ్‌లో లోయర్ ఆర్డర్‌లో సుందర్ పరుగులు చేస్తాడని తుది జట్టులోకి తీసుకున్నారు. ఇది రానున్న రోజుల్లో ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందంటే జట్టులో గందరగోళం, చీలికలు వస్తాయి. టీమ్‌లో ఇప్పటికే అక్షర్ పటేల్ రూపంలో స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ ఉన్నాడు. గతంలో అతడు స్పిన్‌కు అనుకూలించే పిచ్‌లపై వికెట్లు పడగొట్టాడు. కానీ, అక్షర్‌ను పక్కనపెట్టారు. కుల్‌దీప్ యాదవ్‌ను కూడా బెంచ్‌కే పరిమితం చేశారు. తొలి టెస్టులో ఆడని ఆకాశ్‌దీప్‌ను రెండో టెస్టు తుది జట్టులోకి తీసుకున్నారు. సెకండ ఇన్నింగ్స్‌లో అతడితో బౌలింగ్ చేయించలేదు. అంతేకాకుండా బౌలింగ్‌లో జస్‌ప్రీత్ బుమ్రాతో ఇన్నింగ్స్‌ను ప్రారంభించలేదు. ఈ అంశాలన్నీ టీమ్ఇండియాకు ప్రతికూలంగా మారాయి' అని మనోజ్ తివారీ అన్నాడు.

## రీల




## పోస్టర్ తో 'గేమ్ ఛేంజర్' టీజర్ అప్డేట్..

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా కియారా అద్వానీ అలాగే అంజలి హీరోయిన్స్ గా దర్శకుడు శంకర్ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం గేమ్ ఛేంజర్ కోసం అందరికీ తెలిసిందే. ఇక టీజర్ లేదా తరువాత సాంగ్ కోసం ఎదురు చూస్తున్న ఫ్యాన్స్ కి అయితే మేకర్స్ ఇపుడు అప్డేట్ ని ఇచ్చేసారు. లేటెస్ట్ అప్డేట్ తో ఈ సినిమా తాలూకా టీజర్‌ని అతి త్వరలోనే రిలీజ్ చేస్తు న్నట్టుగా తెలిపారు. అలాగే చరణ్ పై అదిరే పోస్టర్ ని కూడా లు క్ రివీల్ చేయకుండా రిలీజ్ చేశారు. మరి ఇందులో చరణ్ కలె క్టర్ లుక్ లో కనిపిస్తున్నాడు. అలాగే తనకి ఎదురుగా చాలా మంది పరిగెత్తుకుని రావడం కనిపిస్తుంది. మొత్తానికి అయితే ఫ్యాన్స్ కి కావాల్సిన అప్డేట్స్ తో ట్రీట్ ని మేకర్స్ అందిస్తు న్నారని చెప్పాలి. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుం డగా ఎస్ జె సూర్య, శ్రీకాంత్, సునీల్, రవిబాబు తదితరులు నటిస్తున్నారు. అలాగే దిల్ రాజు నిర్మాణం వహిస్తున్న ఈ సినిమా రానున్న జనవరి 10న గ్రాండ గా రిలీజ్ కాబోతుంది.



## సందీప్ కిషన్‌తో రీతూ వర్మ 'మజాకా'!

టాలీవుడ్ యంగ్ హీరో, 'పీపుల్ స్టార్' సందీప్ కిషన్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మజాకా' ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాను దర్శకుడు త్రినాథరావు నక్కిన డైరెక్ట్ చేస్తుండగా పూర్తి మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ మూవీ తెరకెక్కుతోంది. ఇక ఈ సినిమా నుండి మేకర్స్ తాజాగా ఓ బిగ్ అప్డేట్ రివీల్ చేశారు. 'మజాకా' సినిమాలో హీరోయిన్‌గా అందాల భామ రీతూ వర్మ నటిస్తున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. ఓ వీడియో రూపంలో ఈ విషయాన్ని వారు వెల్లడించారు. పెళ్లికూతురి గెటప్‌లో రీతూ వర్మ అలిగి కూర్చోగా, ఆమెను ఆటపట్టిస్తున్నాడు సందీప్ కిషన్. ఇక ఈ సినిమాలో రీతూ వర్మ పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉండబోతుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ప్రసన్న కుమార్ కథను అందిస్తుండగా లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నాడు. ఏకె ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్ బ్యానర్లు ఈ సినిమాను ప్రొడ్యూస్ చేస్తున్నాయి. 'మజాకా' చిత్రాన్ని సంక్రాంతి కానుకగా రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు.

## కేవలం తెలుగులోనే 'క'




యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'క' దీపావళి కానుకగా రిలీజ్‌కి రెడీ అయ్యింది. ఈ సినిమాను సుజిత్, సందీప్ ద్వయం డైరెక్ట్ చేస్తుండగా పీరియాడిక్ థ్రిల్లర్ మూవీగా ఈ చిత్రం రానుంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్‌లో చిత్ర యూనిట్ బిజీగా ఉంది. ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేయా లని చిత్ర యూనిట్ ప్లాన్ చేసింది. కానీ, ఇప్పుడు పరిస్థితులు అనుకూలించకపోవడంతో 'క' చిత్రాన్ని కేవలం తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే రిలీజ్ చేస్తున్నట్లు హీరో కిరణ్ అబ్బవరం తెలిపాడు. తాజాగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడాడు. మలయాళంలో 'క' చిత్రాన్ని నటుడు దుల్కర్ సల్మాన్ డిస్ట్రిబ్యూట్ చేసేందుకు సిద్ధమయ్యా డు. కానీ, ఆయన నటించిన 'లక్కీ భాస్కర్' సినిమా అదే రోజున రిలీజ్ అవుతుండ టంతో మలయాళంలో 'క' చిత్రాన్ని రిలీజ్ చేయడం లేదని కిరణ్ అబ్బవరం తెలిపాడు. ఇక తమిళంలో తమకు థియేటర్లు దొరకనందున 'క' చిత్రాన్ని తమిళంలోనూ రిలీజ్ చేయడం లేదని అతడు తెలిపాడు. దీంతో ప్రస్తుతానికి 'క' చిత్రాన్ని కేవలం తెలుగులో మాత్రమే రిలీజ్ చేస్తున్నామని కిరణ్ అబ్బవరం అనౌన్స్ చేశాడు. ఇక ఈ సినిమాను తన హోమ్ బ్యానర్ క ప్రొడక్షన్స్‌పై నిర్మించాడు. ఈ సినిమాలో తన్వీ రామ్, నయన సారిక హీరోయిన్లుగా నటించారు.

## సస్పెన్షన్ ఎత్తివేయండి..

**(మొదటి పేజీ తరువాయి)**

సస్పెన్షన్ ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. తమకు పోలీసు విధులు నిర్వహించడంలో ఎలాంటి అభ్యంతరం లేదని, తమతో అధికారులు పోలీసు విధులు చేయించుకోవడం లేదని వారి స్వంత పనుల కోసం ఉపయోగించుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సస్పెండ్ అయిన వారితో పాటు తాము కూడా ఆందోళనలో పాల్గొన్నామని వారు పేర్కొంటున్నారు. సస్పెండ్ చేస్తే అందర్ని చేయండి లేదంటే అందరిపై సస్పెన్షన్ ఎత్తివేయండి అని వారు ఉన్నతాధికారులకు లేఖలు రాశారు. లేనిపక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని వారు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని టిజిఎస్‌పి బెటాలియన్ క్యాంపస్‌లలో ఆందోళనలో పాల్గొన్న టిజిఎస్‌పి హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు మొత్తం 39 మందిని సస్పెండ్ చేస్తూ డిజిపి డాక్టర్ జితేందర్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.సస్పెండ్ చేయబడిన సిబ్బంది బెటాలియన్లో అశాంతిని ప్రేరేపించారని, పోలీసు శాఖ క్రమశిక్షణను ఉల్లంఘించారని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు క్రమశిక్షణా చట్టాన్ని దెబ్బతీయడమే కాకుండా తెలంగాణలో శాంతి భద్రతల పరిరక్షణకు అంకితమైన యూనిఫాం దళం ప్రతిష్టను దిగజార్చారని డిజిపి పేర్కొన్నారు. ఆందోళనలో పాల్గొన్న వారిపై సమగ్ర విచారణ జరుగుతోందన్నారు. బెటాలియన్ కార్యకలాపాలను నిశితంగా పర్యవేక్షించాలని, సానుకూల పని వాతావరణాన్ని నిర్ధారించాలని సీనియర్ అధికారులను ఆదేశించారు. ప్రవర్తనా నియమాలను ఉల్లంఘించిన సిబ్బందిపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. సస్పెండ్ అయిన టిజిఎస్‌పి హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు తెలంగాణలోని బెటాలియన్ క్యాంపస్‌లతో పాటు హైదరాబాద్‌తో సహా పలు ప్రాంతాల్లోని వీధుల్లో ఆందోళనలు నిర్వహించారని నిర్ధారించారు. పి.వెంకటేశ్వర్లు,స్వామి నాయక్, జి.లింగా రెడ్డి, నరేష్, వి.సతీష్, సతీష్, సతీష్, బి.రమేష్, డి. శ్రీనివాస్, ప్రశాంత్, సంపత్, వినోద్, రాజేష్, రాజు, సతీష్, రమేష్, అభినవ్, రాందాస్, భూషణ్ రావు, పులి రాజు, వెంకటేష్, నయీం, రవి కిరణ్, శ్రీనివాస్ యాదవ్, హనుమా నాయక్, వెంకటేశ్వర్లు, రాములు, షఫీ, సతీశ్రమ్,శ్రీనివాస్,గోపి,ఆర్.రవి, పి.శివ బాల కృష్ణ, తిరుపతి, బానోత్ శేఖర్,. స్వామి, లక్ష్మ ణ్, నవీన్, శివ రామ కృష్ణలు సస్పెండ్ అయ్యారు.

## కేరళ అంటే అలసత్వమా..?

### వయనాడ్‌కు సాయంలో జాప్యంపై ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం అసంతృప్తి

**తిరువనంతపురం:** ప్రకృతి విపత్తు సంభవించిన వయనాడ్‌కు సాయం అందించే విషయంలో కేంద్రప్రభుత్వ జాప్యంపై కేరళ ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తంచేసింది. వయనాడ్‌కు పునరావాసం కల్పించే విషయంలోనూ ప్రతికూల వైఖరితో కేంద్రం ఉందని విమర్శించింది. నెలలు గడుస్తున్నాగానీ వయనాడ్ విపత్తు వర్గీకరణపై స్పష్టత లేదని, కేంద్రం నుంచి ఇప్పటివరకు దీనిపై ఎలాంటి ప్రకటన రాలేదని వ్యాఖ్యానించింది. కేరళ అంటే అలసత్వమా? చిన్నచూపా? అంటూ కేంద్రాన్ని నిలదీసింది. వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన విపత్తుకు 100 రోజులు అయ్యాయి కానీ పునరావాసం కోసం కేంద్రం నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి సాయం అందలేదని రెవెన్యూ మంత్రి కె.రాజన్ అన్నారు. వయనాడ్ కోసం ప్రత్యేక ప్యాకేజి కోరుతున్నట్లు తెలిపారు. కేంద్ర సాయం కోసం ఓపికగా నిరీక్షిస్తున్నట్లు ఆయన ఆదివారం విలేకరులతో చెప్పారు. కేంద్ర సాయం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేకసార్లు డిమాండ్ చేసినట్లు తెలిపారు. 'రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్‌డీఆర్‌ఎఫ్) కాదు వయనాడ్ కోసం కేరళ కోరుతున్నది ప్రత్యేక ప్యాకేజి. విపత్తు నివారణ చట్టం కింద ఇప్పటికే కేంద్రానికి మెమోరాండాన్ని అందజేశాం. ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధిగా వచ్చిన దాని గురించి మాత్రమే కేంద్రం మాట్లాడుతోంది. వారు చెప్పే దానికి, మేము కోరుతున్న దానికి మధ్య సంబంధం లేదు' అని మంత్రి అన్నారు. రాష్ట్రంలో పెద్ద/చిన్న విపత్తు సంభవిస్తే ఎస్‌డీఆర్‌ఎఫ్ నుంచి కొంత ఇస్తారు కానీ వయనాడ్‌కు కావల్సినది ప్రత్యేక ప్యాకేజి అని ఆయనన్నారు. ఈ విషయంలో కేంద్రం మౌనం వహిస్తోందని, ఇప్పటివరకు వయనాడ్ విపత్తును ఏ విభాగం కిందకు వర్గీకరించిందో చెప్పలేదన్నారు. వయనాడ్ విపత్తును ఎల్1, ఎల్2 లేక ఎల్3 విభాగాల్లో దేని కింద పరిగణిస్తారో వెల్లడించలేదని మంత్రి తెలిపారు. ఎల్3గా పరిగణిస్తే వయనాడ్ పునరావాసం కోసం దేశవ్యాప్తంగా లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు సహకారం అం దించవచ్చన్నా రు. కేంద్రం స్పందన కోసం ఓపికగా ఎదురు చూస్తున్నామని చెప్పారు. కేంద్రం నుంచి తప్పక సాయం అందుతుందని ఆశగా ఎదురు చూస్తున్నామని రాజన్ అన్నా రు. విపత్తు వేళ రాష్ట్రాన్ని నాశనం చేసే లక్ష్యం తో కేంద్రం వ్యవహరించినట్లు సీఎం పినరయి విజయన్ మం డిపడిన ఒక రోజు తర్వాత రాజన్ చేసిన ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది.




## క్రౌన్ అందుకున్న రేచల్ గుప్తా

**(మొదటి పేజీ తరువాయి)**

70 దేశాలకు చెందిన సుందరాంగులు పాల్గొన్నారు. వారందరినీ వెనుకకు నెట్టి రేచల్ టైటిల్ సాధించారు. ఈ విజయంతో రేచల్ 'గ్రాండ్ పీజెంట్ చాయిస్' అవార్డును కూడా గెలుచుకుని మిస్ యూనివర్స్ 2000 లారా దత్తా సరసన చేరారు. ఈ విజయాన్ని రేచల్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసుకున్నారు. భారతదేశ చరిత్రలోనే తొలిసారిగా గోల్డెన్ క్రౌన్‌ను గెలుచుకున్నట్లు రేచల్ తెలియజేశారు. ఈ సందర్భంగా తనపై విశ్వాసం ఉంచిన అందరికీ రేచల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది ఆగస్టులో మిస్ గ్రాండ్ ఇండియా టైటిల్ గెలుచుకున్న రేచల్ గుప్తా మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ పోటీలకు అర్హత సాధించారు. రేచల్ 2022లో 'మిస్ సూపర్ టాలెంట్ ఆఫ్ ద వరల్డ్ టైటిల్ కూడా గెలుచుకున్నారు. ఇన్‌స్టాలో ఆమెకు 10 లక్షల మంది ఫాలోయర్లు ఉన్నారు. ఇప్పుడు మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ 2024 విజేతగా నిలిచిన రేచల్ గుప్తా గ్లోబల్ అంబాసడర్‌గా ప్రపంచ శాంతి, స్థిరత్వంపై ప్రచారం కల్పిస్తారు.










## వ్యతిరేకించడం వల్లే

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రభుత్వమే హత్యచేసిందన్నారు. 90 శాతం అంగవైకల్యం, పోలియో ఇతర 19 రకాల వ్యాధులతో బాధపడుతున్నప్పటికీ మందులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసిందన్నారు. అరెస్ట్ చేసిన సంధర్భంలో సాయిబాబా వినియోగించే వీల్‌చైర్‌ను కావాలని ద్వంసం చేశారని, అంబులెన్స్‌లో హాస్పిటల్‌కు తీసుకెళ్లే సంధర్భంలో తన కుడి చెయ్యిని బలవంతంగా లాగడం తీవ్ర నొప్పితో బాధపడ్డారని చెప్పారు. జైలు నిబంధనల ప్రకారం సమయానికి ఎమర్జెన్సీ మందులు, పుస్తకాలు, ఇతర సామాగ్రిని ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారన్నారు. దళితుల పక్షాన, పీడిత ప్రజల పక్షాన ఆదివాసీల ప్రభుత్వాలపై దమనకాండకు వ్యతిరేకంగా మాట్లాడినందకు ప్రభుత్వం కక్ష కట్టిందన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, కార్పోరేటీకరణకు వ్యతిరేకంగా ఆదివాసీలను హననం చేసే ఆపరేషన్ గ్రీన్ హంట్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఎన్నో సభలు, సమావేశాలు నిర్వహించినందుకే ప్రభుత్వం అక్రమ కేసు మోపి జైల్లో నిర్బంధించిందన్నారు.నిర్దోషి అయి ఉండి అన్యాయంగా అక్రమంగా పదేండ్ల నిర్బంధ జైలు జీవితం గడిపి అసువులు బాసిన హక్కుల నేత తండ్రి ఆశయాలను అందరూ కలిసి కొనసాగిద్దామని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు వీరగోని పెంటయ్య, రిటైర్డ్ ఎంఈవో శ్రీపతి రాజగోపాల్, పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మార్వాడి సుదర్శన్, డీఎల్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ముడిమాడుగుల మల్లన్న, సిపిఎం జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి, మానవ హక్కుల వేదిక నాయకులు కె.అజయ్ , ఆవునూరి సమ్మన్న, రచయిత అన్నం దేవేందర్, ప్రముఖ రచయిత చుక్క గంగారెడ్డి, దొగ్గల రాజు, కందుకూరి అంజయ్య, తాళ్లపల్లి లక్ష్మ ణ్, లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఆరెల్లి మల్లాగౌడ్, తదితరులున్నారు.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com